1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 5
సంచిక : 2
పుటలు : 52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు

ఏప్రిల్ 2019

ఏబయ్యారు వాద్యాలు....నూటొక్క రాగాలు











తెలుగునూ తెలుగు ప్రజలనూ వంచిస్తున్న పాలకవర్గాలు



ఇన్నాళ్ళూ తమను కడుపులో దాచుకున్న అడవితల్లి ధ్వంసం అవుతుంటే
మూగపోతున్న గొంతుల్ని సవరించుకుంటూ పాటని, ఆ పాట లయలో మిళితంగా ఉన్న
నృత్యాన్ని ఇంకా నమ్ముకున్నారు. జీరలు పడుతున్న గొంతులోని పాటనీ,
బీటలు పడుతున్న వాద్యాలని మరెంతో కాలం నిలుపుకోలేమని తెలిసి హతాశులవుతున్నారు.

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...

◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...

◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



ఏప్రిల్ 2019

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి editorammanudi@gmail.com కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము.

వలగూడు (ఇంటర్నెట్)లో www.ammanudi.org చూడండి.

లోపలి పుటలలో....

రేఖాచిత్రాలు: **పావులూరి చిదంబరేశ్వరరావు**

వ్యంగ్యచిత్రాలు: **సరసి** కంప్యూటరీకరణ : **లంకె జనార్దన్**

'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలు కొందరు వాట్సప్ (watsup) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు ఆమోదించజాలమని తెలుపుతున్నాము. దయచేసి పోస్టులోగాని, లేదా editorammanudi@gmail.com కుగాని పంపించండి.

– సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

కార్యాలయం : 0866-2439466 సంపాదకుడు : 9848016136 *e-mail* : editorammanudi@gmail.com

తెలుగుజాతి పత్రిక
అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

చందా వివరాలు

		వ్యక్తులకు	సంస్థలకు	విదేశీయులకు
శాశ్వత చందా	:	రూ.5000	రూ.7500	--
5 సం॥	:	రూ.1000	రూ.1500	150 డాలర్లు
3 సం॥	:	రూ. 700	రూ.1000	75 డాలర్లు
1 సం॥	:	రూ. 240	రూ. 400	25 డాలర్లు

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

AMMA NUDI - AXIS BANK, TENALI

అక్కౌంట్ నెం. **915020010550189**

IFSC Code : UTIB0000556

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

డా॥ సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.

చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

'అమ్మనుడి' ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు-1.** ఫోన్:7386223538.

హెచ్చరిక

'అమ్మనుడి' పత్రిక సిసి-బై-ఎస్ఎ లైసెన్సు (క్రియేటివ్ కామన్స్ - అట్రిబ్యూషన్ షేర్ అలైక్) లో ప్రచురిత మవుతున్నది. దీని ప్రకారం ఈ పత్రికలో ప్రచురించిన వాటిని తిరిగి స్వేచ్ఛగా ఎవరైనా తమ రచనల్లో వినియోగించు కొని స్వయంగా గాని, ఇతరుల ద్వారా గాని, సోషల్ మీడియాలో గాని వాటిని ప్రచురించుకోవచ్చు. అయితే, ఆ సందర్భంలో - ఆ తొలి రచయిత పేరును, 'అమ్మనుడి' ఫలానా సంచిక నుండి తీసుకున్నట్లూ తప్పక ఉటంకించాలి. దయచేసి ఈ అంశాన్ని రచయితలు, ప్రచురణ కర్తలు, చదువరులు గమనించ గోరుతున్నాము

అమ్మభాష తెలుగును కాపాడుకొనే
ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురిస్తున్నాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల తెలుగు పిల్లలకు - మొత్తంగా తెలుగు జాతికి - కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల నుంచి ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికం పంపిస్తున్నాము.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.
- దయచేసి 3వ పుటలోని 'రచయితలకు సూచనలు' చూడండి

సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. ఫోన్ : 9848016136.
e-mail : editorammanudi@gmail.com

STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS OF

"AMMANUDI", MONTHLY MAGAZINE, **Tenali**

as required under Rule 3 of the Registration of News Papers (Central) Rules 1956.

FORM IV (See Rule 3)

1. Place of Publcation	:	Angalakuduru
2. Periodicity	:	Monthly
3. Printer's Name	:	SAMALA LAKSHMANA BABU
4. Whether Citizen of India	:	Yes
5. Address	:	D.No.8-386, Angalakuduru Post, Tenali Mandal - 522 211 Guntur Dist., A.P.
6. Publishers Name	:	SAMALA LAKSHMANA BABU
Address	:	As above
7. Editor's Name	:	SAMALA RAMESH BABU
Address	:	As above
8. Names & Addresses of individuals who own the News Paper	:	SAMALA LAKSHMANA BABU As above

I, Samala Lakshmana Babu, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

sd/- S. Lakshmana Babu
Publisher

Tenali
30-03-2019

మీరు 'అమ్మనుడి' చందాదారులేనా...

'అమ్మనుడి పత్రికకు చందాదారులు పంపే చందా సొమ్మే ఆధారం. కనుక –

1. తాము చందాదారులైతే మీకు పంపే పత్రిక కవరుపై చందా ఏ నెల వరకు ఉన్నదీ పేర్కొని వుంటుంది. దయచేసి దానిని గమనించి, సకాలంలో మీ చందా సొమ్మును పంపించి పత్రికను ఎల్లప్పుడూ అందుకోండి.

2. తాము చందాదారులు కాకపోయినా, తమకు గౌరవ ప్రతిగా (కాంప్లిమెంటరీగా) ఉచితంగా అందుతూ వుండవచ్చు. అటువంటి మిత్రులకు పత్రిక నచ్చితే, దయచేసి చందాను పంపించి తోడ్పడగలరు. పత్రిక నచ్చకపోయినా, మీకు ఆసక్తి లేకపోయినా 'పత్రికను పంపవద్దు' అని దయచేసి ఒక కార్డుపైగాని, ఎస్.ఎం.ఎస్ / మెయిల్‌గాని పంపించి సహకరించగోరుతున్నాము.

3. పత్రికకు చందాను చెల్లించేవారు తమ ఇష్టాన్ని బట్టి శాశ్వత చందా (రు. 5000/-)గాని, 5 సం॥ల చందా (రు.1000/–లు)గాని, 3 సం॥ల చందా (రు. 700/–లు)గాని పంపి పత్రికను ఆర్థికంగా తోడ్పడగలరు. వీలుగాకపోతే సం॥ చందా రు. 240/–లు పంపించి ఏటా పునరుద్ధరించుకోవచ్చు.

– ప్రచురణకర్త, అమ్మనుడి.

తెలుగులో 'ర్యాప్'కు పెరుగుతున్న ఆదరణ

కొందరు సంప్రదాయవాదులు పాశ్చాత్య పోకడగా కొట్టి పారేసినా ర్యాప్ అనేది ఈ తరం యువతకు బాగా నచ్చుతోంది.

90లలో వచ్చిన జెంటిల్‌మాన్ సినిమాలో పేటర్యాప్ పాటతో ర్యాప్‌ను పరిచయం చేసారు అప్పటి దర్శకులు.

ఈ మధ్య రోల్‌రైడా బిగ్‌బాస్ లో పోటీదారుల్లో ఒకరిగా ఉంటూ ర్యాప్ తెలుగులో ఎలా ఉందోనన్న విషయాన్ని మరింత మంది ప్రేక్షకులకు చూపించారు.

డ్రమ్ములు, ఇతర సంగీత వాద్యాల దరువులో లయబద్ధంగా వాక్యాలను పదాలను ఒక నియమం లేకుండా వాగేస్తూ వెళితే ర్యాప్ తయారవుతుంది.

రోల్ రైడా, ప్రణవ్ చాగంటి, మేఘరాజ్ రవీంద్ర, మెక్‌ఉనీక్, మెక్‌మైక్ ఈ ర్యాప్ రంగంలో తెలుగు ర్యాప్‌తో రాణిస్తున్నారు.

"పతంగ్" ర్యాప్‌తో రోల్ రైడా, "పానిపురి"తో ప్రణవ్ చాగంటి, "జింపక్ చిపక్" తో మెక్‌ఉనీక్, మెక్‌మైక్ పూర్తి ప్రాంతీయ అంశాలను ర్యాప్‌లో బంధించి వినోదానికి సంబంధించిన పదాలు వాడితే, "మనం", "ధూర్జటి" ర్యాప్ లతో మేఘరాజ్ రవీంద్ర స్త్రీల భద్రత, పౌర అవగాహన లాంటి సామాజిక అంశాల పై కొంత గంభీరమైన ర్యాప్‌లు రూపొంది స్తున్నారు.

ఏ ఒక్క విషయంలోనూ తెలుగువారు వెనకబడలేదు అని నిరూపిస్తూ తెలుగులో ర్యాప్‌కర్తలు బయలుదేరారు.

ర్యాప్‌కు ఒక నిర్దిష్ట సంగీతం ఉండాలి, అది వినే వారిని పూర్తిగా ఆకర్షించి, పాటలో వచ్చే మాటలకు, ధ్వను లకు చిటికెలు, చప్పట్లు, స్వరానుగుణంగా పదాల్ని కదిపేలా చేయాలి.

ఇందుకు సంగీతం రూపొందించి తదనుగుణంగా పదాలను అల్లాలి, పదాలకు సరిపోయే విధంగా సంగీతాన్ని మార్చాలి. ఒక పాట పూర్తవడానికి నెలలు, సంవత్సరాలు పట్టవచ్చు.

మనం ఒకసారి విని వదిలేయవచ్చు, మళ్ళీ మళ్ళీ విన వచ్చు. కానీ ఒక ర్యాప్ చేయడం వలన ర్యాప్‌కర్తలకు దక్కే డబ్బు ఏమీ ఉండదనే చెప్పాలి. మన తెలుగు ర్యాప్‌కర్తలకు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి చాలా కష్టపడాల్సి వస్తోంది.

పాశ్చాత్య దేశాలలో నిత్యం ఎదురవుతున్న ద్వేషాన్ని, అసహ్యాన్ని ఎదురిస్తూ నల్లవారు రూపొందించుకొన్న ఈ వినూత్న పద్ధతి ర్యాప్. ఒక వాక్యాన్ని గబ గబా సంగీతబద్ధంగా పాడుతూ, తమకు జరుగుతున్న సామాజిక అన్యాయాన్ని బయటపెట్టుకున్నారు పాశ్చాత్యులు.

మరి తెలుగులో ర్యాప్ ఎందుకు? తెలుగులో సామాజిక రుగ్మతలను ఎండకడుతూ వస్తున్న సాహిత్యం యువతకు చేరువగా ఉండటం లేదు. ఈ ర్యాప్ పద్ధతి వినూత్నంగా ఉండటంతో యువత అందులోని పదాలను పసిగట్టి అమలు పరుచుకునే అవకా శాలు ఎక్కువ. కానీ ఆర్థిక భరోసా లేకుండా ఈ ర్యాప్‌లోకి యువ కులు చేరలేరు. ఒకరిద్దరు యూట్యూబులో తమ వీడియోలను చేర్చి, వాటికి వచ్చిన వీక్షణల ఆధారంగా వస్తున్న వాణిజ్య ప్రకటనల ద్వారా ఒకటి అర పైసలను కూడబెట్టుకొని వాటితో మరొకటి అనట్టు చేస్తున్నారు.

సినిమాల నిర్మాతలు ర్యాప్‌ను ప్రోత్సహించి సినిమా లలో భాగంగా చేస్తే, ర్యాప్ కు ఆదరణ లభించవచ్చు.

అ ఆ, కాలా, హలో, హుషారు సినిమాల ద్వారా ర్యాప్‌ను సినిమాలకూ ప్రవేశపెట్టారు.

ర్యాప్‌కర్త ప్రణవ్ చాగంటి ర్యాప్‌ను తెలుగు వచన కవిత్వా నికి ఆధునిక రూపంగా చూస్తానంటున్నాడు.

"ప్రేక్షకులు మేము చేసే ర్యాప్‌ను పాశ్చాత్య ర్యాప్‌తో పోల్చు తారు. పాశ్చాత్యులను అనుసరిస్తూ ర్యాప్‌ని తెలుగులోకి తెచ్చా మంటారు. కానీ తెలుగులో వేములవాడ భీమకవి, సోమనాథుడు ఎప్పుడో ధిక్కార కవిత్వంతో ముందుకొచ్చారు. వారి బాటలోనే సంప్రదాయ సంగీతానికి ప్రత్యామ్నాయంగా ర్యాప్ ప్రాచుర్యంలోకి వచ్చేలా చేస్తున్నాం." అని ప్రణవ్ అన్నాడు.

– రహ్మానుద్దీన్ షేక్
9686903386

ఓట్లు అడిగేది తెలుగులో...పరిపాలించేది ఉత్తర్వులిచ్చేది ఇంగ్లీషులోనా?

సంపాదకీయం

తెలుగునూ తెలుగు ప్రజలనూ వంచిస్తున్న పాలక వర్గాలు

ఆంధ్రప్రదేశ్ శాసనసభకు జరుగనున్న ఎన్నికల సందర్భంగా ఈ సంపాదకీయాన్ని ప్రచురిస్తున్నాం.

ఈ సంపాదకీయాన్ని వ్రాస్తున్న సమయానికి అన్ని రాజకీయ పార్టీల ఎన్నికల వాగ్దాన పత్రాలూ ఇంకా మా చేతికి అందలేదు. సి.పి.ఐ – సి.పి.ఐ (ఎం) లు ప్రచురించిన 'నూతన రాజకీయ ప్రత్యామ్నాయ కార్యక్రమం' మాత్రమే అందింది. 'తెలుగు ప్రజలకు బిజెపి, కాంగ్రెస్ తీవ్రద్రోహం చేశాయి. వాటితో కలిసి తెలుగుదేశం, వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ ప్రజలను మోసం చేశాయి' అందుకు చరమగీతం పాడడానికే తాము ఐక్యంగా ఒక ప్రత్యామ్నాయాన్ని ప్రజల ముందుంచుతున్నామని ఆ పార్టీలు చెప్పాయి. జనసేనతో కలిసి తాము ఐక్య ప్రత్యామ్నాయంగా ఈ ఎన్నికల్లో ముందుకు వస్తున్నది ఇందుకేనని కూడా మనకు అవగాహన కలిగించారు.

వారు విడుదల చేసిన 'నూతన రాజకీయ ప్రత్యామ్నాయ కార్యక్రమం' రచనను 'తెలుగు ప్రజలు' అనే మాటతో మొదలు పెట్టినా – ఈ ప్రజల తెలుగు మౌలికత ఎలా ధ్వంసం అవుతున్నదో వివరించాల్సిన అవసరాన్ని విస్మరించారు. భారత జాతీయోద్యమాన్ని, అందులో భాగంగా ప్రజాస్వామిక దృక్పథంతో కమ్యూనిస్టులు జాతీయోద్యమంతోపాటు తెలుగు భాషా రాష్ట్రంకోసం చేసిన ఉద్యమాలనీ, చరిత్రనూ నాలుగు మాటల్లోనైనా ప్రస్తావించడం మరచిపోయింది. అందుకనే – 'ఈ రాష్ట్రం తెలుగు రాష్ట్రం. తెలుగువారు తమ భాషలో తాము ప్రభుత్వ పరిపాలనను, తమ మాతృభాషలోనే నిరంతర విజ్ఞాన సాధన కృషిని సాగించడం ద్వారా మాత్రమే అసలైన ప్రజాస్వామ్య పాలనను స్థాపించగలరు' అనే స్పష్ట ప్రకటనతో మొదలు పెట్టాలనే ఇంగితాన్ని ఆ కార్యక్రమ రూపకర్తలు కోల్పోయారు!

అయితే, 'ప్రభుత్వ రంగంలో విద్య, అధిక నిధులు' అన్న శీర్షిక క్రింద పేర్కొన్న మూడు అంశాల్లో ఒకటిగా (36) "మాతృభాషలో విద్యాబోధన, తెలుగుభాష పరిరక్షణ, ప్రాచీన భాషగా గుర్తింపుకు చర్యలు, ఇంగ్లీషు మీడియంతో సహా ఏ భాషనైనా ఐచ్ఛికంగా ఎంపిక చేసుకొనే అవకాశం" అని తమ విధానాన్ని ముక్తసరిగా తెలియజేశారు. ఈ కొద్ది అక్షరాలు – వారి తెలియనితనాన్నీ, విశాల హృదయాన్ని తెలియ జేస్తున్నాయి. 'ప్రాచీన భాషా ప్రతిపత్తి' ప్రధాన సమస్య కాదు గదా, అసలు సమస్యే కాదు. పోరాటం చేసి ఆ ప్రతిపత్తిని 2009 లోనే సాధించాం. నిధులూ విడుదలయ్యాయి. పరిశోధనా ప్రక్రియ మొదలయ్యే తరుణంలో నాటి సమైక్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విభజన తర్వాత నేటి రెండు తెలుగు రాష్ట్రాలు చేపట్టిన అస్తవ్యస్త చర్యల వల్ల అది ఎక్కడి గొంగళి అక్కడేగా ఉండిపోయింది. అసలు ఇప్పుడు కావలసినది – ఒక ఆధునిక భాషగా తెలుగును అభివృద్ధి చేయడానికీ, దాన్ని ప్రయోజనకరం చేసేందుకు విద్యారంగంలో అన్ని స్థాయిల్లోనూ తెలుగును వినియోగించడం. ఇందుకోసం స్పష్టమైన విధానాన్ని ప్రభుత్వం చేపట్టాలి. ఆ అవగాహనే ఈ 'కార్యక్రమ' రూపకర్తలకు లేదని అర్థమవుతున్నది. 'మాతృభాషలో విద్యాబోధన', 'తెలుగు భాష పరిరక్షణ' అనే రెండు ముచ్చటైన మాటలను 'మంత్రాలు' వల్లించినట్లు వ్రాశారు.

వామపక్ష భావజాలం కలిగిన కమ్యూనిస్టు పార్టీలలో భాషోద్యమంతో సంబంధం కలిగివున్న వారినైనా సంప్రదించకుండా వ్రాసిన పత్రం ఇది అని తెలుస్తూనే ఉంది.

ప్రత్యామ్నాయంగా అధికారంలోకి తమని ఎన్నుకోవాలని కోరుతున్న 'జనసేన కూటమి' భాగస్వామ్య పార్టీలైన ఉభయ కమ్యూనిస్టు పార్టీల కార్యక్రమ పత్రాన్ని గురించి తెలుసుకున్నాం. కమ్యూనిస్టు సిద్ధాంతాలను బాగా అధ్యయనం చేసిన పవన్ కళ్యాణ్, సినిమా పరిశ్రమను వదులుకొని రాజకీయాల్లోకొచ్చారు. 'జనసేన పార్టీని స్థాపించి, 2004 ఎన్నికల్లోనే పోటీ చేయాలనుకున్నా, అధికారమే తన పరమావధి కానందువల్ల పోటీ చేయలేదని, అనుభవజ్ఞుడైన చంద్రబాబువల్ల కొత్త రాష్ట్రం బాగుపడుతుందని భావించాననీ, అది జరుగనందున ఇప్పుడు తాను పోటీ చేస్తున్నానని ఆయన వివరించారు. ఇప్పుడు గెలుపే లక్ష్యంగా పోటీ చేస్తూ, తెలుగుదేశం, వైఎస్ఆర్‌లతో సమ ఉజ్జీగా సంచలనం కలిగించగలుగుతున్నారాయన.

విద్య, వైద్య రంగాలను పూర్తి ఉచితంగా అందుబాటులోకి తెస్తామని పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఆయన ఆలోచనలు సామాన్య ప్రజలనూ, మేధావులనూ ఆలోచింపచేస్తున్నాయి. వ్యవసాయం గురించీ, ప్రభుత్వాల ఆకర్షక పథకాల అమలు గురించీ, సెజ్‌ల గురించీ ఆయన ఆలోచనలు ప్రత్యామ్నాయాల పట్ల ఆసక్తిని కలిగిస్తున్నాయి. తానే ప్రత్యామ్నాయ విధానాలతో, ప్రజలకు మంచి పరిపాలనను అందించగలనని భరోసా ఇస్తున్నాడు.

అయితే – ఇప్పుడు తె.దే.పా., వై.కా.పా లలో ఎవరు ముందుంటారనే చర్చ జరుపుతున్నవారు, జనసేన స్థానం ఏమిటో నిర్ధారించలేకున్నారు. తనంతట తానే అధికారంలోకి రాగల శక్తి 'జనసేన'కు లేదనీ, తెదేపా –వైకాపాలతో ఎవరికీ ఆధిక్యత రాకపోతే – నిర్ణాయక శక్తిగా అవతరించగల అవకాశాలు మాత్రమే ఉన్నాయని ఆశావాదుల అంచనా. ఇదంతా ఏమీలేదు, ఆ రెండింటిలోనే ఏదో ఒక పార్టీ అధికారంలోకి దూసుకు రాగలదనే వారే ఎక్కువగా ఉన్నారు.

ఫలితాలు ఏమైనా కావచ్చు. ఏ పార్టీ అయినా అధికారంలోకి రావచ్చు. ఎవరైనా ముఖ్యమంత్రి కావచ్చు. మన పాలక వర్గాలు ప్రజాస్వామ్యబద్ధ పాలనకు అంకితమై ఉంటారని ఆశించడం అవివేకం. తెదేపా, వైకాపాల నేతల వర్గ స్వభావం అందరకూ తెలిసిందే. ఒకవేళ పవన్‌కు అధికారపీఠం దక్కినా, ఆయన వర్గ స్వభావానికి దూరంగా ఆదర్శ నేతగా దర్శనమిస్తారనుకోవడం మరింత అవివేకం మాత్రమే అవుతుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తమ భాషలోనే పూర్తిగా పాలనా వ్యవహారాలు జరగాలని, మాతృభాషలోనే చదువు సాగాలని, ప్రపంచంలో పోటాపోటీగా తమ ప్రజలు వికసించాలని, తెలుగుభాష ప్రపంచంలోని సర్వోన్నత భాషల్లో ఒకటిగా గుర్తింపబడాలని మౌలికంగా నమ్మి, దానిని ఆత్మగౌరవ స్ఫూర్తిగా ప్రకటించగల 'దమ్ము' ఈ నేతల్లో ఎవరికైనా ఉందా అనేదే ఈనాడు మనముందున్న ప్రశ్న. అదే ఉంటే ఇప్పటికే ఆ ప్రకటనను చేసి ఉండేవారు. అందరూ ఎన్‌టీరామారావును ప్రస్తావిస్తారేగాని, ఈయన చేపట్టిన ఈ మంత్రాన్ని గాని, ఈ మార్గాన్నిగాని గుండెల్లోకి తీసుకోలేదు. అందుకనే – తెలుగునూ తెలుగు ప్రజలనూ వంచించడం వీరికి అలవాటైపోయింది. మన నేతలు నిజమైన ఆదర్శ నేతలను తలచుకోరు. పైకి ప్రశంసించినా, గుండెల్లో ఉంచుకోరు. ప్రకాశం పంతులు, నేతాజీ, అంబేద్కర్, పుచ్చలపల్లి సుందరయ్య వంటివారి పేర్లను తలచుకోవాలంటేనే వారికి భయం.

ఇప్పుడు మనకున్న పరిమితుల్లో – నిజాయితీగల అభ్యర్థుల్ని ఎంచుకొని ఓటు వేయడం తప్ప – గత్యంతరం లేదు. పార్టీ వ్యవస్థలే ఆధారంగా నడుస్తున్న ప్రజాస్వామ్యం గనుక – ప్రత్యామ్నాయ పార్టీగా ముందుకు వస్తున్న 'జనసేన కూటమి'ని బలపరచడం కూడా పరిశీలించదగి ఉంది. ఏమైనా, ఉద్యమాలను కొనసాగించక తప్పదు.

సామల రమేష్‌బాబు

తేదీ : 1-4-2019

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
9866128846

సరికొత్త భాషావిధాన రూపశిల్పి- గిల్వాన్ మ్యూలర్ డి ఒలివేరా



హైదరాబాదు విశ్వవిద్యాలయంలో ఆపన్న భాషల అభివృద్ధి, బహుభాషీయతకు ప్రోత్సాహం కల్పించేందుకు సరికొత్త భాషా విధా నాలతో భాషాశాస్త్రానికి సంబంధించి యునేస్కో పీఠం సమన్వయ కర్తగా గిల్వాన్ మ్యూలర్ డి ఒలివేరా పనిచేస్తున్నారు.

ఆయన 1985 లో బ్రెజిల్ దేశపు క్యాంపినాస్ రాష్ట్రీయ విశ్వవిద్యాలయం నుండి భాషాశాస్త్రంలో పట్టభద్రులయ్యారు. తర్వాత 1990 లో జర్మనీలోని కాన్స్టాన్జ్ విశ్వవిద్యాలయంలో సిద్ధాంతిక భాషాశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేసి మరల 2004లో కాంపినాస్ రాష్ట్రీయ విశ్వవిద్యాలయం నుండి భాషా శాస్త్రంలో పిహెచ్.డి.పట్టాను పొందారు. మెక్సికోలోని స్వయంపాలిత పట్టణ విశ్వవిద్యాలయం లో మొదటి పోస్ట్ డాక్టోరల్ పరిశోధన చేశారు. రెండవ పోస్ట్ డాక్టోరల్ పరిశోధనని (2018) భారతదేశంలోని హైదరాబాదు విశ్వవిద్యాలయంలోనూ ఆపైన రష్యన్ రాష్ట్రీయ విశ్వవిద్యాలయం మాస్కో, రష్యన్ ఫెడరేషన్లోనూ చేస్తున్నారు.

2002 నుండి 2010 వరకు, దక్షిణ బ్రెజిల్ లోని ఫ్లోరియో పోలిస్ పట్టణంలో "భాషా విధాన పరిశోధన అభివృద్ధి సంస్థ (IPOL) కు సమన్వయకర్తగా పనిచేశారు. 2010, 2014 లలో కేప్ వర్దెలో ఉన్న పోర్చుగీస్ భాష మాట్లాడే దేశాల (CPLP) పోర్చుగీస్ భాషా కేంద్ర (IILP) కార్యాలయ కార్యనిర్వహణ బాధ్యతను చేపట్టారు. 2014 లో అంతర్జాతీయ లుసాఫోన్ (పోర్చుగీసుభాష) ఉద్యమ సంస్థ నుండి లూసఫోన్ వ్యక్తిత్వ పురస్కారాన్నీ అలాగే; 2015 లో మధ్యకాలీన పోర్చుగీసు కవి మేఁదినో పేరు మీద స్థాపించిన మేఁదినో ఫౌండేషన్ నుండి పోర్చుగీసు భాషకు అందించిన సేవలకు గాను మేఁదినోపురస్కారాన్నీ అందుకున్నారు. ప్రస్తుతం సంతు కాతరినా ఫెడరల్ విశ్వవిద్యాలయంలో సహ - ఆచార్యులుగానూ పారిస్ లో ఉన్న మాయా అనే బహుభాషీయ అంతర్జాల విశ్వవ్యాప్త జాలికకు పాలక కార్యదర్శిగానూ, 2017 నుండి పోర్చుగీస్ భాష యొక్క గాలెశీయ అకాడమీ (AGLP) ప్రతినిధిగానూ ఉన్నారు. 2017-2019 కాలంలో మాంటవివీయో గ్రూప్ విశ్వవిద్యాలయాలనో సమైక్యతకోసం విద్యావ్యవస్థలో (NEPI) భాషా విధానానికి సమ న్వయ కర్తగా ఉన్నారు (AUGM). ప్రస్తుతం, యునేస్కో పథకాల ఆచరణకోసం బహుభాషీయతావిధానాన్ని అమలుచేసేందుకు యునేస్కో భాషా విధాన పీఠం సమన్వయకర్తగా (2018-22) హైదరాబాదు విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నారు.

ఆచార్య గిల్వాన్ ప్రస్తుతం అంతరించిపోతున్న ఆపన్న భాషల ఉద్ధరణా, అల్పసంఖ్యాకవర్గ భాషల అభివృద్ధీ, వాటికి సహ-అధికారిక స్థాయి కల్పన, ప్రపంచీకరణంనుండి మూడవ లేక అభివృద్ధి చెందుతున్న దేశాల భాషల అభివృద్ధికి తోడ్పడేందుకు పరిశోధనలు సాగించే దిశలో మునిగివున్నారు. వారితో ఈ మధ్యనే హైదరాబాదు విశ్వవిద్యాలయ భాషాశాస్త్ర విభాగాధ్యక్షురాలు డా.రాజ్యరమ సహకారంతో కొన్ని భాషా సంబంధ విషయాలపై ప్రశ్నోత్తరాల రూపంలో ఆచార్య గిల్వాన్ గారి నుండి ఈ కింది సమాచారాన్ని సేకరించాం. అమ్మనుడి పత్రిక చదువరులకోసం దీనిని అందిస్తున్నాం.

ప్రశ్న : రాజ్యాంగపరమైన అడ్డంకులవలన భాషాపరమైన హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు, మూలవాసులకు కల్పించే కనీస ప్రజా సేవల హామీకి బ్రెజిల్ ఎలాంటి భాషా విధానాన్ని అవలంబిస్తోంది?

బ్రెజిల్ దేశం అట్లాంటిక్ మహసముద్రంలోని దక్షిణ అమెరికా ఖండంలో ఈశాన్య భాగంలో భూమధ్యరేఖకు సరిగ్గా దిగువన వ్యాపించి ఉన్న ఒక సువిశాల దేశం. పదిహేనవ శతాబ్దం ప్రారంభంలో అంటే ఏప్రిల్ 22, 1500 సంవత్సరంలో పోర్చుగల్ దేశానికి వలసదేశంగా మారింది. అప్పటికే ఉన్న తుపిగ్వొరానీ అనే దక్షిణ అమెరికా మూలవాసుల దేశం అది. పోర్చుగల్ నిజానికి తెలంగాణా రాష్ట్రంకంటే వైశాల్యంలో కొద్దిగా చిన్నదిగా జనాభాలో మూడవవంతు మాత్రం ఉంటుంది. క్రీ.శ. 1500 కి బ్రెజిల్ లో మూలవాసుల భాషలను మాట్లాడే జనాభా 60 లక్షలు ఉండగా 19వ శతాబ్దానికి మూలవాసీ భాషలు మాట్లాడే వారి సంఖ్య50 వేలకంటే తక్కువకు పడిపోయింది. దీనికి ప్రధానకారణం1775 లో అప్పటి ప్రజల సాధా

రణ భాష లేదా ఇతర మూలవాసీ దేశీయ భాషలను ఉపయోగించ డాన్ని బ్రెజిల్ లోని పోర్చుగీసు ప్రభుత్వం నిషేధించటమే.

బ్రెజిల్, వైశాల్యంలో భారతదేశం కంటే మూడు రెట్లు పెద్దదైనా జనాభాలో మాత్రం ఐదవవంతు ఉంటుంది. బ్రెజిల్ పందొమ్మిదవ శతాబ్దందాకా పోర్చుగల్ దేశపు వలస రాజ్యంగా సాగింది. పోర్చుగీసు అధికార భాష అన్నింటా వాడుక భాషగా కూడా అయింది.

ఇప్పుడు బ్రెజిల్లో అధిక శాతం పోర్చుగీసు భాషను మాట్లాడు తున్నా గణించదగిన పరిమాణాలలో జర్మను, స్పానిషు, ఫ్రెంచి, ఇటాలియను భాషలనూ మిగిలినవారు తుపి-గ్వీరానీ అనే మూల వాసుల భాషలను మాట్లాడేవారు ఉన్నారు. అయితే ఇలాంటి అల్ప సంఖ్యాక భాషలకు తగినరీతిగా గుర్తింపు తెచ్చేందుకు ప్రయత్నించాం. ఇలాంటి విషయాలలో ప్రభుత్వానికి భాషాపరమైన సలహాలు ఇచ్చేందుకు మేము అంటే కొంతమంది భాషాశాస్త్రజ్ఞులం "భాషా విధాన పరిశోధన అభివృద్ధి సంస్థ (IPOL)" అనే పేరుతో ఒక స్వతంత్ర సంస్థను ఏర్పాటు చేసుకొన్నాం. ఈ సంస్థకు నేను పదేండ్లకు పైగా సమన్వయ కర్తగా పనిచేశాను. ఈ సంస్థ చేసిన అధ్యయనం ద్వారా కొన్ని ప్రాంతాలలో బలంగా ఉన్న కొన్ని మూలవాసుల భాష లను సహ - అధికార భాషలుగా గుర్తించేందుకు వీలుగా కొన్ని నివేదికలు తయారు చేశాం. అందుకు అవసరమైన రాజ్యాంగపరమైన విధివిధానాలకోసం మా సంస్థ సొంత ఖర్చులతో ఒక న్యాయ సలహా దారుని నియమించుకొని భాషా విధాన నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి అందించి చివరికి ఒప్పించి మునిసిపాలిటి స్థాయిలో మూలవాసుల భాషలను సహ - అధికార భాషలుగా గుర్తింపచేశాం. అది మాకు ఒక గొప్ప విజయం. దాన్ని మూలవాసులు స్వాతంత్ర్యం వచ్చినంత పండుగగా జరుపుకున్నారు. ఇదివరకటికంటే ఇప్పుడు బ్రెజిల్లో అల్పసంఖ్యాక వర్గ భాషలపట్ల చిన్నచూపు తగ్గించేందుకు కృషి చేశాం, చేస్తున్నాం. వీలైన చోట్ల అల్పసంఖ్యాక భాషలను తరగతి గదిలోకి ప్రవేశ పెట్టేందుకు కృషిచేస్తున్నాం. అందుకోసం పాఠశాల స్థాయిలో బోధనా మాధ్యమంగా బహుభాషీయతను గుర్తించి ఆచ రణలో అమలుచేసేందుకు కృషిచేస్తున్నాం. మా ఈ కృషివల్ల ప్రభుత్వ ఆలోచనలలో మార్పును తీసుకురాగలిగాం. నా ఉద్దేశంలో ఒక భాష ఎంతటి అల్పసంఖ్యాక భాష ఐనప్పటికీ ఏదో ఒక ప్రాంతంలో ఏవో కొన్ని రంగాలలో అధికారిక లేక సహ-అధికారిక స్థాయి పొంద వలసినదే.

ప్ర. అంతరించిపోతున్న భాషల జాబితాను యునేస్కో ప్రకటిం చింది కదా. ఈ సందర్భంలో యునేస్కో గానీ వాటికి సంబంధించిన దేశాలు గానీ ఎలాంటి పనులు చేపట్టాలి అనేదానిపై మీ అభిప్రాయం ఏమిటి?

అవును, యునేస్కో వివిధ ప్రజా సమూహాల ఆకాంక్షలమేరకు ఆయా దేశాల పరిధిలో పనిచేస్తుంది. అందులో భాగంగా కొన్ని భాషలను ఆపన్న భాషలుగా గుర్తించింది. అయితే అంతటితో పని అయిందనుకోకుండా వాటి అభ్యున్నతికి సహాయపడేందుకు ఒక గొప్ప పథకానికి రూపకల్పన చేసింది. అదేమంటే ప్రపంచలోని భాషల గురించిన సమాచారాన్ని ఒకేచోట మానచిత్రాలతో గుర్తించటం. అదే ఆపన్న భాషల సమీకృత సమాచార మానచిత్ర పథకం. అంటే ప్రపంచ పటంపై ఆపన్న భాషలకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని అందించే పథకం. ఇది వివిధ భాషలకు సంబంధించి వాటికి రాబోయే అపాయాన్ని గుర్తించి వాటిపై అవగాహన పెంచడానికి ఉద్దేశించబడింది. ఇది విధాన నిర్ణేతలు, భాషావ్యవహర్తల సమూ హాలూ తదితర సాధారణ ప్రజానీకంలో ప్రపంచ భాషా వైవిధ్యాన్ని కాపాడవలసిన అవసరాన్ని గురించి కూడా ఇది చెబుతుంది. ఇది అంతరించిపోతున్న భాషల స్థాయినీ స్థితినీ పర్యవేక్షించే సాధనం. ఇంకా ప్రపంచ స్థాయిలో భాషా వైవిధ్యానికి సంబంధించి నడుస్తున్న ధోరణులపై సమగ్ర విచారణ జరిపి తీసుకోవలసిన జాగ్రత్తలగురించి ఆయా దేశాలకు సలహాలను ఇస్తుంది.

ప్ర. యునేస్కో, ప్రపంచ భాషలకు సంబంధించి ఎలాంటి విధాన నిర్ణయాలు తీసుకోగలుగుతుంది?

యునేస్కో భాషలగురించి నేరుగా ఎలాంటి విధానపరమైన నిర్ణయాలనూ తీసుకోలేదు. కారణం ఆయా భాషలు ఆయా దేశాల సార్వభౌమాధికారంలో ఉన్న ప్రాంతాలలో మాట్లాడేవి. వాటిలో ఏయే భాషలు ఏ విధంగా అమలు చేయాలన్నది ఆయా దేశాల సార్వ భౌమాధికారం కిందకు వస్తుంది. అయితే గత ఐదారు దశాబ్దాలుగా భాషలవాడకం వాటి అభివృద్ధి మూలవాసుల భాషలూ వాటికి సంబం ధించిన కొన్ని హక్కులను కాపాడే దిశలో యునేస్కో ఆలోచిస్తోంది. దీనికి కొన్ని సలహా సంఘాలు, ప్రణాళికా, పథక రచనా సంఘాలు ఇలా ఎన్నో ఉన్నాయి. అవి ప్రపంచమంతటా ఉన్న భాషల వాడకం స్థితిగతులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి సలహాలు ఇవ్వడం, ఆచరణలో పెట్టేందుకు ఆయా దేశాలపై కొంత వత్తిడి తేవడం వరకు జరుగు తుంది. అయితే ఇప్పటివరకూ మానవ ప్రాథమిక హక్కుల గుర్తింపూ వాటిని అమలుపరచటానికి తీసుకున్న చర్యలవలే భాషలకు సంబం ధించిన హక్కులను గుర్తించి వాటిని సమీక్షించి యునేస్కో సభ్య దేశాల సమన్వయంతో ఒక ప్రామాణిక నివేదికను రూపొందించి అమలులోకి తీసుకు రావడానికి కొన్ని ఇబ్బందులను ఎదుర్కొంటోంది. కొన్ని సభ్యదేశాలు కొంతవరకు ఇష్టపడకపోవడం, పట్టించుకోక పోవడం, మరికొన్ని సభ్యదేశాలకు ఇది ఆమోదయోగ్యం కాక పోవడం కూడా కొంతవరకూ కారణమే.

ప్ర. ప్రపంచం జ్ఞాన సమాజంగా మారుతోంది. ఈ సందర్భం లో యునేస్కో భాషలగురించీ ప్రత్యేకంగా అల్పసంఖ్యాక భాషల గురించి తమ సంస్థ ద్వారా ఆయా భాషా సమూహాలకు సంబంధించి ఎలాంటి ప్రయోజనాలను చేకూర్చాలని అనుకుంటోంది?

ఆధునిక సమాచారం కొన్ని భాషలలోనే ఉన్నందు వలన అది అందరికీ అంటే సమస్త ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకు వచ్చేందుకూ, సమాచార పంపిణీ సౌలభ్యం, అందుకు కావలసిన బహుముఖీన వ్యవస్థల ఏర్పాటుతో ప్రపంచ ప్రజలను జ్ఞాన సమా జంగా తీర్చిదిద్దే ప్రక్రియకు చేదోడువాదోడుగా పనిచేయడం అందుకు కావలసిన భాషాపరమైన చిక్కులను పరిష్కరించడం తన ముందున్న ప్రధాన సమస్యగా గుర్తించింది. ఉదా. బహుభాషీయతను ప్రోత్సహిం చడం, బహుభాషీయ బోధనా ప్రణాళికల రూపకల్పన వాటిని అమలు పరిచేందుకు చర్యలు చేపట్టడం. సాంఖ్యిక సమాచారాన్ని ఉచితంగా వీలైనంతమటుకు అన్ని భాషల్లోనూ అందించేవిధంగా ప్రభుత్వాలను పురిగొల్పటం ప్రోత్సహించటం మొదలైనవి ఎన్నో చర్యలు చేపడు తోంది.

సద్దు

రహ్మానుద్దీన్ షేక్
9686903386

భాషలు నేర్చుకునేందుకు పిల్లలశ్రమ పైపరిశోధన

మాతృభాషను నేర్చుకునేందుకు పిల్లలు దాదాపు 1.5 మెగాబైట్ల జ్ఞప్తిని వినియోగిస్తారు.

బెర్కలీలోని కాలిఫోర్నియా విశ్వ విద్యాలయంవారి ఇటీవలి పరిశోధనలో తేలిన విషయం ఏమిటంటే, అప్పుడే పుట్టిన పాపడు, అతనికి 18 ఏళ్ళ వయస్సు వచ్చే సరికి నేర్చుకునే మాతృభాష సులువుగా వచ్చేయదని, అందుకు ఎంతో కొంత శ్రమ వెచ్చించాల్సి వస్తుందని తెలిసింది.

భాషకు సంబంధించి, కనీసం 1.25 కోట్ల బైట్లను ఆకళింపు చేసుకున్నాకనే పిల్లలు ఒక భాషను పూర్తిగా నేర్చుకోగలరు, అది మాతృభాష అయినా సరే అంతటి శ్రమ వెచ్చించాలి.

ఈ పరిశోధన రాయల్ సొసైటీ వారి ఓపెన్ సైన్స్ జర్నల్ లో లభ్యమవుతోంది.

ప్రతిరోజు పిల్లలు దాదాపు వెయ్యి బిట్ల సమాచారాన్ని, నిమిషానికి రెండు బిట్ల చొప్పున నేర్చుకుంటారని తెలిసింది.

ఉదాహరణకు “కోడి” అనే పదాన్ని అర్థం చేసుకునే ముందుగా, ఒక శిశువు “కోడి పక్షేనా? ఔనా, కాదా? కోడి ఎగర గలదా? ఔనా, కాదా?” ఇలాంటి ప్రశ్నలు వేసుకుంటూ కోడి గురించి మెదడులో సమాచారాన్ని సేకరిస్తూ భాషను నేర్చుకుంటాడట.

బిట్, బైనరీ డిజిట్ కు సంక్షిప్త రూపం, కంప్యూటర్లలో సమాచారాన్ని పొందు పరిచేందుకు వాడే విలువ. బరువుకు కిలోగ్రాములు, పొడవుకు మీటరు, కిలోమీటరు, వాడుతున్నట్టు సమాచారాన్ని కంప్యూటరుకు పొందుపరిచేందుకు ఈ బిట్ ని కొలతగా వాడతారు.

ఎనిమిది బిట్లు కలిస్తే ఒక బైట్ అవుతుంది.

మాతృభాష నేర్చుకోవడం, ఆపై ఇతర భాషాలను నేర్చుకోవడం పిల్లలకు సులువైన పని కాదు. చుట్టూ జరిగే పరిస్థితులు, వినపడే మాటలు, కనిపించే దృశ్యాలకు ఆ మాటలను అనుసంధానించడం మొదలైనవన్నీ శైశవ అవస్థ నుండే పిల్లలు నేర్చుకుంటారు, అది వారికి సహజంగా అబ్బాలి. తనంతట తానుగా అమ్మభాష పిల్లలకు సంక్రమించేస్తుంది అన్న విషయంలో వాస్తవికత లేదన్నది ఈ పరిశోధన చెబుతున్న విషయం. ఆంగ్లం మాతృభాషగా కలిగిన పిల్లలకు సైతం ఆంగ్లం పూర్తి స్థాయిలో నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. ఇదే విషయం తెలుగు వారికీ అన్వయించుకోవాలి.

తెలుగు సాహిత్యపరంగా సుందర భాష, అన్ని విధాల, అన్ని విరుపులకు అనువైన భాష అనుకున్నా, పిల్లలకు తెలుగును నేర్పించడంలో అయ్యే శ్రమను గుర్తించి తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి. తెలుగును మాతృభాషగా నేర్పాలి. అంటే, చుట్టూ ఉన్న దృశ్యాలను తెలుగు మాటలతో జత చేసుకునేందుకు ప్రయత్నించే పిల్లల మెదడుకు చుట్టూ తెలుగు మాటలు వినిపించే వ్యవస్థను ఏర్పరచాలి.

రోచస్టర్ విశ్వవిద్యాలయంలో పిహెచ్‌డి చేస్తున్న ఫ్రాంక్ మోలికా సమాచారగ్రహణ శక్తి పై పరిశోధన చేస్తున్నారు. ఆయన చేసిన పరిశోధనల వలన ఇంగ్లిష్ మాతృభాషగా మాట్లాడేవారు ఇంగ్లిష్ ను పూర్తి స్థాయిలో నేర్చుకునేందుకు ఎంత కనీస సమాచారాన్ని గ్రహించాలి అన్న విషయమై కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి.

పరిశోధకులు భాష సమగ్రత, భాష నిర్దుష్టతపై వివిధ లెక్కలు వేసుకొని కంప్యూటరుకు అనువైన కొన్ని శోధనాంశాలు రూపొందించారు. వీరి పరిశోధనల వలన తెలిసిన విషయం ఏమిటంటే భాషా పరిజ్ఞానం అనేది ముఖ్యంగా పదాలు, వాటి అర్థాలపై ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తూ, భాషకున్న వ్యాకరణాంశాలకు ఎలాంటి ప్రాముఖ్యత ఇవ్వదు అని.


భాష నేర్చుకోవడంలో పదాలు – వాటి అర్థాలు మొత్తం భాషలో చాలా చిన్న భాగం. భాషా వ్యాకరణం, పదాల అమరిక, కొత్త పదాల సృష్టి, ఈ భాషా పదాల వాడుక భేదాలు, భాషలో సాహిత్య సృష్టి – ఇలా “పదం – అర్థం” కు మించి భాషలో నేర్చుకోవాల్సిన అంశాలు బోలెడు. కానీ కేవలం పదం – అర్థం నేర్చుకునేందుకు ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారు భాషను నేర్పించే పండితులు.

ఈ భాషలోని శబ్దార్థాలను నేర్పే శబ్దార్థ పరిజ్ఞానానికి, భాషలోని పదాల అమరికను, దేశ–కాల–సందర్భాలను అనుసరించి పదాల వాడుకను మార్చుకోవాల్సిన శబ్ద క్రమానికి మధ్య తేడాను మనుషులు ఇట్టే పట్టేస్తారు. ఇదే విషయం మనుషులను, రోబోట్లను విడదీస్తోంది! అలెక్సా, సిరి, గూగుల్ అసిస్టెంట్ లాంటి రోబోట్లు భాషలోని శబ్దార్థ పరిజ్ఞానాన్ని కలిగి ఉంటాయే తప్ప శబ్దక్రమ పరిజ్ఞానాన్ని అవి పొందాలంటే మనిషి శైశవ దశ నుండి నేర్చుకున్న విధానాన్నే అవలంబించాలి. అంతే సమయమూ కావాలి.

మరి ఒక భాష నేర్చుకునేందుకు ఇంత శ్రమ అయితే, “ఒకటికన్నా ఎక్కువ భాషలకో?” అన్న ప్రశ్నకు పరిశోధకులు సమా ధానమిస్తూ ఒక సారి పదాల అర్థాలను మనిషి మెదడు తెలుసుకున్నాక, కొత్తగా నేర్చుకునేది పదాలనే, అవి ఏ భాషవైనా సరే. అందువలన కొత్త భాషను నేర్చుకోవాలన్నా, రెండు మూడు భాషలను శైశవ దశ నుండే నేర్పించినా పిల్లలు త్వరగా నేర్చేసుకుంటారు.

పూర్తి పరిశోధన పత్రం కోసం: https : //royalsociety publish ing.org/doi/10.1098/rsos.181393

మన మాతృభాషల్లో కథలు



తెలుగు భాషలో రంగురంగుల బొమ్మలతో కథల పుస్తకాలు న్నాయనుకోండి, అందునా ఆ పుస్తకాలని పిడిఎఫ్‌లుగా వలగూడు నుంచి దింపుకొని అచ్చొత్తుకుని చదువుకోవచ్చనుకోండి, అదీ ఎలాంటి నకలుహక్కులు(కాపీరైట్) ఇబ్బందులూ లేకుండా! ఈ డబ్బుమయ మైపోయిన రోజుల్లో ఊహించలేం కదా.

తెలుగే కాదు, ఆంగ్లం, కన్నడ, తమిళం, హిందీ, సంస్కృతం భాషలలో ఉచితంగా కథలను అందిస్తోంది ప్రథమ్ బుక్స్ వారి స్టోరీవీవర్ వేదిక.

పిల్లలలో చదివే అలవాటును పెంపొందించేందుకు, చదివే అంశాల్లో వైవిధ్యాన్ని తెచ్చేందుకు, మాతృభాషలలో పుస్తకాలను చదివే అలవాటును అలవరుచుకునేందుకు, సంప్రదాయ తరగతి గదుల్లో చదువును మరింత ఆసక్తికరంగా చేసేందుకు, డిజిటల్ హైపర్‌లోకల్ గ్రంథాలయాలు వచ్చేసాయి. ఇక్కడ పుస్తకాలు, ఉచితంగా దింపు కోవచ్చు, ముద్రించుకోవచ్చు, తిరిగి మళ్ళీ మళ్ళీ వాడుకోవచ్చు.

ఈ హైపర్‌లోకల్ లైబ్రెరీలలో ఒకటి ప్రథమ్ బుక్స్ వారి స్టోరీవీవర్. స్టోరీవీవర్ అనే ఆంగ్ల పదానికి అర్థం "కథల అల్లిక" అని. అందుకు తగ్గట్టుగా మనం ఇక్కడ కథలను అల్లుకోవచ్చు (తయారు చేసుకోవచ్చు)

148 భాషలలో పుస్తకాలు అందుబాటులో ఉన్న ఈ వేదికపై మొత్తం కలిపి 18 లక్షల సార్లు కథలను జనం చదువుకున్నారు. కొర్కు, మార్వాడీ, పవారీ, సంతాలీ లాంటి అసలు ప్రధాన సాహిత్యం అరుదుగా ఉన్న భాషల్లో కూడా ఈ వేదిక సేవలు అందుబాటులో ఉన్నాయి.

ప్రథమ్‌బుక్స్ చెయిర్‌పర్సన్ సుజేన్ సింగ్ మాట్లాడుతూ, "యునెస్కో నివేదిక ప్రకారం 40% ప్రపంచ జనాభా వారికి అర్థం కానీ భాషలో విద్యను అభ్యసిస్తున్నారని తెలిసింది. బహుభాషా సమాజాలలో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా బలమైన భాష, తన పక్క భాషలను అస్తిత్వం లేకుండా చంపేస్తుందన్న విషయాన్ని మనం ప్రతిరోజూ మూగసాక్షులుగా చూస్తున్నామే తప్ప ఏమీ చేయటం లేదు. అలా ఆంగ్లాన్ని ప్రోత్సహిస్తున్న సమాజం సామాజిక, సాంస్కృతిక అసమానతలకు గురి అయి చివరకు ఓడిపోతుంది.

భారతదేశంలోనూ, ప్రపంచంలోని పలు ప్రాంతాలలోనూ బడిభాషకు, ఇంట్లో మాట్లాడే భాషకూ భూమ్యాకాశాల తేడా ఉంది. ఇందువలన పిల్లలు ఆత్మన్యూనతకు లోనై తమకన్నా తక్కువ స్థాయి పాఠ్యాంశాలను కూడా చదివేందుకు జంకుతారు. ఇలాంటి అస మానత, చదువుకు దూరం చేసే వ్యవస్థ, పిల్లలను ఆఖరుకు బడి మానిపించే దిశగా దారి తీస్తుంది." అని ఆవిడ అన్నారు.

స్టోరీవీవర్ లో కథలు ద్విభాష - త్రిభాష, ఇలా మనకు కావాల్సిన విధంగా అమర్చి పిల్లలకు అందిస్తే ఈ ఇంటిభాష-బడిభాష తేడాకు వంతెన వేయవచ్చు.

మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో కొర్కు భాష మాట్లాడే తెగల పిల్లలు మరాఠీ లేదా ఆంగ్ల మాధ్యమాలకు భయపడి చదువే మానేసారు. ప్రథమ్ వారి స్టోరీవీవర్ మొదటి, రెండవ చదువుస్థాయి కథలు చదివాక పిల్లలు బడులకు తిరిగి రావటమే కాకుండా మరింత ఎక్కువ ఆసక్తి తో తరగతి గదుల్లో చదువుతున్నారని విదర్భ ప్రాంతం లో పిల్లల చదువులపై పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థ "ఉన్నతి ఐ ఎస్ ఈ సీ" కార్యక్రమ అధికారి శరద్ ప్రకాశ్ అన్నారు.

2004 లో ప్రథమ్‌బుక్స్ బెంగుళూరు కేంద్రంగా మొదల యింది. పిల్లలకు భారతీయ సమాచారంతో కూడిన పుస్తకాల తయారీ కోసమని తయారయిన సంస్థ మెల్లిగా పిల్లలకు సంబంధించిన సామా జిక అంశాలను పరిశీలిస్తూ, పిల్లల చదువు, వారికి అందుతున్న విజ్ఞానం, ప్రభుత్వం అందిస్తున్న ఆసరా, మాతృభాషా విద్య అంశా లలో పని చేసే లాభాపేక్షలేని సంస్థగా ఎదిగింది. నేడు భారతదేశంలో విద్య స్థితిని అత్యంత దగ్గిరగా అద్దం పట్టే నివేదికను ప్రథమ్ రూపొంది స్తుంది.

ప్రథమ్‌బుక్స్ లక్ష్యం - "ప్రతి పిల్లవాడి చేతిలో పుస్తకం" ఉంచడం, అనగా వారికి చుట్టూ జరుగుతున్న విషయాలపై, వారికి తెలిసిన భాషల్లోనే ఆసక్తికరమైన కథలను చదువుకునేందుకు అందించడం.

అయితే భారతదేశంలో పిల్లల పుస్తకాలే కాదు, పిల్లలకు అనుకూలమైన పుస్తకాలూ అరుదే. అందువలన హిందీ, మరాఠీ, కన్నడ, తెలుగు మొ. భాషల్లో ప్రథమ్ పుస్తకాలను రూపొందించి, పంపిణీ చేసింది. అలా ప్రథమ్‌బుక్స్ 20 భారతీయ భాషలలో 375 పుస్తకాలను తయారు చేసి, అన్ని భాషలకు తర్జుమా చేసింది. విపరీత మైన డిమాండ్ వలన ఒక్కో పుస్తకానికి 6000-8000 ప్రతులు

చేసినా చాలక, పుస్తకాలను స్వేచ్ఛా లైసెన్స్‌కు మార్చారు. తద్వారా పుస్తకాలను ఎవరైనా ప్రథమ్‌బుక్స్ గురించిన ఉల్లేఖన ఇచ్చి ఉచితంగా దింపుకొని ముద్రించుకునే సౌకర్యం వచ్చింది.

2015 లో వలగూడులోనే కథలను రూపొందించి, బొమ్మలను చేర్చి, కథలు రాసే ఒక వేదికగా స్టోరీవీవర్ ఆవిర్భవించింది. ఎవరైనా కథలను అనువదించేందుకు వీలుగా ఒక వెసులుబాటును ఉంచారు. 800 కథలతో మొదలైన ఈ చిన్ని ముందడుగు రెండేళ్ళలో 6500 కథల స్థాయికి చేరుకుంది. 24 భాషలలో మొదలైన ఈ వేదికలో ఇప్పుడు 148 భాషలలో పుస్తకాలు ఉన్నాయి. కొన్ని కథలు 45 భాషల్లో అనువదించినవీ ఉన్నాయి. 4 లక్షల మంది విద్యార్థులు నిత్యం ఈ కథలను చదువుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి.

ఎవరైనా నమోదు చేసుకుని స్టోరీవీవర్ లో పుస్తకాలను చదవవచ్చు, దింపుకోవచ్చు, ముద్రించుకోవచ్చు. ఈ దింపుకోవటం కూడా తక్కువ నిడివి పిడిఎఫ్, పెద్ద నిడివి పిడిఎఫ్(బొమ్మలు మరింత స్పష్టం), ఈపబ్ – మూడు రకాలలో చేసుకోవచ్చు.

ఈ వేదిక వలన మారుమూల ప్రాంతాల వారికి ఎంతో మేలు చేకూరుతోంది. పుస్తకాలు కొని–చదవటం భారంగా ఉన్న విద్యార్థుల కోసం ప్రథమ్‌బుక్స్ దాతల నుండి నిధిని సేకరించి ఉచితంగా పుస్తకాలను ముద్రించి ఇస్తోంది.

ఇటీవలి కాలంలో సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్/మెడిసిన్(స్టెమ్) పై ఎక్కువ ప్రాధాన్యత వచ్చిన తరుణంలో స్టోరీవీవర్ లో కూడా ఆ వైపుగా పుస్తకాలు వచ్చాయి. “విమానాలు ఎలా ఎగురుతాయి?” అన్న కథలో కథానాయిక సరళ విమానాలపై ఆసక్తితో పెరుగుతూ పైలట్ అవుతుంది. ఇలాంటి కథలు చదివాక ఆడవాళ్ళు పైలట్ అవ్వగలరు అన్న విషయాన్ని తెలుసుకున్న ఎందరో గ్రామీణ ఆడపిల్లలు, ఆడవాళ్ళు కేవలం వంటింటి కుందేళ్ళు కాదు అన్న సత్యాన్ని తెలుసుకున్నారు. ఈ సామాజిక స్పృహను కలుగచేయటం ప్రథమ్ లక్ష్యం.

ఈ కథలను ప్రొజెక్టర్ వాడి కొందరు ఉపాధ్యాయులు గ్రామాలలో ప్రదర్శిస్తున్నారు.

పుస్తకాలు చదువుకునేందుకు స్థాయిలనూ ఏర్పరిచింది ప్రథమ్.

మొదటి స్థాయి పుస్తకాలలో బొమ్మలు ఎక్కువ పాఠ్యం చాలా తక్కువ, అందులోనూ సరళమైన పదాలే వాడతారు.

రెండవ స్థాయి పుస్తకాలలో బొమ్మలు, పాఠ్యం సమపాళ్ళలో పాఠ్యం భాష మధ్యస్థంగా ఉంటుంది.

మూడవ స్థాయిలో బొమ్మలు తగ్గి పాఠ్యం పెరుగుతుంది కానీ భాష సరళంగానే ఉంటుంది.

నాలుగవ స్థాయి పుస్తకాలలో బొమ్మలు తక్కువ పాఠ్యం ఎక్కువ, పాఠ్యం భాష కూడా పై స్థాయిలో ఉంటుంది.

ప్రథమ్?బుక్స్ త్వరలో మాట్లాడే పుస్తకాలను అందించనుంది.

ఫోన్ చేస్తే కథలు చెప్పే సేవనూ అందించనుంది.


మరి ఈ స్టోరీవీవర్ కు ఎవరు కథలు రాసి ఇస్తారు?

మీరూ, నేను, మనము.

ఔను ఎవరైనా కథలను రాయవచ్చు.

ఒక కథకు తెలుగులో ఎన్ని తర్జుమాలైనా రాయవచ్చు.

(సశేషం)



ఆచార్య గూడూరు మనోజ
9704643240

ఏక సంగీత సంస్కృతికై బహుళ వన్నెల వాద్య కేతనం! అడవుల నుండి, మైదానాల నుండి తరలివచ్చిన అనాది రాగ సంపద!



మిగిలిన అరకొర కొండ కోనల్లోని సంగీతం, అలాగే పల్లె, పట్టణ, నగరంలో మనం చెవి పెట్టని, మన చుట్టూ ఆవరించుకున్న గిరిజన జానపద సంగీత వాద్యాల సమ్మేళనంలో మొదటిసారి వేదిక మీదికి వచ్చాయి. ఆ మూలధ్వని తరంగాల ప్రతిధ్వనితో నగరం హోరెత్తింది. ఆ నగరం హైద్రాబాద్. ఆ మూల వాద్యాలు తెలంగాణ ప్రాంతాల్లో ఇంకా అక్కడో, ఇక్కడో వినపడుతున్న వాయిద్యాలు.

నేపథ్యంలోకి వెళితే – సంగీతం విశ్వజనీనం. సంగీతానికి భాష, ప్రాంత, వర్ణ తేడాలుండవు అని సంగీతాన్ని భావపరమైన భావజాలం క్రిందికి లాక్కుని తెచ్చుకున్నప్పటికీ భారతీయ సంగీత నేపథ్యంలో ఆతారతమ్యాలు, తేడాలు పైకి గోచరిస్తూనే వచ్చాయి. హిందూస్థానీ, కర్ణాటక సంగీతాలు తమ తమ శైలులను, గానాల ఘరానాలను చాలా ప్రస్ఫుటంగా విడివిడిగా పెట్టుకున్నాయి. గానం, వాద్యం తమని తాము నిలదొక్కు కోవడానికి పడిన పాట్లనీ చరిత్ర గుర్తుంచుకొని రాసుకుంది. అది హిందూస్థానీ సంగీత పరంపరలోని కేసర్‌బాయి కౌర్కర్ కానీండి లేదా కర్ణాటక సంగీతంలోని సుప్రసిద్ధ మధురై షణ్ముగవడివు సుబ్బలక్ష్మి కానీండి వాళ్ళ వంతు సంఘర్షణ వాళ్ళదిగా ఉండింది.

కాబట్టి సంగీతం విశ్వవ్యాప్తం, విశ్వజనీనం అయినప్పటికీ ఆ తాళ గతుల పరిధిలో కొన్ని గీతలు గీయబడుతూ వచ్చాయి. సంగీతం వాటిని అధిగమిస్తుందన్న భరోసాతో ప్రతి తకరాలో ఆయా గాయకులు తమ తమ వాద్యాలతో కృషి చేస్తూనే ఉన్నారు. కానీ ఇప్పుడు ఈ ప్రస్తుత విశ్వవాప్తీకరణ సమయంలో మూల సంగీతాల గాయకులు, వాద్యాలు డస్సి పోతున్నాయి. నిస్తేజం అవుతున్నాయి. వాద్యాల తయారీకి అనువుగా లేని ప్రకృతి, ఆ ప్రకృతి కృశించి పోతున్న రీతి గమనించుకున్న గాయకులు వెనకంజ వేస్తున్నారు. ధీటుగా నిలబడి నా వాద్యం తయారీకి ఫలానా సొరబుఱ్ఱ కావాలి. తేనెతుట్టె మైనం కావాలి, మొగలి పొద కాండం కావాలి. అని వట్టిపోయిన అడివిని అడగలేక, ఆ అడివిని కబళిస్తున్న కొత్త డబ్బు సంస్కృతులను ఆపలేక, నోట మాట లేక చూస్తున్నారు. ఇన్నాళ్ళూ తమను కడుపులో దాచుకున్న అడవితల్లి ధ్వంసం అవుతుంటే మూగపోతున్న గొంతుల్ని సవరించుకుంటూ పాటని, ఆ పాట లయలో మిళితంగా ఉన్న నృత్యాన్ని ఇంకా నమ్ముకున్నారు. జీరలు పడుతున్న గొంతులోని పాటని, బీటలు పడుతున్న వాద్యాలని మరెంతో కాలం నిలుపుకోలేమని తెల్సి హతాశులవుతున్నారు.

అడివి బిడ్డల సంగతి ఇలా ఉంటే ; పల్లె, పట్టణ, నగరాల్లోని జానపద గాయకుల పరిస్థితి ఇంకా దుర్భరంగా మారింది. పెరుగుతున్న నగరం తమని అంచుల్లోకి నెడుతూ, తమ రాగాలను దూరం చేస్తూ పోతుంటే, ఏమీ చేయలేని పరిస్థితుల్లో గాయకులు, వాద్యాలు రెండూ మూలాల్లోకి నెట్టివేయబడుతున్నాయి.

విచిత్రం ఏమిటంటే, ఈ దూరం చేసుకుంటున్న సంగీతం, దానితో ముడిపడిన వాద్యాలు ప్రస్తుత ప్రధాన స్రవంతిలోని వాద్యాలకి మాతృకలని సంగీతజ్ఞులకి తెలుసును. అయినప్పటికి ఈ విషయాలను గుర్తించబోమన్న ఒక కలోనియలిస్టిక్ ఆటిట్యూడ్ విస్తరిస్తోంది. దీంతో ఒక ఉదాత్తమైన సంగీత చరిత్ర, నేపథ్యం మూగబోతుంది. తెగకి ఒక వాద్యం, కులానికి, ఉపకులానికి ఒక వాద్యం వారసత్వంగా వచ్చే సంగీతజ్ఞమైన గతాన్ని మనం కాదనుకుంటున్నాం. కులాలకు ఉండే హెచ్చు తగ్గుల్ని వాద్యాలకి, ఆయా గాయకులకు అంటగట్టి వాటిని అస్పృశ్య రాగాలుగా మారుస్తున్నాం. ఆ కళాకారులను సమాజం అంచులకు నెట్టి వాళ్ళని, కూలీలుగా, యాచకులుగా మారుస్తున్నాం. కళాత్మకమైన సంగీతానికి అంతరాలను మనమే సృష్టించుకుంటున్నాం. వాద్యం, గానం వారసత్వంగా వచ్చే ఒక ఉన్నతమైన విధానాన్ని గుర్తించడానికి నిరాకరిస్తున్నాం. సమాజంలోని ఒక అభిన్న అంగపు కళా నైపుణ్యాలని కాలరాస్తున్నాం. అయినప్పటికీ ఆ కళాకారులు, ఆదిలాబాద్ అత్రం లింగోజీ తన పన్నెండు మెట్ల కిన్నెరతో దామరగిద్దె, మహబూబ్ నగర్ నుండి కొండప్ప తన బుర్రవీణతో ఆఖరితరం ప్రతినిధులుగా డెబ్భయ్ ఏళ్ళ వయసులో



నిలబడ్డారు. వాళ్ళలో ఇంకా కొడిగట్టని ఒక నమ్మకం. ఇన్నేళ్ళు కాపాడుతూ వచ్చిన వాద్యం, గాత్రం అట్లెట్లా అంతరిస్తాయని. కానీ కఠోరమైన నిజం ఏమిటంటే వాళ్ళ తర్వాత ఆ వాద్యాన్ని, ఆ రాగాల్ని పలికించేవారు ఇక ఉండరు.

ఈ నేపథ్యాన్ని తన పరిశోధనలో భాగంగా నాలుగు దశాబ్దాలుగా పరిశీలిస్తూ వస్తున్న జయధీర్ తిరుమలరావు గారు, తెలంగాణ రచయితల వేదిక తరపున ఈ సంగీతపరమైన బాధ్యతని మనసు మీదికి తీసుకొని, భుజానికెత్తుతున్నారు. జానపద సాహిత్యం, దానికి సంబంధించిన కథన రీతులు, కుల పురాణాల మీద పరిశోధనలు జరిగినపప్పటికీ, వాటిల్లోని అతి ముఖ్యమైన సంగీతం, ఆయా వాద్యాల మీద దృష్టి పెట్టడం జరగలేదు. సంగీతం అన్నది గిరిజనులకు, జానపదులకు జీవనంలో భాగం, పొద్దున్నుండి రాత్రి దాకా, పుట్టినప్పటి నుండి దింపుడు కళ్లెం వరకు సంగీతం ఆవరించుకున్న జీవన రీతులు వారివి. ఆ విషయాన్ని గమనించుకొని ఆయా వాద్యాలను, వాయించే ఒక్కొక్క కళాకారులను గమనించుకొని పోతూ ఉంటే ఈ కోణం వెలుగులోకి రావాల్సి ఉందనే సత్యం తెలిసి వచ్చింది.

తెలంగాణ రచయితల వేదికతోపాటు ఉడతాభక్తిగా గుంజాల గోండేలిపి అధ్యయన వేదిక, సంఘటిత వేదిక, హైద్రాబాద్ కల్సి వచ్చాయి. అయితే ఈ విషయాలను పరిశోధనల్లోకి తీసుకు రావాల్సిన ఆవశ్యకత ఉందన్న మరో అకడమిక్ గురుతరమైన బాధ్యతని కూడా దృష్టిలో పెట్టుకొని ఉస్మానియా విశ్వ విద్యాలయాన్ని సంప్రదించడం జరిగింది. ఈ అంశపు ప్రాధాన్యతని, ప్రాముఖ్యాన్ని గుర్తించిన ఆ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎన్.రామ చంద్రంగారు ఈ ప్రస్తావనకి ఆమోదం తెలిపారు. నాలుగు శాఖల ప్రతినిధులు అంగీకరించారు. అట్లా, ఆంగ్ల, తెలుగు, జర్నలిజం, మరియు సోషియాలజీ శాఖలు ఈ కార్యంలోకి కలిసి వచ్చాయి. తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షులు జయధీర్ తిరుమల రావుగారు ఈ వాద్య సమ్మేళనానికి డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తరపున ఆంగ్ల విభాగం నుండి ప్రొ॥ బి.యాదవరాజు, ప్రొ.టి. విజయకుమార్, తెలుగు విభాగం నుండి ప్రొ. సూర్య ధనంజయ్, జర్నలిజం విభాగం నుండి ప్రొ. కె. స్టీవెన్‌సన్ మరియు సోషియాలజీ విభాగం నుండి ప్రొ. సిహెచ్. గణేశ్‌గారు ప్రతినిధులుగా నిల్చారు. కార్య నిర్వాహక మండలిలో శ్రీయుతులు పొట్లపల్లి వరప్రసాద్‌రావు, చొల్లేటి రాజారెడ్డి, ప్రొ.వినాయక్‌రెడ్డి, కన్వీనర్‌గా గూడూరు మనోజ వ్యవహరించారు.

కార్యక్రమ రూపకల్పన వరకు బాగానే ఉంది కానీ దాన్ని ఆచరణలోనికి తేవడం కష్టతరమైన పని. మూడు నెలల ముందు నుండి మళ్లీ కళాకారుల వెనక, వారి సంచార జీవన విధానాల వెనక తిరిగే కార్యక్రమంతో పని మొదలయింది. మొత్తంగా తెలంగాణ ప్రాంతంలో అరవై ఆరు వాద్యాలు ఉన్నాయని లెక్క తేలాక ఎన్నింటిని హైద్రాబాద్ నగరానికి తెప్పించగలమో అని మళ్లీ లెక్క వేస్తే యాభై ఆరు వాద్యాలు, రెండు వందల మంది వాద్యకారులు తేలారు. ఇక్కడ ఈ సర్వేలో తెలిసి వచ్చిన విషయాలేమంటే దమ్మనగోయి అనే ఊదే వాద్యాన్ని రాయించే వాళ్లున్నారు కానీ వాద్యం లభ్యం కాలేదు. గుడిసెల చూళ్ళల్లో నుండి ఆ వాద్యం ప్రకృతిలో కల్సిపోయింది. మళ్ళీ చేయించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఔజం అనే వాయిద్యం ఉంది కానీ వాయించే కళాకారుడు ఒకడే అవడం వల్ల ఇబ్బంది వచ్చింది. అయినప్పటికీ ఖమ్మం – భద్రాద్రి విభాగం నుండి పద్దం అనసూయగారు ఔజాన్ని గోదావరి ఆలల మీదుగా హైద్రాబాద్ నగరానికి తీసుకు వచ్చారు. నగరం ఏం కోల్పోతుందో కళ్ళకు కట్టినట్టుగా చూపించే ప్రయత్నం ఇది.

గుత్తి కోయిల డోళ్ళు ఎంతో పెద్దవి. వాటిని అసలు ఒక పెద్ద చెట్టుకి వేలాడదీసి రెండు వైపులా హైద్రాబాద్‌లో వాయించే వాళ్ళు నిలబడి వాయిస్తారు. ఇక్కడ వాద్యకారులు నలుగురు భుజానికెత్తుకుంటే మిగతా వాళ్ళు వాయించారు. ఇలాంటి ప్రాశస్త్యతని, ఆయా వాద్యపు తయారీ వివరాలను 'మూలధ్వని' – గిరిజన, జానపద సంగీత వాద్యాల సామాజిక చరిత్ర' శీర్షికతో పుస్తక రూపంలో తెలుగు, ఆంగ్ల భాషల్లో కూడా తేవడం జరిగింది.

దీంతో సమ్మేళనపు పూర్వ రంగపు తయారీ సిద్ధం అయింది. కానీ నగరానికి ఎన్నడూ రాని కళాకారులను ఒక్కసారిగా వేదిక మీదకు తీసుకు రావడం అన్నది సబబైన పని కాదు. కాబట్టి వారిని రెండు రోజులు ముందుగా విశ్వవిద్యాలయంలోని ఫ్యాకల్టీ క్లబ్‌లో వసతి ఏర్పాటు చేసి రమ్మని ఆహ్వానించడం జరిగింది. 14వ తేదీ, మార్చి నుండి కళాకారులు రావడం ప్రారంభం అయింది. 15,16 తేదీలలో ఒక్కో ప్రాంతం నుండి వచ్చిన వాళ్ళంతా అక్కడ ఒక్కచోట చేరి

ముచ్చటించుకున్నారు. తమతమ వాద్యాల వైశిష్ట్యతలని ఒకరికొకరు పంచుకున్నారు. ఒక సౌహార్ద్ర సంగీతమయ వాతావరణం అక్కడ నెలకొంది.

ఆయా కళాకారుల వాద్య నైపుణ్యాలతో పాటు వారి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంటుంది కాబట్టి విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థులు వారితో ముచ్చటించడం జరిగింది. గిరిజన, జానపద సాహిత్యాలకి వాటి అనుబంధిత శాఖలకి ఇది ఒక మంచి రీసెర్చి మెథడాలజీగా నిల్చింది. ఒక అడుగు ముందుకేసి పరిశోధనలు క్షేత్రంలోకి దిగితే భారతీయ సమాజాల పొరల్లో దాగిన ఎన్నెన్నో విషయాలు పరిశోధనలకై ఎదురు చూస్తున్నాయి. ఈ మూల సాహిత్యాల పరిశోధన పోత అచ్చులు / సాంచాలు అన్నీ పాశ్చాత్య నమూనాల్లో ఉండడం మనం వాటిని ఎంచుకోవడం దురదృష్టకరం. మన అధ్యయనానికి మన పరిశోధనారీతులు అవసరం ఉంది. వాటిని తయారు చేసుకోగల నైపుణ్యం మనకి ఉంది. కానీ ఆచరణలో పెట్టడానికీ విధానాలు కల్పి రావాల్సిన అవసరం ఉంది.

ఈ రెండు రోజుల (15,16 మార్చి) సహవాసంలో ఈ 56 వాద్యాలతో 190 మంది కళాకారులతో ముందుగా రేల పాటని, తర్వాత జయ జయహే తెలంగాణ పాటని, ఆ తర్వాత సారే జహాసే అచ్ఛా గీతాన్ని వాయించడం జరిగింది. చర్మ, తంత్రీ, ఘన, ఊదే వాయిద్యాలన్నీ ఒక్కసారిగా ఏక తాళంలో ఈ పాటలని వాయిస్తుంటే వచ్చిన సంగీత ప్రకంపనాలని వర్ణించడానికి ఏ భాషలో పదాలుండవు. గుండెల్లో తడి, కళ్ళల్లో చెమ్మ తప్ప. అతిథులుగా వచ్చిన తెలంగాణ హైకోర్టు జస్టిస్ శ్రీయుతులు రాఘవేంద్ర సింగ్ చౌహాన్, ఉప కులపతి ఆచార్య ఎన్. రామచంద్రం, ఇనాల్కో, పారిస్ నుండి వచ్చిన డేనియల్ నెజర్స్, గ్రీసు దేశపు సంగీతజ్ఞులు కాన్‌స్టాంటినోస్‌తోపాటు ఠాగూర్ ఆడిటోరియంలో ఉన్న అందరూ ఒకే వేదిక మీద 190 మంది కళాకారుల చేత వాయింపబడుతున్న 56 వాయిద్యాల సంగీత విన్యాసాన్ని మంత్రముగ్ధులై విన్నారు.

ఇక్కడ ఈ వాద్యకారుల సంగీత క్రమశిక్షణ గురించి కూడా ప్రస్తావించవలసి ఉంటుంది. ప్రకృతిలో భాగమైన తమ సంగీతాన్ని తమ తాళగతులలో స్వచ్ఛందంగా వాయించుకొనే విభిన్న వాద్యాల కళాకారులందరూ ఏకతాళానికి స్పందించడం, అదీ అంత తొందరగా (కేవలం మూడుసార్లు ఒక్కసారిగా వాయించడం మాత్రం జరిగింది). వారు తమని తాము ఆ ఏకతాళానికి మలుచుకోవడం అపురూపమైన విషయం. వారి సంగీత నైపుణ్యాలకి ఒక మచ్చుతునక. సంగీత దర్శకులు శ్రీ రామాచారిగారికి కూడా వాళ్ల సంగీత నిబద్ధత ఆశ్చర్యం కలిగించింది. ఆ వాద్యకారుల ఆకళింపు చూసిన తర్వాత ఆ 190 మందితో అవలీలగా ఆ మూడు పాటలని ఏకతాళం మీదికి తీసుకురావడం జరిగిందని రామాచారి గారు భావించారు. తమ తమ నిష్ణాతల గురించి మాట్లాడుకునే వారంతా ఈ ఏకరాగ, ఏకతాళ సమ్మేళనాన్ని గుర్తించి తీరవల్సిందే.

అలాగే సమ్మేళనపు రెండవ రోజు 18 మార్చిన ఒక స్పాంటేనియస్ జుగల్‌బందీలో ఒక తంత్రీ వాద్యం, ఒక ఘనవాద్యం, ఒక చర్మవాద్యం, ఒక సుషిర (ఊదే, గాలి) వాద్యం వాద్యకారులని అలా యధేచ్ఛగా వాయించమని కోరడం జరిగింది. ఏ తడబాటు లేకుండా, ఏ చర్చ లేకుండా అప్పటికప్పుడు, అక్కడికక్కడ వారు ఆ వాయిద్యాలన్నీ వాయించిన తీరు, ఆ కళాకారుల ప్రతిభ అబ్బుర పరిచింది. ఎంతటి నిపుణత, తత్పరత ఉంటే అది సాధ్యం అవుతుంది. వీళ్ళ 'లెస్ కాలిబర్ పర్సన్స్' గా పరిగణించేముందు అసలు కాలిబర్స్ నిర్వచనాలను తిరిగి నిర్వచించుకోవాల్సి ఉంటుంది.

అందుకే ఎవరూ వీరిని బిచ్చగాళ్ళని అంటున్నది. వీరు మన దేశపు సంగీత బహుళతకి సజీవ సాక్ష్యాలు. ఈ రెండు రోజుల వాద్య సమ్మేళనానికి అనుబంధంగా మార్చి 19న ఉస్మానియా విశ్వవిద్యాలయం నాలుగు శాఖల వారు ఒక జాతీయ సదస్సును నిర్వహించారు. పరిశోధక విద్యార్థుల అనుభవాలతో పాటు అక్కడికి ఆహ్వానింపబడిన నిపుణులు. ప్రొ. పులికొండ సుబ్బారావుగారు, డా॥ ఎ,కె. ప్రభాకర్, డా॥ ద్యావనపల్లి సత్యనారాయణ, ఎన్. సుభాషిణి, మెట్టు వెంకట నారాయణ తదితరులు ఆయా వాద్యం నేపధ్యాలని పరిశోధనల్లోకి ఎలా తీసుకు రావచ్చునో అన్న విషయాల మీద చర్చించారు.

ఈ అయిదు రోజుల మంథనం ఎన్నో విషయాలను తేటతెల్లం చేసింది. మూలాల్లోకి, మూలవాసుల దగ్గరికి, మూల ధ్వనుల, మూల సంగీతాల దగ్గరికి వెళ్ళలేని సమాజపు పరిమితుల దృష్ట్యా వారిని ఇక్కడికి ఆహ్వానించడం జరిగింది. ఆ సంగీతాల ప్రాశస్త్యాన్ని ఎవరైనా అంగీకరించక తప్పదు. ఆ విషయంగా ఈ సమ్మేళనం, వాద్యగోష్ఠి ఆరంభం మరిన్ని విషయాలను మనం స్మరించుకోవాల్సిన అవసరాన్ని ఎత్తి చూపడంలో ఒక భాగం మాత్రమే. ఒక సామాజిక బాధ్యత దృష్ట్యా వీటిల్లో అంతరించిపోవడానికి దగ్గరలో ఉన్న వాయిద్యాలని, ఆ వాయిద్యాన్ని వాయించే బతికి ఉన్న ఒకే ఒక్క కళాకారుడూ – అతను పోతే అతని వెనక లుప్తమయి పోయే ఒక వాద్య వైశిష్ట్యతతోపాటు ఒక సమూహపు వైశిష్ట్యతని ఏమి చేద్దామనుకుంటున్నామో తరచి చూసుకునే సమయం ఆసన్న మయింది.

భారతదేశపు బహుళ సంస్కృతుల గురించి చర్చించుకు నేప్పుడు భారతీయ సంగీతంలో సమభాగమైన గిరిజన, జానపద సంగీత, వాద్య రీతులను పక్కన పెడితే ఆ సంగీత చరిత్ర ఎలా సమగ్రమవగలుగుతుంది? ఇలాంటి ఎన్నో మౌలికమైన ప్రశ్నలని ఈ సమ్మేళనం లేవనెత్తింది. సంగీతం ఈ రీతుల నన్నింటిని కలుపుకొని వెళ్ళినప్పుడే సమగ్రం అవుతుంది. అప్పుడు మాత్రమే సంగీతం విశ్వజనీనం కాగలుగుతుంది. లేనప్పుడు అది అసంపూర్ణ చరిత్రగా మిగిలి భారతీయ సంగీత వాద్య చరిత్రని వెక్కిరిస్తూనే ఉంటుంది.

డా॥పి. శివరామకృష్ణ (శక్తి)
9441427977

భాష, సాహిత్యం, సంస్కృతి: ఆలోచనామృతం-రసాస్వాదం

'ప్రయోగ శరణా: వైయాకరణా:'

ప్రయోగం అంటే వాడుక భాషాశాస్త్రవేత్తలకు ఆధారం. అటు వంటి జనసామాన్యం వాడుక, సాహిత్యం- సహజ వనరులు శీతోష్ణ పరిస్థితులకు తగ్గట్లు పని పాటులలో రాటుదేలిన స్థానిక సంస్కృతిలో నుడికారం, శబ్దపల్లవం, పాట, కథ, సామెత ఇటువంటి సాహిత్య రూపంలో ఉంటుంది. అటువంటి సాహిత్యరూపంలో దాగివున్న జ్ఞానాన్ని, సత్యాన్ని తరతరాలకు అందించే విధానం తెలుసుకోవాలని జిజ్ఞాసువులు అనాదిగా ఆరాట పడుతున్నారు.

స్థానికమైన విశిష్టతలు, సమష్టి తత్వంతో గిరిజనుల జాన పదుల సాహిత్యం'ఆలోచనాత్మకం' (సంగీతమపి సాహిత్యం సర స్వత్యా: స్తనద్వయం- ఏకమాపాత మధురం,అన్యత్ ఆలోచనా మృతం). కాగా, రాజాశ్రయంతో 'రసాస్వాదం' కోసం (సంసార విష వృక్షస్య ద్వేఫలే అమృతోపమౌ - కావ్యామృత రసాస్వాద: సంగతి: సజ్జనై స్సహ) శిష్టులు కూర్చినది 'కావ్యామృతం'. వీటి విశ్లేషణ పద్ధ తులు ఒకే కుదురునించి వచ్చినా,మానవ శాస్త్రం అంటే సాంఖ్య న్యాయ దర్శనాల వైపు జానపదం, ముఖ్యంగా గిరిజన సంస్కృతి - వ్యక్తి నిష్ఠమైన శిష్ట సాహిత్యం అలంకార శాస్త్రం వైపుగా సాగి పోయాయి.

మానవ శాస్త్రంలో సాహిత్య విమర్శ జనసామాన్యానికి తెలి యదు. జనానికి దూరమైన అలంకార శాస్త్రం బోన్సాయ్ చెట్టు లాగా గిడసబారి పోయింది.

'బ్రౌన్ దొర తెలుగు పల్లె సాహిత్యం సేకరించటానికి పూనుకొని ఉంటే మన తెలుగు సాహిత్య చరిత్ర మరోలా ఉండేది. కానీ దానికి మనం నోచుకోలేదు', 'అంటూ పురిపండా అప్పలసామి, నేదునూరి గంగాధరంగారి 'మున్నీరు' ముందుమాటలో వాపోతారు.

ఆ పల్లెలలోని కష్టజీవులలో పట్టు సంపాదించిన వామపక్షాలు ఆటపాటలు సిద్ధాంతాలతో వారిని ఆకట్టుకున్నాయి కానీ వారి సంప్ర దాయం మీద దృష్టి పెట్టలేదు. ఒప్పందాలు రాజీలతో సరిపెడుతూ. వారిలో ఆలోచన పెంచలేదు. రచయితలు మేధావులుకూడా వారి అండదండలతో గుర్తింపు తెచ్చుకున్నారు కాబట్టి సిద్ధాంతచర్చలతో అటు తిప్పి ఇటుతిప్పి వారినే సమర్థిస్తారు. ఆయుధాలు వాడడంలో ఎప్పటికప్పుడు కొత్త మెలకువలు నేర్చుకోడంలో చూపిన చొరవ, అడవి భూమి కూలి చట్టాలకు సంబంధించిన కొలతలు లెక్కలు తెలుసు కోటంలో చూపరు..

1985లో వచ్చిన 'అడవిలో వెన్నెల' కథాసంకలనంలో ఆదిలా బాద్ జిల్లాలో ఉద్యమకారులు, అధికారులు భూస్వాములు కంట్రాక్ట రులు ఎలా తప్పుడు లెక్కలతో మోసగిస్తున్నది, నిలదీస్తే, పోలీసులతో ఎలా నోరుమూయిస్తున్నది స్పష్టంగా చెప్పారు.' సంగం పెడదాం, సాయుధపోరాటం చేపడదాం' అంటూ ఈ కథలు ముగుస్తాయి. ఈ సంకలనానికి, నాడు వరంగల్ పౌరహక్కుల ఉద్యమంలో ప్రధాన పాత్ర వహిస్తున్న బాలగోపాల్ ముందు మాట రాసారు. కానీ ఈ లెక్కల జోలికి ఆయనపోలేదు. గిరిజనులు న్యూనతాభావంతొ కుంగి పోతున్నారని, వారిలో విజ్ఞానం పెరగాలని ఆశించారు.

వామపక్ష అభిమాని శ్రీ శంకరన్ గిరిజన ప్రాంతాల భూ సర్వే1987లో చేపట్టారు. ఆ సర్వే ద్వారా ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు రెవిన్యూ డివిజన్లో భూ సమస్యలను ఎలా పరిష్కరించింది తెలియ జేసే వ్యాసం అనువాదాన్ని 'నడుస్తున్న చరిత్ర' ప్రచురించింది.

ఈ లెక్కల గుట్టు విప్పాలని రంపచోడవరంలో ఉద్యమించిన 'శక్తి', 1987లో,ఈ రికార్డు తీసుకొని ప్రారంభించిన ఉద్యమం పశ్చిమ గోదావరి ఖమ్మం జిల్లాలలో రాజుకుంది. రెవిన్యు జ్ఞానంతో బలోపేతులైన గిరిజనుల ఉత్సాహం చూసి ఉత్తేజితులైన అధికారులు, శ్రీకాకుళం జిల్లాలో 'బేర్ ఫూట్ ల్యాండ్ ప్రాబ్లం సర్వేయర్స్' బృందం తయారు చేసే ప్రణాళికలో భాగంగా ఈ జ్ఞానంలో శిక్షణ ఇవ్వ వలసినదిగా 'శక్తి'ని పంపించారు. **బేర్ ఫూట్ కార్యకర్తలను తయారు చేయటం మావో విద్యావిధానానికి పునాది**.

ముప్పై ఏండ్లుగా సాగుతున్న ఈ ప్రస్థానం, అరెస్టులు, ఆంక్షలు, నిషేధాలు,విల్లమ్ములతో యుద్ధాలు,కిడ్నాపులు మధ్య మధ్య తప్పకపోయినా, నిలకడగా సాగుతుంది, పత్రికలు సంవత్సరాల తరబడి ఈ వార్తలు రాసాయి గాని, ఆలోచనను పెంచని వాతా వరణంలో. ఈ జ్ఞానం, ఈ వ్యూహం నలుదిశలా వ్యాపించటం లేదు. అంతే కాదు, ఉద్యమాలు సాధించుకున్న చట్టాలకు గండి పడినప్పుడుకూడ మేధావుల బుర్ర పనిచేయలేదు. శ్రీకాకుళం పోరాటం వల్లవచ్చిన 1/70 రెగ్యులేషన్ గిరిజన ప్రాంతం గిరిజనులదే అని స్పష్టం చేసింది., కానీ గిరిజనులతో సంబంధం లేని ప్రభుత్వ ఖనిజాభివృద్ధి సంస్థకు షెడ్యూల్డ్ ఏరియాను కోర్టు కట్టబెడుతుంటే, ఇటీవల అటవీ హక్కుల గుర్తింపు చట్టం మీద కోర్టు తమ తీర్పును నిలుపు చేసుకున్న విధంగా, ఆందోళన చేయవలసింది పోయి, గుడ్డిగా మేధావులు దాన్ని సమర్ధించారు.

ఆమధ్య బాక్సైట్ గూర్చి గిరిజనుల అవగాహన తెలుసు కోటానికి చింతపల్లి వెళితే, ఉపాధ్యాయుడు లక్ష్మణరావు పరిచయమై నాడు. అందరిలాగే, ప్రసార మాధ్యమాలలో తరచు కనిపించే ప్రము ఖులకు అలవాటు పడ్డ అతగాడు, చాలామంది వస్తున్నారు, మీరెవరు అని ప్రశ్నించాడు. అతనికి ఇంటర్నెట్ చూసే అలవాటు ఉంది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నెట్లో పెట్టిన శ్వేతపత్రం లో 'శక్తి' వేసిన కేసు, శక్తి లేవనెత్తిన అభ్యంతరాలను గిరిజన సంక్షేమ కార్యదర్శి, పరి శ్రమలశాఖకు పంపిన ఉత్తరం చూపించాను. తనకు తెలిసిన పేర్లు కనిపించనందుకు ఆశ్చర్యపడ్డాడు.

తరువాత మేము కేసు వేసిన వార్త పేపర్లో చదివాడు..

తహసిల్దార్ తమకు కోర్టునుండి నోటిస్ వచ్చినట్లు చెప్పాడట. అటవీ హక్కులకోసం దరఖాస్తు చేయటానికి పటం గీయించటానికి మా సహచరులను పంపాను కానీ ఆ పని సాగలేదు. అక్కడే కాదు తాటాకు మంటలాగా భగ్గుమనడం తప్ప నిలకడగా విధివిధానాలను తెలుసుకునేందుకు జనం పూనుకోరు. రచయితలు మేధావులు జనాన్ని చిందులు తొక్కిస్తూఉద్యమసాహిత్యంతో సరిపెడతారు.

శ్రీకాకుళం జిల్లాలో పర్యావరణ ప్రాముఖ్యంగల బీల తంపర భూములు, గ్రామసభ అనుమతి లేకుండా పరిశ్రమలకివ్వరాదని జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశించింది. ఈ పరిశ్రమలకు వ్యతిరేకంగా పెద్దపోరాటం జరిగింది, కాల్పులలో ముగ్గురు చనిపోయారు. కానీ అటువంటి ప్రాముఖ్యతగల వనరుల గుర్తింపు కోసం దరఖాస్తు చేయటానికి ఎవరు ముందుకు రావటం లేదు. కవిత్వాలు రాసే వారు/రాయించే వారు ఉన్నారు కానీ సరిగా దరఖాస్తునింపడంలో సాయంచేసే వారు లేరు. ఇలా వస్తువు తెలియని కవిత్వాలు, విషయం తెలియని కథనాలను మన పత్రికలు టి.వి.లు వారి ఆస్థాన విద్వాంసులు చర్చకు పెట్టి వాదన పెంచడంలో, పక్కదారి పట్టించడంలో పండిపోయాయి.

భూమికోల్పోతే వచ్చే పరిణామాలను చిత్రిస్తూ 1964లో వచ్చిన ప్రసిద్ధ కథ 'యజ్ఞం', హరిజన పిల్లలను బడిలో ఎందుకు చేర్చలేదు, బడిలో ఈ భూమిలెక్కలు ఎందుకు చెప్పటంలేదు అని ప్రశ్నించలేదు. శ్రీకాకుళం పోరాటం లో భూమి కొలతలు వేయటానికి వచ్చిన సర్వేయర్లను ఉద్యమకారులు వెనక్కు పంపించారు.అప్పటికి ఇప్పటికీ ఉద్యమకారులు రచయితలు మేధావులది ఇదేధోరణి. అతివాదవర్గం జరుగుతున్న భీభత్సాన్ని చిత్రిస్తే, బడులు, చదువులవల్ల వచ్చిన 'చైతన్యాన్ని' మితవాదులు చూపిస్తుంటారు. ఇరు వర్గాలు కావ్యామృతాన్ని పంచి పెడుతూ ఉనికిని చాటుకుంటారు. ఈ వ్యాసంగం, పేరు ప్రతిష్టలను తెచ్చే ఆటవిడుపుగా మారింది.వీరిలో చాలామంది పల్లెప్రజలకు, ముఖ్యంగా గిరిజనులకు తమ అస్తిత్వాన్ని సంఘర్షణను చాటే సాహిత్యం ఉన్నదని తోచదు.తెలిసినా వాటి జోలికి పోకుండా ప్రపంచంలో ఎక్కడి సాహిత్యాన్నో ఉదహరిస్తూ చేసే రచనలతో పేరు సంపాదించుకుంటారు. విషయం వైపు మనదృష్టి మరల్చరు. జంగల్ నామా రచయిత సత్నం, మావో యిస్టులతో బస్తర్ తిరిగి తన అనుభవాలు రాస్తూ, గిరిజనులలో వీర గాథలు పోగుచేయవలసినదిగా సలహా ఇస్తాడు. దాని తెలుగు అనువాదం ముందుమాటలో, వాళ్ళు ఉద్యమ సాహిత్యం తప్ప అమ్మమ్మ నాయనమ్మ కథలు ఎప్పుడో మరిచారని తీసిపడేసారు.

అయితే పాలకవర్గాలకు ప్రజలను, వారి అస్తిత్వాన్ని విస్మరించడం కుదరదు. తెలుగు గిరిజనుల సంస్కృతిపై ప్రసంగాన్ని విని, ఉద్యోగ వశాన తప్ప తెలుగు తెలియని పాడేరులో గిరిజనాభివృద్ధి అధికారి 'తెలుగు గిరిజన గీతాలు' 200 ప్రతులు కొని ఉపాధ్యాయులకు పంచి పెట్టాడు. రచయితలెవరు పట్టించుకోనందున ఆ పుస్తకంలో విశేషాలు ప్రచారం లోకి రాలేదు.కానీ ఆ పుస్తకంలో ఇచ్చిన గేయగాథలో వర్ణించే మోదకొండమ్మ జాతరను 2016లో ప్రభుత్వం రాష్ట్ర గిరిజనోత్సవంగా ప్రకటించింది. సాహిత్య అకాడమి విజయవాడలో నిర్వహించిన గిరిజనరచయితల సదస్సులో, ఇటీవల పేరంటాంర్ర మీద జరిగిన సదస్సులో ఈ కథవిన్న ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక మరియు సంస్కృతి సమితి నిర్వాహణాధికారి శ్రీ విజయభాస్కర్ దాన్ని నృత్య రూపకంగా మలిచి ప్రదర్శించడానికి నిశ్చయించారు.

మరో తెలుగు తెలియని అధికారి 'రమ్యమైన రంప' అనే పేరు పెట్టి గిరిజనుల జ్ఞానం మీద కాలెండర్లు వేయించారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం కోసం సంప్రదాయ గ్రామపటాలు గీయించటంలో శిక్షణను ఇప్పించటమే కాదు, వారు వేయించిన కరపత్రంలో గిరిజన సంస్కృతిలో ప్రముఖ పాత్ర వహించే 'మగనాలిమెట్ట' 'చేవడి బస'లను ఉమ్మడి వాడుకలుగా ప్రభుత్వం పట్టాదారు పాస్ పుస్తకాల మీద పేర్కొంది. ఇటీవల గిరిజన సంస్కృతిని, ప్రాథమిక స్థాయిలో బోధించడానికి అనువుగా ప్రధానోపాధ్యాయుల కరదీపిక వచ్చింది. దీనిలో విశేషాలు ప్రచారంలోకి వస్తాయనుకోటం అత్యాశే కానీ, ఏదో ఒకనాటికి ఎవరో ఒకరి దృష్టిలోకి వస్తాయని నమ్మకం. ఇలా ఎక్కడో ఒక మెరుపు మెరిసినా, మధ్యతరగతి బుద్ధి జీవులు మాత్రం గానుగెద్దులాగా తమచుట్టు తాము తిరుగుతున్నారు.

1995 లో వెలువడిన ప్రపంచ పర్యావరణ నివేదిక (వరల్డ్ కమిషన్ ఆన్ ఎన్విరాన్మెంట్)...'పెట్టుబడి దారి, సామ్యవాద సిద్ధాంతాలు' రెండూ వీగిపోయినాయి. ఇక సంస్కృతి ఒకటే మనకు మిగిలిన మార్గం' అని జీవ వైవిధ్యం, సుస్థిర అభివృద్ధి,పరిపాలన వికేంద్రీకరణ మొదలైన మనం మరచిపోయిన దారులను గుర్తు చేస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా మార్క్స రెండు వందల జయంతులు జరుపుతున్న తరుణంలో, ఆయన భూమి, కూలి లెక్కలు ఎప్పటికప్పుడు సరిచేసుకోటం ద్వారా, ఆస్తులు కూడబెట్టుకునే, తక్కువ కూలితో సరిపెట్టే ధోరణిని అదుపులో పెట్టాలని చెప్పాడని మరిచిపోకూడదు.తరువాత అతని దారిలో సాగిన క్రిస్టఫర్ కాడ్వెల్ శాస్త్రం, కళల పరస్పర ప్రభావాన్ని 'మానవుడు శాస్త్రం ద్వారా ప్రకృతిలోకి ప్రవేశిస్తాడు, ప్రకృతి కళ ద్వారా మానవునిలోకి ప్రవేశిస్తుందని 'ఇల్యుజన్ అండ్ రియాలిటీ' లో వివరిస్తాడు. గ్రామ్సి, సంస్కృతి, జాతుల అస్మిత గూర్చి నొక్కి చెపుతాడు. ఆధిపత్య ధోరణులను నిరసించే పౌర హక్కుల ఉద్యమనాయకుడు, భాషాశాస్త్రవేత్త చామ్స్కీ దక్షిణ అమెరికా బుద్ధిజీవులతో కలసి వారి సంప్రదాయ సాహిత్యంలో ప్రయోగాలను సేకరించే పనిలో తలమునకలై పనిచేస్తున్నాడు. మనలో మహాకవులు కూడా అప్పుడప్పుడు ఇదే గుర్తు చేస్తూ వచ్చారు.కానీ, ఇప్పుడు పల్లె ప్రజల సంప్రదాయ సాహిత్యాన్ని, చట్టాలు చెప్పే లెక్కలతో సమన్వయించుకునే ప్రయత్నాలకు పెద్దపీట వేయాలి.ఆలోచనకు పదును పెట్టాలి.

'జాతి జీవనాళిక జానపద గీతిక'.

'చూశావా అరుద్రా! ఓ తమాషా, సంప్రదాయం నిలిచి ఉంటుంది హమేషా" – శ్రీ శ్రీ .

'చట్టం సాధికారితను తిరస్కరించ కుండా, దానిచుట్టు ఉండే మిథ్యను తొలగించడం అనే లక్ష్యాన్ని పౌరహక్కుల ఉద్యమం స్వీకరించాలి' – బాలగోపాల్.

అడక(ప్రశ్న) లను, సందేహాలను ఆహ్వానిస్తున్నాం

తెలుగుభాష- సమాజం, సాంకేతికత (కంప్యూటర్స్ వినియోగం) పరిపాలన, ఆర్థిక, రాజకీయ, అభివృద్ధి రంగాల అంశాలలో ప్రశ్న(అడక)లను, సందేహాలను తెలుపండి. వాటికి ఆయారంగాలలో నిపుణుల సమాధానాలను ఈ శీర్షికలో అందజేస్తాము.

ప్రశ్నలను పంపేవారు editorammanudi@gmail.com ద్వారా నేరుగా అమ్మనుడి సంపాదకునికి తమ ప్రశ్నలు పంపవచ్చు. లేదా నేరుగా పోస్టుకార్డుపై వ్రాసి మా కార్యాలయానికి పోస్టు చేయవచ్చు.

ఈ సారికి పేరు తెలియని వ్యక్తులు కోరా (quora) అనే ప్రశ్న జవాబు పద్ధతిలో నడిచే ఒక జాల స్థలానికి వ్రాసిన 2 ప్రశ్నలకు 'అమ్మనుడి' బృంద సభ్యులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు ఇచ్చిన సమాధానాలను ఇక్కడ ఇస్తున్నాం. ఇదే పద్ధతిలో పలు అంశాలపై ప్రశ్నలను అడగండి.

– సంపాదకుడు

ప్రశ్న : 'ఱ' అక్షరాన్ని ప్రోత్సహించి తిరిగి వాడుకలోకి తెచ్చే మార్గాలేమిటి? (తమిళం, ఇటాలియన్, ఇతర భాషల్లో విరివిగా వాడే ఈ అక్షరం తెలుగులో కనుమరుగయింది).

జవాబు : బండిరా గా ముద్దుగా పిలుచుకునే ఱ ఆధునిక తెలుగులో కనుమరుగయింది. పాత తెలుగులో ఉచ్చారణ కారణంగా ఈ అక్షరం ఉండేది. ఆధునిక తెలుగులో 'ఱ' కు 'ర' కు మధ్య అంతరం లేదు. అనగా ఒక అక్షరం బదులు ఇంకొక అక్షరాన్ని చేర్చటం వలన పలకటంలో వచ్చే మార్పు వలన అర్థాలు మారిపోవు. ఇలా అర్థాల అంతరం లేని దగ్గరగా ఉండే శబ్దాల అక్షరాలు ఒక దాని బదులు మరొకటి వాడగలిగే అవకాశం ఉన్నపుడు ఒకటి కనుమరుగయి తీరాలి. కొందరు భాషా ప్రేమికులు కావాలనే ఉన్న చోట లేని చోట ఇలాంటి అక్షరాలను బలవంతంగా వాడి తమ భాషా ప్రేమను బయట పెట్టుకుంటారు. తాము చేసేది సరైన విధంగా భాషను వాడటమని అనుకుంటారు. కానీ వారు నిజంగా అలా చేయడం లేదు. క్రీ.శ. 10 నాటికే రెండు అక్షరాల మధ్య భేదం లేదని శాసనాలలో ఆధారం మనకు లభిస్తుంది. కానీ కొందరు కవులు వ్యత్యాసంతో రెండు అక్షరాలను వాడటం వదలలేదు. సాధారణ ప్రజలు మాత్రం పదవ శతాబ్దం నుండే వాడుకలో 'ఱ' ను 'ర' ను కలిపివేసారు.

ఎన్నో అక్షరాలు తెలుగులో నుండి కనుమరుగు అయ్యాయి, మరెన్నో కొత్తగా వచ్చి చేరాయి. ఉదాహరణకు 7వ శతాబ్దానికే అక్షరాన్ని తెలుగు వాళ్ళు వాడుక భాష నుండి తీసివేసారు.

కింద ఇచ్చిన జాబితాలో బ్రాకెట్(కుండలీకరణ)లో ఉన్న అక్షరాలు తరువాతి కాలంలో తెలుగు లో చేరాయి,

క (ఖ) గ (ఘ) k kh g gh n

చ (ఛ) జ (ఝ) c ch j jh ñ

ట (ఠ) డ (ఢ) ణ t th d dh nh

త (థ) ద (ధ) న t th d dh n

ప (ఫ) బ (భ) మ p ph b bh m

య ర ల వ y r l w (v)

(శ ష) స హ sh sh s h

ళ ఱ, ల la ra, z

అచ్చులు :

అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, (ఋ,ౠ), ఎ, ఏ, ఐ, ఒ, ఓ, ఔ, అం(అః).

ఒకవేళ ఎవరైనా పనిగట్టుకొని ఱ ని తిరిగి ప్రాణం పోసి తెలుగులోకి చొప్పించినా, "ఎక్కడ ఏ ర/ఱ వాడాలి?" అన్న సంశయం అడుగడుగునా కలుగుతూ ఇబ్బంది పెడుతుంది. ఎందుకంటే ప్రజల భాషలో ఆ రెండు అక్షరాలు ఒకటైపోయాయి. భాషాపరంగా ఆ అక్షరాన్ని చేర్చుకుని ప్రత్యేక ప్రయోజనం ఏమీ ఒరగదు.

మనకున్నన్ని హల్లులు తమిళంలో లేవు. అందువలన భాషల మధ్య పోటీలా ఇది చూడకుండా మనకు ఉపయోగం లేని పాత అక్షరాలని బలవంతంగా చొప్పించే ఆలోచన చేయవద్దు.

ప్రశ్న : తెలుగు భాషలో ఎక్కువ పదాలు సంస్కృత భాషవి ఉన్నాయి కదా, తెలుగు ద్రావిడ భాష ఎందుకయింది?

జవాబు : ఔను, తెలుగు ద్రావిడ భాషే, ఎందుకంటే తెలుగులో సహజమైన పదాలు, తెలుగు భాషా స్వరూపం ద్రావిడం కనుక.

మీరడిగిన ప్రశ్న ఎలాగుందంటే, "గబ్బిలం ఎగురు తుంది కదా, దాన్ని పక్షి ఎందుకు అవ్వదు, తిమింగలం నీళ్ళలో ఈదుతుంది కదా, అది చేప ఎందుకు కాదు" అని.

ఈ రెండు ప్రశ్నలకు జవాబును మనకు జీవశాస్త్రం ఇస్తుంది. ఆ జంతువుల జన్యుపరమైన సమాచారం అవి క్షీరదాలు అనీ, వాటి వాతావరణానికి తగ్గట్టు అవి మారాయని మనకు తెలుస్తుంది.

గబ్బిలం ఎగిరేందుకు రెక్కల లాంటివాటిని తయారు చేసుకుంది, అవి నిజంగా రెక్కలు కాదు, అలానే తిమింగలం నీళ్ళల్లో ఉండేందుకు తన శరీరాన్ని మలుచుకున్న క్షీరదం, దానికి పొలుసు ఉండదు. శాస్త్రీయంగా ఈ రెండింటినీ మనం క్షీరదాలంటామే కానీ పక్షి అనో, చేప అనో కాదు. కానీ ఒక కవికో, కాల్పనిక రచయితకో అవి పక్షి/చేప లాగానే

(తరువాయి భాగం 32వ పుట...)

వెన్నెలకంటి రామారావు
9550367536

పర్యావరణ పరాయీకరణ ప్రణాళికలు

వాతావరణ మార్పు క్రమానుగత స్థితి నుంచి 'ఆకస్మిక' దశకు చేరుకోబోతున్న తరుణంలో ప్రపంచలోకెల్లా అతి పెద్ద ప్రజాస్వామిక ప్రక్రియగా పరిగణిస్తున్న భారత సార్వత్రిక ఎన్నికల నగరా మోగింది. ఏప్రిల్ 11 నుంచి మే 19 వరకు 7 దశల్లో పోలింగ్ సాగి మే 23న ఫలితాల వెల్లడితో సార్వత్రిక, నాలుగు అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది. పెనుముప్పుగా ముంచుకొస్తున్న వాతావరణ మార్పు భారత వ్యవసాయోత్పత్తిని దెబ్బతీసి ఆహార భద్రతకు గండి కొట్టడమే కాకుండా, ప్రజారోగ్యం, పర్యావరణం పెద్ద ఎత్తున ధ్వంసమవుతున్న పరిస్థితి ప్రజల దైనందిన జీవితాల్లోకి ప్రత్యక్షంగా అనుభూతమవు తోంది.

వాతావరణ మార్పుకు దోహదం చేసే కార్పొరేట్ అనుకూల / ప్రేరిత పారిశ్రామిక విధానాలను విచక్షణా రహితంగా అమలు చేస్తున్న పాలకులు, ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు ఈ ఎన్నికల సంద ర్భంలో తమ పర్యావరణ పరిరక్షణ వైఖరి ప్రకటించక తప్పదు. ఎన్నికల ప్రచార కార్యక్రమాలు ప్రారంభమైన అతి కొద్ది సమయంలోనే సార్వత్రిక శాసనసభ ఎన్నికలు జరుగుతున్న ఒడిసా రాష్ట్రంలో, కరువు కరాళ నృత్య వేదిక అయిన కలండి జిల్లాలో లంజిగఢ్ పట్టణంలోని వేదాంత అల్యూమినియం రిఫైనరీలో ఉద్యోగాలు కల్పిస్తామని, పిల్లలకు ఉచిత విద్య, వైద్యం అందిస్తామని హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కంపెనీ యాజమాన్యానికి వ్యతిరేకంగా స్థానిక నిర్వాసితులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అయితే ప్రజల న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించేందుకు ప్రభుత్వం సకాలంలో స్పందించకపోగా, ప్రభుత్వ పారిశ్రామిక భద్రతా దళాలు వారిపై అమానుషంగా చేసిన దాడిలో ఇద్దరు మరణించగా, 50 మందికి పైగా తీవ్రంగా గాయపడడం అమానుషం.

ఎన్నికల సందర్భంలోనే ప్రభుత్వం, పాలకులు జంకుగొంకు లేకుండా ప్రజలపై దాడికి పాల్పడితే, అధికారంలోకి వచ్చిన పార్టీ ఇంకెంత తీవ్రంగా ఉంటుందో ఊహించ వచ్చు. అధికార, ప్రతిపక్షాలు రెండింటికీ కార్పొరేట్ ఎజెండా తప్ప ప్రజాసంక్షేమం, పర్యావరణ పరిరక్షణ కేంద్రంగా దీర్ఘకాలిక స్వల్ప కాలిక యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టే ఎజెండాలేవీ లేవని, మహా అయితే ఏవో కొన్ని కంటి తుడుపు వాగ్దానాలతో కూడిన కొన్ని జుమ్లాలు (ఉత్తుత్తి హామీలు) మాత్రమే ఉన్నాయని ఆయా పార్టీల ఎన్నికల ప్రణాళికలే సాక్ష్యాలుగా ఉన్నాయి.

'భూతాపం', గ్లోబల్ కన్వేయర్ బెల్ట్ (థర్మోహలైన్ సర్క్యులేషన్ సిద్ధాంతం), 'కార్బన్ వలయం' అనే కీలకమైన పర్యావరణ భావనలను ప్రతిపాదించిన సుప్రసిద్ధ భూగోళ శాస్త్రవేత్త వాల్లస్ స్మిత్ బ్రొయకర్ అనే శాస్త్రవేత్త ఈ ఏడాది ఫిబ్రవరి 18న మరణించడానికి ముందు శాస్త్రవేత్తలకు ఒక సందేశమిచ్చారు. భూతాపం, వాతావరణ మార్పు ముప్పుల నుంచి మానవాళి రక్షించేందుకు మన విధాన కర్తలు, పాలకులు ఎలాంటి చొరవ చూపడం లేదని, ఈ నేపథ్యంలో శాస్త్ర వేత్తలే అధ్యయనం చేసి భూగోళ పరిరక్షణకు తీవ్ర చర్యలు చేపట్ట వలసిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

ఒక దశాబ్దం గడిస్తే ఈ ప్రమాదం నుంచి మానవాళిని ఎవరూ రక్షించలేరని హెచ్చరిస్తూ, భూగోళం చుట్టూతా గంధకం ఆచ్ఛాదనను ఏర్పాటు చేయడం ద్వారా సూర్యరశ్మి భూమిని చేరకుండా నిరోధించాలని, శీతోష్ణస్థితి ఉపశమించి అనుకున్నంత దశ దాకా చల్లబడినాక సల్ఫర్ ఆచ్ఛాదనను తొలగించవచ్చని ఆయన సూచించారు. ఈ సూచనను శాస్త్రవేత్తలు ఎలా పరిపూర్తి చేయగలరన్నది సందేహమే అయినా, మరో మౌంట్ పినటుబొ వంటి అగ్నిపర్వత విస్ఫోటనం ఏమైనా వారికి ఉపకరించ వస్తుందేమో వేచిచూడాలి. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ వైపరీత్యాలు విరుచుక పడుతున్నాయి, వ్యవసాయ ఉత్పాదక క్షీణిస్తోంది.

వాతావరణ మార్పు ప్రభావం అందరికీ అనుభూతమై ఆందోళన కలిగిస్తోంది. అంతర్జాతీయ వాతావరణ మార్పు సదస్సులు, ఐక్యరాజ్య సమితి సారథ్యంలో నడిచే కాప్ ఒప్పందాలు భారీగా లక్ష్యాలను నిర్దేశించుకుంటున్నప్పటికీ కార్పొరేట్ శక్తుల కుట్రలకు అవి నిరర్థంగా మారుతున్నాయి లేదా ఆ సదస్సులు ఎలాంటి నిర్ధారణకు రాకుండానే అర్ధాంతరంగా ముగుస్తున్నాయి. ఆకస్మిక దశకు అతి త్వరలో చేరు కోబోతున్న వాతావరణ మార్పు ముప్పును పరిష్కరించడంలో ప్రభు త్వాలు, పాలకులు, వివిధ రాజకీయ పక్షాలు కార్పొరేట్ శక్తుల అనుకూల విధానాలతో కంటితుడుపు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ పౌర సమాజం తీవ్రంగా స్పదించింది. ఈ క్రమంలో మార్చి 15న ప్రపంచ వ్యాప్తంగా 123 దేశాల్లో 2,052 ప్రాంతాల్లో భూగ్రహాన్ని రక్షించుకుందాం', 'వాతావరణ మార్పు కాదు...వ్యవస్థ మార్పు కావాలి' అనే నినాదాలతో ప్రపంచ వ్యాప్తంగా పిల్లలు, విద్యార్థులు, యువకులు 'గ్లోబల్ క్లైమేట్ యాక్షన్' అనే నిరసన కార్య క్రమాన్ని విజయవంతం చేపట్టారు. దేశంలోను, అంతర్జాతీయంగాను వివిధ వర్గాల, వయసుల ప్రజల నుంచి వ్యక్తమవుతున్న పర్యావరణ పరిరక్షణ ఆకాంక్షలను మితవాద, మిలిటెంట్ వామపక్షాలు సహా రాజకీయ పక్షాలేవీ సవ్యంగా గుర్తించి, సహేతు పరిష్కారాలను ప్రతి పాదించడంలో విఫలమయ్యాయి.


కార్పొరేట్ అనుకూల వ్యవసాయ, పారిశ్రామిక విధానాల కారణంగా వ్యర్థాలు, కాలుష్యాల కారణంగా తలెత్తుతున్న గాలి, నీరు, కాంతి కాలుష్యం దేశాన్ని చుట్టుముట్టి ప్రజలను ఆరోగ్య

రీత్యానూ, ఆర్థికంగానూ అతలాకుతలం చేస్తున్నాయి. ప్రపంచీకరణ ప్రారంభ నుంచి ఈ సమస్యలు భారత్‌ను వేధిస్తున్నాయి. నీటి సంక్షోభం (గుణం, పరిమాణాల రీత్యా), అడవుల విధ్వంసం, మైనింగ్, పారిశ్రామిక కాలుష్యం ముఖ్యంగా ఫార్మారంగం, భూతాపం వల్ల ఏర్పడిన వాతావరణ మార్పు కారణంగానూ, హరిత విప్లవ విధ్వంసం కారణంగా వ్యవసాయోత్పత్తి పడిపోవడం, సముద్రం, నదుల్లోనూ, వాటి ఒడ్డుల్లోనూ వేధిస్తున్న కాలుష్య సమస్యలు ఏవీ కూడా ఇప్పటికీ పరిష్కారం కాలేదు. నమామి గంగా ప్లాన్, యమునా పరిరక్షణ వంటి భారీ ప్రాజెక్టులు ఆచరణలో ఒక్క అడుగుకు పురోగతి సాధిం చలేదు. 2014 ఎన్నికల సందర్భంలోను జాతీయ పార్టీలు ప్రాంతీయ పార్టీలు తమ ప్రణాళికల్లో సుస్థిరాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ చర్యల వంటి పడికట్టు పదాలతో ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నించాయి.

అధికారంలోకి వచ్చిన రాజకీయ పక్షం అంతకు ముందు ప్రజలు ఉద్యమించి సాధించిన పర్యావరణ పరిరక్షణ హక్కులను కాలరాచింది. పర్యావరణ ప్రమాదకర పరిశ్రమలకు, మౌలిక సదుపాయాల రూపకల్పనకు, ప్రాజెక్టులకు విచక్షణా రహితంగా అనుమతులిచ్చింది. తెలంగాణ ప్రభుత్వమైతే ఏకంగా కార్పొరేట్ అభివృద్ధి ఎజెండా కోసం జరిగే భూసేకరణను అడ్డుకు నేందుకు స్థానిక ప్రజలకు హక్కులు కల్పించే లక్ష్యంతో భారత ప్రభుత్వం కూడా సంతకం చేసిన అంతర్జాతీయ ఒప్పందానికి తూట్లు పొడుస్తూ పంచాయితీ రాజ్ చట్టాన్ని తీసుకొచ్చింది. ఆ చట్టంతో స్థానిక ప్రజల భాగస్వామ్యంతో నడిచే పంచాయితీల నుంచి తీర్మానం రూపంలో భూసేకరణ కోసం అనుమతి తీసుకునేందుకు అవసరం ఉండదు. అదీకాక పర్యావరణ, వ్యవసాయ రంగ విధ్వంసం సృష్టించే పోల వరం, కాళేశ్వరం వంటి భారీనీటి ప్రాజెక్టులపైన, బొగ్గు, బాక్సైట్ తదితర ప్రకృతి వనరుల మైనింగ్ కార్యకలాపాలపైన రెండు తెలుగు రాష్ట్రాల్లోని అధికార, ప్రతిపక్షాలకు ఏకీభావం ఉంది. భారీ నీటి ప్రాజెక్టులు, హరిత విప్లవాల వల్ల పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో వ్యవసాయోత్పత్తి దెబ్బతినడమే కాక, ప్రజారోగ్యం పెద్ద ఎత్తున దెబ్బ తిన్న చారిత్రక విషాదాల నుంచి మన రాష్ట్ర పాలకులు గుణపాఠం తీసుకోకుండా ఆ కార్పొరేట్ విధానాలనే ప్రోత్సహిస్తుండడం క్షమించ రానిది.

రాజకీయ పార్టీల ఎన్నికల ప్రణాళికలు ప్రజలు ఎదుర్కొం టున్న తక్షణ సమస్యలను పరిష్కరించే విధాన పత్రాలుగాకాక, వివిధ సామాజిక అస్తిత్వాల కోరికల చిట్టాకు సంబంధించిన వాగ్దాన ప్రకటనలుగా, 'ఉచితాల' తాయిలాలతో, డబ్బుతో ప్రజలను మభ్య పెట్టే, ప్రలోభపెట్టే లబ్ధి పొందాలనుకునే కుయంత్రా లుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో పర్యావరణ సంక్షోభం యావత్ ప్రపంచాన్ని చుట్టు ముట్టిన తరుణంలో దేశంలోను, ఆయా రాష్ట్రాల్లోనూ అమలు చేయవలసిన పర్యావరణహిత వ్యవసాయ, పారిశ్రామిక విధానాలపై ఏ ఒక్క ఎన్నికల ప్రణాళిక దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికతో దృష్టి కేంద్రీకరిచలేదనడం అతిశయోక్తి కాదు. ఆర్థికం పర్యావరణ (జమిలి) సంక్షోభం (యుగ సంక్షోభం – ఎపోకల్ క్రైసిస్) లో ప్రపంచం కూరుకుపోయిన కాలంలో 'పచ్చదనం' లేదా 'పర్యావరణ పరిరక్షణ' అనేవి ప్రజాస్వామ్యానికి పర్యాయపదాలుగా మారాయి.

పర్యావరణ పరిరక్షణ గురించి సమగ్ర ప్రస్తావనలేని ఎన్నికల ప్రణాళికలతో పోటీచేస్తున్న పార్టీలకు ప్రజలు తగిన విధంగా బుద్ది చెప్పాల్సిన తరుణమిది.



మధురాంతకం నరేంద్ర
9866243659

సాహిత్యమూ - న్యాయశాస్త్రమూ

ధర్మం, నీతి, న్యాయం - వంటి పదాలను నిర్వచించడం అంత సులభంగాదు. కాలాన్ని బట్టీ, ప్రాంతాన్ని బట్టీ, విషయాన్ని బట్టీ అవి మారిపోతూ వుండడమే అందుకు కారణం. సమకాలీన సమాజానికొక ప్రతి బింబంలా, వ్యాఖ్యానంలా సాగే సాహిత్యంలో యిటువంటి సార్వకాలికమైన అంశాల చర్చ సాగుతూనే వుంటుంది. ధర్మశాస్త్రమనీ, నీతి శాస్త్రమనీ, మహాకావ్యమనీ, రకరకాలుగా విశ్లేషించబడే మహాభారతంలో న్యాయమన్నది కౌరవుల పక్షంలోనే వుందని వాదించే వర్గమొకటి యెప్పుడూ వుంటోంది. అందు వల్ల న్యాయమన్నది స్పష్టంగా గుర్తించడం చాలా సమయాల్లో కష్టంగానే వుంటుంది.

స్త్రీ పురుషులు కలిసి సహజీవనం చేయడానికి వివాహమనే వ్యవస్థను తయారు చేసుకోవడమూ, కుటుంబమనే ప్రాథమిక సమాజం రూపొందడమూ-మానవ నాగరికతా పరిణామంలోని తొలి అడుగులు. సమాజం తనకు రక్షణ కల్పిస్తున్నందుచేతే వ్యక్తి సమాజ పరిధిలో వుంటున్నాడనీ, వ్యక్తి సహజంగా స్వార్థపరుడనీ -తామస్ హాబ్స్ అనే రాజకీయ శాస్త్రవేత్త తన "లెవియతాన్" గ్రంథంలో పేర్కొంటాడు. వ్యక్తికున్న స్వార్థ పరత్వం వల్ల యితరులతో అతడికి పోట్లాటా, వివాదమూ యేర్పడుతోంది. అందుచేత న్యాయాన్యాయ వివాదాలు మానవజాతి తొలి నాటి నుంచీ వుండే వుంటాయి. క్రమంగా యీ వాద వివాదాలే న్యాయశాస్త్రంగా రూపొందాయి. మానవ నాగరికతా వికాసపు తొలి నాళ్లలో వచ్చిన పురాణాలు, యితిహాసాలలో గూడా న్యాయశాస్త్ర ప్రస్తావన కనబడుతుంది.

ప్రాచీనకాలంలో రాజే న్యాయాధిపతిగా వుండేవాడు. మహాభారతంలోని విరాట పర్వంలో విరాట రాజు కొలువుకు సైనికులు యిద్దరు స్త్రీలనూ, వొక చంటిబిడ్డనూ తీసుకొస్తారు. ఆ యిద్దరు స్త్రీలూ ఆ బిడ్డ తనదేనని మొరబెట్టుకుంటారు. ఆ సమస్యకు తీర్పునిచ్చే పనిని విరాట రాజు కంకుభట్టుకు అప్పగిస్తాడు. కంకుభట్టు వేషంలో వుండే ధర్మరాజు ఆ బిడ్డను రెండుగా కోసి యిద్దరికీ వో భాగం యిమ్మని తీర్పు చెప్తాడు. అప్పుడు నిజమైన తల్లి తన బిడ్డను చంపద్దనీ, ఆ బిడ్డను యింకో స్త్రీకే యివ్వమనీ ప్రాధేయ పడుతుంది. అలా ధర్మరాజు నిజమైన తల్లెవరో తెలుసుకుంటాడు.

మహాభారతంలోనే 'న్యాయం' గొడవ తోబాటూ 'సాక్ష్యం' అవసరం గూడా పేర్కొన బడింది. తాను నిజంగా దుష్యంతుడ్ని పెళ్ళా డానని నిరూపించుకోడానికి శకుంతలకు 'వుంగరాన్ని' సాక్ష్యంగా చూపెట్టవల్సిన అవసరం ఏర్పడుతుంది.

విక్రమార్కుడి కథలు, మర్యాద రామన్న కథలు, తెనాలి రామకృష్ణుడి కథలు మొదలైన అనేక జానపద కథల్లో 'న్యాయ వివాదాలూ, ఆశ్చర్యకరమైన తీర్పుల ప్రసక్తి వస్తూనే వుంటుంది. యమ ధర్మరాజు సింహా సనం వొక వెంట్రుకకు వేలాడుతూ వుంటుం దనీ, ఆయన న్యాయం తప్పితే అది తెగి పడుతుందనీ వొక జానపద గాథ చెబుతుంది.

యింగ్లీషు సాహిత్యంలోనైతే యింగ్లీషు సాహిత్య పితామహుడని భావించే జెఫ్రీ చాసర్ "కాంటర్ బరీ టేల్స్" లోనే న్యాయాధీశుడొకడు దర్శనమిస్తాడు. అదొక ఆదర్శ పాత్ర. అయితే షేక్స్పియర్ కాలానికొచ్చే సరికే కొందరు న్యాయవాదులు దుర్మార్గులై పోయినట్టున్నారు. ఆయన రాసిన 'మెజర్ షార్ మెజర్' నాటకంలో వో పాత్ర 'అందరు న్యాయ వాదుల్నీ చంపేసెయ్యండి' అంటుంది. అయితే ఆయనే 'మర్చెంట్ ఆఫ్ వెనిస్' నాటకంలో 'పోర్షియా' వంటి గొప్ప మానవ తావాది అయిన న్యాయవాదినీ చిత్రించాడు. అమెరికా, యింగ్లండు దేశాల్లోని యిప్పటి ప్రముఖ న్యాయశాస్త్ర విశ్వవిద్యాలయాల్లో 'షేక్స్పియర్, న్యాయశాస్త్రమూ'. "షేక్స్ పియర్ నాటకాల్లోని నీతీ, న్యాయము వంటి అంశాలు పాఠ్యాంశాలుగా వున్నాయి. ఆగష్టియన్ కాలానికి వచ్చేసరికి జోసఫ్ అడిసన్, హెన్రీ ఫీల్డింగ్‌ల వంటి న్యాయవాదులూ, న్యాయాధీశులూ రచయితలైపోయారు. ఆస్కార్ వైల్డ్‌ల వంటి రచయితలు జీవిత కాలపు కోర్టు కేసులతో సతమతమై పోయారు. న్యాయవాదిగా చదువుకోడానికి తగినంత సొమ్ములేక పోవడంతో న్యాయవాది కాలేక పోయిన చార్లెస్ డికెన్స్ నవలలన్నీ సామాన్యుల తరపునా, పరాజితుల తరపునా వాదిం చిన కేసులే! ఆధునిక యింగ్లీషు డిటెక్టివ్ నవలల్లో ప్రధాన పాత్రలు చాలా వరకూ న్యాయవాదులే! (పెర్రీ మాసన్ వంటివాళ్ళు)

ఆధునిక తెలుగు సాహిత్యానికి యుగ కర్తగా గౌరవించుకునే గురజాడ అప్పారావు గారు చిన్నతనంలో జడ్జీ కావాలని కోరుకున్నారట ! రాయవరం కోర్టులో జడ్జిగారి తల వాకిలి దగ్గరకు వెళ్లి తలుపు మీద సుద్ద ముక్కతో "జి.వి. అప్పారావు. బి.ఎ.బి.ఎల్. జిల్లా మునసబు" అని రాశారట! "నువ్వు జడ్జివని మోసపు ప్రకటన చేసినందుకు నిన్ను శిక్షించవచ్చు". అన్న జడ్జితో "అది ప్రకటన గాదండీ నా కోరిక మాత్రమే!" అని వాదిం చారట! సాహిత్య సృజననంతా అన్యాయంగా శిక్షించబడుతున్న వాళ్ళ పక్షాన వాదించడానికే వెచ్చించిన వాడు గురజాడ. కన్యాశుల్కంలో కక్షిదారుల్ని మోసం చేసే న్యాయ వాదులతో బాటుగా "సౌజన్యారావు" వంటి గొప్ప మానవతా వాదినీ, 'అగ్నిహోత్రావధానులు" వంటి కక్షిదారినీ రామప్ప పంతులు వంటి మధ్యవర్తినీ పరిచయం చేశారాయన.

ఆధునిక భారతీయ సాంస్కృతిక పున రుజ్జీవనపు కాలంలో గొప్ప సాంఘిక సంస్కర్తలూ, రాజకీయ నాయకులూ చాలా వరకూ యింగ్లండు వెళ్ళి "బారిష్టరు" చదువు చదువు కొచ్చిన వాళ్ళే! "బారిష్టరు అనే మాట అన గానే తెలుగు సాహిత్యంలో అజరామరంగా మిగిలిపోయిన 'బారిష్టరు పార్వతీశం' గుర్తుకొస్తాడు. మొక్కపాటి నరసింహశాస్త్రిగారి నవలలో పార్వతీశం అనే కుర్రవాడు మొగల్తూరు

నుంచీ స్కాట్‌లాండ్ లోని ఎడిన్‌బరో నగరానికెళ్లి లా కళాశాలలో బారిష్టరు పాసైవస్తాడు. స్వదేశంలో ప్రాక్టీసు పెట్టాక స్వాతంత్ర్యో ద్యమంలో పాల్గొంటాడు. పేరుకు బారిష్టర్ అయినా అతడు న్యాయ వాదిగా యెదుర్కొన్న సమస్యలు'! అప్పటి న్యాయ వ్యవస్థల గురించిన ప్రస్తావన లేవీ ఆ నవలలో అంతగా లేవు. తరువాత కాలంలో బళ్లారి రాఘవ, ఉన్నవ లక్ష్మీనారాయణ వంటి న్యాయ వాదులు సాహిత్య కళారంగాల్లో ప్రసిద్ధి పొందారు.

కోర్టులూ, న్యాయవాదులూ, పోలీసులూ, ప్రభుత్వమూ – వీళ్ళందరితో కలగలిసిన న్యాయవ్యవస్థ భూమికగా సమకాలీన సమా జంలోని అమానవీయతనంతా తూర్పార బెట్టిన మహా రచయిత రాచకొండ విశ్వనాథ శాస్త్రి. ఆయన రచనలన్నింటిలోనూ న్యాయ వ్యవస్థ చేతిలో తగులుకుని విలవిలలాడే సామాన్యులే కనిపిస్తారు.

“న్యాయంట, ధర్మంట, సత్యంట! ఇలాంటివారే వెనకటికోసారి “నిజం చెప్పు! నిజం చెప్పు!” అంటూ పెళ్ళాం పీక పిసికేసి నూతిలోకి దూకేసేడు. నిజమూ, న్యాయమూ కావాలి, కావాలంటే నేను కాపరం చేసి పుట్టించాలిగానీ ఎక్కణ్ణించీ వొస్తుంది నిజం?” అని 'న్యాయం' కథలో హెడ్డు కానిస్టేబులు వాపోతాడు. అదే కథలో వొక మేస్ట్రేటు పద్ధతి ప్రకారం దోషిని వరస ప్రశ్నలతో పరీక్ష చేయటం చూసిన వాళ్ళంతా “యీ కేసుతో తెల్లారిపోతుంది కాబోలు. చాదస్తం మొగుడు చెబితే వినడు, చెప్పిందాకా ఒగ్గడు. అలా సూస్తావుండు” అని గొణు క్కుంటారు.

రావిశాస్త్రిగారు రాసిన సారా కథలన్నింటిలో 'న్యాయం' పేరుతో జరిగే దురన్యాయమంతా విస్పష్టంగా కనబడుతుంది. “సారా అసలు దొరకలేదు. దొరికిందని కేసు పెట్టారు. దొరకలేదని తిరిగి తేలగొట్టేసారు. విషయం జరగలేదు. జరగని విషయం జరిగింద న్నారు. జరిగిందని చెప్పబడిన జరగని విషయం జరగలేదన్నారు. లేదు. ఉంది. అంతా మాయ జేశారు” అంటాడు రచయిత. గవర్మెంటు అంటే 'డబ్బు' అనీ, పోలీసోడి టోపీ అనీ, మున్సీబు, కర్నాలు, తాసీ ల్దారు, కలెక్టరు, ఎమ్మెల్యే నెంబరు, ఆరిపైన మినిస్ట్రు అనీ, వీళ్ళందరూ ఆడుతున్న ఆటలో మోసం చేయడమే రాజనీతిగా మారుతోందనీ ఆయన హెచ్చరిస్తాడు.

పెద్ద ప్లీడరుగారు కుర్రలాయరుకు “ది ఎర్లీ బర్డ్ కాచెస్ ది వర్మ్'' అన్నాడు ఇంగ్లీషువాడు...వేశ్యలు వీధి గుమ్మాలు కని పెట్టుకునుంటారు. నక్కలు శ్మశానాన్ని పట్టుకుని వేళ్ళాడుతాయి. కొంగలు రేవుని కాసుకునుంటాయి. సామ్యం బావులేదు. కానీ మనం చెయ్యవలసిన పని కూడా అదే!” కోర్టంటే యేమిటో తెలుసా? పెద్ద అడవి! హయానాకు తెలుగు పేరు తెలుసా? దుమ్ముల గొంది. అది అడివిలో మనిషి నవ్వినట్టు అరుస్తుంది; నవ్వు విని వెళ్తే నమిలి మింగేస్తుంది. మనం కోర్టుకొచ్చిన పార్టీలను ఆకర్షించాలి. వృత్తి ధర్మం అది. ఏం చేస్తాం?” అని సలహా యిస్తాడు. రావిశాస్త్రిగారు తన నాటకం 'నిజం'లో సత్యాన్ని కోర్టులో ధనవంతులెంత సులభంగా కొనుక్కోగలరో నిరూపించి చూపిస్తారు.

'బీనాదేవి' అనే పేరుతో కథ వ్రాసిన దంపతులు నరసింగరావు, సుందరమ్మగార్లలో నరసింగరావు గారు జడ్జిగా పని చేశారు. అందుకే వారు రాసిన అనేక కథల్లో గూడా రావిశాస్త్రిగారి రచనల్లోలాగే న్యాయవ్యవస్థలో జరుగుతున్న దురన్యాయాల్ని యెండగట్టడం కన బడుతుంది. మాలతీ చందూర్‌గారు రాసిన 'సద్యోగం' నవల వొక యువతి న్యాయవాద వృత్తిలో సర్దుకుపోవడంలో వున్న పరిస్థితుల నంతా ఆసక్తికరంగా వివరిస్తుంది.

తన క్లయింటును కాపాడ్డామనే ప్రాథమిక బాధ్యతను నెర వేర్చడం కోసం ఆ యువతి తనను వేధించి, చివరకు విడాకులివ్వ డంలో గూడా యిబ్బంది పెట్టిన మాజీ భర్త తరపున వాదించాల్సి వస్తుంది.

యిటీవలికాలంలో జడ్జిగా పనిచేసిన రాజేందర్ జింబోగారూ, న్యాయవాదిగా వుంటున్న నందిగం కృష్ణారావుగారూ కోర్టు కథలు చాలా రాశారు. జింబోగారు రాసిన “రూల్ ఆఫ్ లా” కథలు బాగా ప్రాచుర్యాన్ని పొందాయి. నందిగం కృష్ణారావుగారు 'నాలుగు కాళ్ళ న్యాయం' కథల సంపుటంలో సమకాలీన న్యాయవ్యవస్థలో వుండే లుకలుకలు చాలా పరిచయం చేస్తారు. “చీకటిలో నల్లపిల్లి” 'మరణా నంతరం' అనే నవలలోనూ కృష్ణారావుగారు న్యాయం చుట్టూ అల్లు కున్న అవినీతి కథలనంతా బహిర్గతం చేస్తారు.

గమనం (మధురాంతకం నరేంద్ర రాసిన కథ) లో వో కుర్ర లాయరు ఆదాయం కోసం యిన్సూరెన్సు కేసుల కోసం వెదుకుతాడు. వో ప్రమాదంలో మరణించిన యువకుడి తల్లిదండ్రుల దగ్గరికి వెళ్తాడు. అప్పటికే వొక పెద్ద లాయరు యిన్సూరెన్సు డబ్బులు తీసిస్తా నన్న ఆశ చూపెట్టి ఆ ముసలాయిన దగ్గర వీలయినంత ఫీజు గుంజు కుని వుంటాడు. ఆ ముసలి తల్లిదండ్రులను మళ్ళీ కేసేయడానికి వొప్పించే సరికి, ఆ మరణించినవాడు వివాహితుడనీ, అతగాడి భార్య మళ్ళీ పెళ్లి చేసుకొందనీ తెలుస్తుంది. తన భార్యకు గూడా వాటా యిస్తేగానీ ఆవిడను కోర్టులో సాక్ష్యానికి పంపనని తాజా భర్త మొండి పట్టు పడతాడు. వాటాయిస్తే తన భార్యను తాళి లేకుండా వితంతు వులా పంపడానికి గూడా సిద్ధ పడతాడు. తననక్కడికి చేర్చిన గుమా స్తాకూ, పోలీసుకూ గూడా భాగాలు పంచాక ఆ కుర్ర న్యాయవాదికి మిగిలేదేముంటుంది? రెండు రూకలు కళ్ళజూడాలంటే అతగాడు అమాయకులైన ముసలి తండ్రులను మోసగించక తప్పదు.

మనుషులు తయారు చేసి న్యాయ వ్యవస్థ యెంత దుర న్యాయంగా వుంటుందో వివరించిన టాల్‌స్టాయ్ నవల “పునరుజ్జీ వనం', న్యాయానికీ శిక్షకూ వున్న సంబంధాన్ని చిత్రించిన దాస్టోవిస్కీ నవల 'నేరము –శిక్ష' గత శతాబ్దపు ప్రారంభంలోనే న్యాయవ్యవస్థ పరిమితులనూ, బలహీనతలనూ వివరించాయి. యిలా సాహిత్య మెల్లప్పుడూ సామాన్యుడి న్యాయవాదిగా వుంటూ సమాజంలో జరుగు తున్న అన్యాయాలనంతా దుయ్యబడుతూనే వుంది.

(యిటీవల ఔరంగాబాదు మహారాష్ట్ర జాతీయ న్యాయ విశ్వ విద్యాలయంలో జరిగిన “సాహిత్యము–న్యాయశాస్త్రము–పరస్పర సంబంధాలు” అనే సదస్సులో చేసిన ప్రసంగం ఆధారంగా)

పరభాషా ద్వేషం, పరభాషా దాస్యం – రెండూ తప్పులే

కె.బి.లక్ష్మి
9441797650

పన్నీరు బుడ్డి



తెలీదన్నట్లు తల ఊపింది. "గులాబీ నీటిలో పూల అత్తరు కలిపితే పరిమళ భరిత మౌతుంది. ఆ నీటిని పన్నీరు బుడ్డిలో పోసి జల్లితే పరిమళం పరివ్యాప్తమై చిరుజల్లుగా చల్లగా హాయిగా ఉంటుంది. భాషని మనసు పెట్టి నేర్చుకుంటే భాషా సొగసులోని మాధుర్యం హృదయోల్లాసాన్ని కలిగిస్తుంది. కొంచెం కొంచెం పెద్దవుతున్నకొద్దీ నీకు ఇవన్నీ తెలుస్తాయిరా ఆర్యమ్మా! ఆయుష్ మాన్‌భవ..."

సాయంత్రం జరిగిన శుభకార్యం తాలూకు హడావుడి తెలుగు వెలుగులా ఇల్లంతా పరుచుకుని వుంది. ముచ్చట్లు, మురిపాలు, నవ్వులు, వేళాకోళాలతో నిండిన కబుర్లతో హాలంతా ఆనంద కోలాహలంగా వుంది. ఉండదూ మరి చిన్నారి మహితకి వోణీల పండగ కదా!

పిల్లలు కేరింతలు కొడుతూ అల్లరి చేస్తూ అటూ ఇటూ పరిగెడుతూ ఆడుకుం

పచ్చని చేమంతులు, తెల్లని కొండ మల్లెలు, సింధూర వర్ణ బంతిపూలు, ఆకు పచ్చని మామిడితోరణాల అలంకరణ అందా లనేగాక మధుర పరిమళాలను పరి వ్యాప్తిమ్మ చేస్తూ ఇల్లంతా పండగ శోభతో మెరిసి పోతోంది. ముందు రోజు

టున్నారు.

"నువేమైనా చెప్పు వదినా ఇది మన ఆచారం కాదు. ఏమిటో ఒకరిని చూసి ఒకరు అన్నీ మనవే అనేసుకోవడం,చేసేసు కోడం. పైగా బోల్డంత ఖర్చు. పెళ్ళికొడుకు ఒకడే తక్కువ." కాఫీ తాగి ఖాళీ గ్లాసు పక్కన పెడుతూ అంది రుక్మిణి.

"ఆచారమంటే అందం ఆనందంతో కూడిన వేడుకేగా రుక్కూ! దాన్ని సొంతం చేసు కోవాలన్న సంబరంలో తప్పేముంది?! ఉన్నంతలో జరుపుకోవడమే. ఖర్చు అంటావా ఎవరి బడ్జెట్ వాళ్ళకుంటుంది కదా!" అంది విశాలాక్షి చిరునవ్వుతో.

"నువ్వన్నీ నవ్వుతూ కొట్టి పడేస్తావులే విశూ! పది పదకొండేళ్ల పిల్లకి ఇంత హంగూ ఆర్భాటం అవసరమంటావా?దీనికే ఇంత యితే ఇంక పెళ్ళికి ఎంతో !" ఆశ్చర్యం ప్రక టించింది రుక్మిణి చేతులు, కళ్ళూ తిప్పుతూ.

"చూడు, ఒక్కగానొక్క కూతురు. భరించే శక్తి వుంది. ఇల్లు కట్టినా, ఒక వస్తువు కొన్నా, ఒక కార్యం నిర్వహించినా అంతా ఒక పద్ధతిగా ప్రణాళికతో చేస్తాడు వెంకట్. మాలతి కూడా అనుకూలవతి,సరదా వున్న మనిషి. మనం వచ్చి సంతోషంగా నాలుగు అక్షింతలు వేసి ఆశీర్వదించి చీరా సారె పట్టు కెళ్తే మహా సంబరపడిపోతారు. నీకు మాత్రం తెలీదా ఏమిటి రుక్కూ ! అయినా నీకు ఇద్దరూ అబ్బాయిలే కనుక అలా అనిపిస్తుంది. వాళ్లకి పంచల ఫంక్షన్ చేయకుండానే పెళ్లిళ్లు చేశారు. మనవరాళ్లు పుడితే, నువ్వు కాదన్నా నీ కోడళ్ళు ఊరుకోరులే. చూస్తానుగా ! సర్లే ఇంకో కాఫీ తాగుతావా?" వేళాకోళమాడింది విశాలాక్షి.

హాయ్, ఏంటి విశాలత్తా! ఇద్దరూ సెపరేట్‌గా చాట్ చేసుకుంటున్నారు?" అంటూ ఆకాశ్ వచ్చి వాళ్ళ ముందు కూర్చు న్నాడు.

తమ సంభాషణ వివరించింది విశా లాక్షి.

"రుక్కు పిన్నీ నువ్వింకా కౌంటర్లు వేస్తూనే వున్నావన్న మాట. మీ మురళి మొన్నామధ్య ఆటా తెలుగు సభల్లో కలిశాడు. శీను కెనడాలో వున్నాట్టగా! బాబాయ్ రాలేదేం?" కుశలం అడిగాడు ఆకాశ్.

"ఇవి మాకు మామూలేలే. బాబాయికి ఈ మధ్య బాగా లోబాక్ పెయిన్. ప్రయా ణాలు తగ్గించారు. అమెరికా నుండి శలవలకి వచ్చావ్ ఫ్యామిలీతో, బాగుందిరా ఆకాశ్. నీ భార్య ప్రతిభ,మీ అమ్మాయి మాన్య ఏరీ?"

"ఇక్కడికని ప్రత్యేకంగా రాలేదు పిన్నీ, చెన్నైలో మా కాలేజీ అల్యూమినికి వచ్చాను. అమ్మా నాన్నా హైదరాబాద్. సో, మధ్యలో విజయవాడలో ఈ ఫంక్షన్‌కి రమ్మని వెంకట్ మామ బాగా ఇన్సిస్ట్ చేశాడు. ప్రతిభకి మన తెలుగు సంప్రదాయాలంటే చాలా ఇష్టం. మహిత ఫంక్షన్ చూసి అన్నీ మాలతి అత్తని అడిగి తెలుసుకుంటోంది. ఆర్య మహితతో వుంది. ఆర్యకి కూడా అమెరికాలో ఇలా ఓణీల పేరంటం చెయ్యాలని తన కోరిక. నువ్వు, విశాలి అత్తా తప్పక రావాలి."

"అమెరికా రావడమంటే అనకాపల్లి వెళ్లడమనుకుంటున్నావురా!లక్షలతో పని."

"మరీ చెబుతావులే పిన్నీ! తమ్ముళ్ల దగ్గరికి వస్తారుగా. మీరెప్పుడొస్తే అప్పుడే ఫంక్షన్."

"మీ ఆవిడకంటే ముందు నీకే ఎక్కువ ఉత్సాహంగా వున్నట్లుందే!" అన్నారు విశాలాక్షి, రుక్మిణి ఒకేసారి

"పోండి అత్తా !మీరు మరీను." సిగ్గుగా అని అక్కడినుంచి వెళ్ళిపోయాడు ఆకాశ్. ఇద్దరూ నవ్వుకున్నారు.

*

ఆకాశ్ భార్య ప్రతిభా పాటిల్. గుజ రాతీ అమ్మాయి. పెళ్ళయ్యాక ప్రతిభా ఆకాశ్ పాటిల్ అని పాస్పోర్ట్, ఇతర ఐడెంటిటీల్లో పేరు మార్చుకుంది. ప్రాజెక్ట్ మేనేజర్ ఆకాశ్ ని ఇష్టపడి తెలుగు అబ్బాయిలు "unconditional sincere" గా ప్రేమిస్తారని భార్యని ఆత్మీ యంగా (తన వారిలో కంటే) చూసుకుం టారని, అబ్బాయి చెబితే అత్త మామలు కాదనలేరనీ వగైరా వగైరా గ్రహించినదై అందగాడైన మంచివాడు ఆకాశ్ ఓ సుము హూర్తాన పెద్దల అనుమతితో తన మెడలో తాళి కట్టేలా చేసుకుంది. ఇద్దరికీ అమెరికా లోనే ఉద్యోగం. అంతవరకూ సుఖాంతం.

తెలుగు మొగుడు కావాలి గానీ తెలుగు భాష' నో.' అలా అని ఆమెకి గుజ రాతీ రాదు. చదువుకున్న విధానం వల్ల అంతా హిందీ ఇంగ్లిష్. అవే వారి సాంకేతిక భాషలు. అత్తగారింటికి వచ్చినా ఆ రెండు భాషలే. హాయిగా సాగాల్సిన సంభాషణలు వాక్యాలుగా కాక పదాల్లోకి కుంచించుకు పోయాయి. భాష కేవలం కమ్యూనికేషన్ కోసమే అన్నట్లయింది. మనసారా అమ్మా నాన్నలతో మనసు విప్పి మాట్లాడుకోడానికి లేదు. ఏం మాట్లాడుకుంటున్నారో అని అను మానం. ప్రతిదీ అనువదించి చెప్పాలి. చిన్న పుటి మిస్సమ్మ, మాయాబజార్ జోకులు డైలాగ్స్ వగైరా అనువాదంలో సహజత్వాన్ని కోల్పోవడమేకాకుండా తమంతట తాము ఆస్వాదించే అవకాశాన్నికూడా

కోల్పోయారు. ఎంతసేపూ పరభాష లతో విసుగెత్తింది. వచ్చిన తెలుగు మర్చి పోతానన్న భయంతో ఫోన్లలోనూ, అమెరికా తెలుగు స్నేహితులు, కజిన్స్‌తోనూ, ఇండియా వచ్చినపుడు ఆకాశ్ తన భాషా దాహాన్ని కొంత వరకు తీర్చుకోగలుగుతున్నాడు.

కోడలితో వియ్యపురాలితో అచ్చటా ముచ్చటా మాట్లాడుకుందామన్న ఆకాశ్ తల్లి కోరిక కోరికగానే మిగిలిపోయింది. ఆవిడకి వచ్చిన కాస్తపాటి ఇంగ్లిష్, టివి హిందీ సీరి యళ్లు, సినిమాల వాళ్ళ అబ్బిన అరకొర భాషాజ్ఞానంతో నెట్టుకొస్తోంది.

"ముదితల్ నేర్వగరాని విద్యగలదే ముద్దార నేర్పించినన్..." అని పెళ్లయిన కొత్త ల్లోనూ ఆతర్వాత్తా ప్రతిభకి తెలుగు నేర్ప డానికి, కనీసం ఎంతోకొంత మాట్లాడితే చాలనీ శాయశక్తులా ప్రయత్నించాడు ఆకాశ్. తొలి మోజులో కాస్త చిలక పలుకులు పలి కినా ఆ పైన తన శాయశక్తులా తెలుగు దరి చేరనివ్వకుండా అలకలు అల్లలతో ప్రయ త్నించి స్వీయ విజయ బావుటా ఎగరేసింది ప్రతిభామతి. అప్రతిభుడయ్యాడు ఆకాశ్. అయినా "పట్టీ విడువరాదూ" అన్న త్యాగ రాజ స్వామిని గుర్తు చేసుకుని పరిపరి విధాల పలు ప్రయత్నాలు చేశాడు. ఊహు!లాభం లేక పోయింది.

ఆర్య పుట్టాకా కొత్త కోరికలు చిగురిం చాయి. "అత్తా తాత అల వల" అని బుజ్జి కన్నకి పితృభాష నేర్పే మెళకువలు కని పెట్టాడు. పెరుగుతూ పెరుగుతూ ముద్దుతో అటు తల్లి హిందీ ఇటు తండ్రి తెలుగునీ అర్థం చేసుకుని ఏది చెబితే అది పలుకుతూ

వాళ్ళని ఆనందపరవశుల్ని చేసింది. అది మూడేళ్ళ ముచ్చట. చూస్తూండగానే ఆకాశ్‌కి ఉద్యోగపు ఒత్తిడితో హాయ్, బై తప్ప ఆర్యతో గడిపే సమయం లేకుండా పోయింది. ప్రతిభకి పిల్ల స్కూల్, ఇల్లు, ఉద్యోగంతో సరిపోయింది. ఫలితం ఆర్య భారతీయభాషా పలుకులు పూర్తిగా మర్చిపోయింది. అమెరికన్ ఉచ్చారణతో ఇంగ్లిష్ తప్ప మరోమాట లేకుండా తయారయింది. దాంతో భాషని ప్రేమించే తెలుగు సర్కిల్స్ ని కలిసినపుడు, అనర్గళంగాతెలుగు మాట్లాడే పిన్నలు పెద్దలు మధ్య అర్ధంగాక అయోమయంగా చూసే ప్రతిభ, ఆర్యల వల్ల ఎంతో అపరాధ భావనకి గురై, వేదన పడేవాడు. దాంతో ఎవరెన్ని ప్రశ్నలు వేసినా చిరునవ్వే సమాధానంగా అలాంటి వాటికి తానొక్కడే వెళ్ళడానికి అలవాటు పడ్డాడు. కానీ ఫేస్ బుక్ ,వాట్సాప్ ల్లో మాతృభాషా దినోత్సవాలు,ఉద్యమాలు గురించి చూసినపుడు, చదివినపుడు తన నిస్సహాయతకి తననితానే నిందించుకునే వాడు. కనీసం హిందీ అయినా క్షుణ్ణంగారానీ అని బతిమాలాడు ప్రతిభని. 'ఇక్కడ అవి నేర్చుకుని ఏంచేస్తుంది వదిలెయ్ అంది నిర్లక్ష్యంగా.

సంగతులన్నీ స్నేహితురాల్లాంటి అమ్మతో పంచుకునేవాడు. అందుకే ఇండియా వచ్చినా అమ్మా నాన్నల దగ్గర గడిపేవాడేగాని బంధువుల ఇళ్ళకి, ఊళ్ళకి వెళ్ళేవాడుకాదు. అపుడపుడు మాటల్లో కామాక్షి "ఒరేయ్ ఆకాశ్ భాష అనేది కమ్యూనికేషన్ కోసమే. అది నీకూ తెలుసు. మన స్వయంకృతాలకి పిల్లలకి బంధుప్రేమలు అందకుండా చేయకూడదురా. రాకపోకలుంటేనే మంచీచెడూ తెలుస్తాయి. మా కొడుకూ కోడలు మనుమరాలిని అందరికీ చూపించుకోవాలని వాళ్ళు మిమ్మల్ని చూసి ఇంతవారైనందుకు సంతోషపడుతూ ఆశీర్వదిస్తే చూడాలనీ నాన్నకి నాకూ వుంటుందిరా. నలుగురిలోనూ ఉంటే ఆర్య, ప్రతిభా పరిస్థితులు గ్రహించగలుగుతారు. అయినా నీ కూతురికి నేర్పాల్సింది మదర్ టంగ్ కాదు ఫాదర్ టంగ్. ఆ ప్రయత్నం మాత్రం మానకు. మనదేశంలో కంటే మీ దగ్గరే బోలెడు తెలుగు స్కూళ్ళు వున్నాయిటగా ,చేరిస్తే ఆర్యకి తప్పక తెలుగు వస్తుంది. ఇలా చెబితే అలా పట్టేస్తుంది. పిల్ల తెలివైంది." అంటూ కొడుకు మనసు తేలికపరుస్తుంది. ఆ మాటల ప్రభావమే మహతి ఫంక్షన్‌కి రావడానికి దోహదపడింది.

*

విశాలాక్షి గోపాల్ దంపతులకి సంతానం లేదు. లేదని విచారం లేదు. అందరి పిల్లలూ తమ పిల్లలే అనుకుంటారు. బంధువులు, స్నేహితులు అందరిళ్ళల్లో అన్ని కార్యాలకి అటెండ్ అవుతారు. చెదరని చిరునవ్వుతో పరిసరాల్ని ఆహ్లాదంగా ఉంచుతారు. అందుకే ఫంక్షన్‌లలో వాళ్ళు లేకపోతె ఎవరికీ తోచదు. ఆకాశ్ కి గోపాల్ మామయ్య అంటే ఇష్టం. ఎప్పుడూ మాంఛి హుషారుగా ఉంటాడు. పిల్లల్ని వెంటేసుకొని ఊరూవాడా తిప్పుతాడు. వాళ్ళల్లో ఒకడై అల్లరి చేస్తాడు. చెయ్యనిస్తాడు.

ఈసారి కూడా పిల్లలందర్నీ తీసుకుని సరదాగా అమరావతి, దుర్గ గుడీ అవీ చుట్టి వచ్చారు. గాంధీ హిల్ ప్రోగ్రామ్ కూడా వుంది" గోపాల్ మామయ్యా ఇదంతా నీ వల్లే సాధ్యం." అని తెగ మెచ్చుకున్నాడు ఆకాశ్. చిన్నప్పుడు ఎక్కిన గాంధీహిల్ అనుభవాలు నెమరేసుకున్నాడు. ఇంటికి వచ్చాకా వేడి వేడి టీ తీసుకురమ్మని విశాలాక్షికి పురమాయించి ఆకాశ్ ని డాబా మీదకి తీసుకెళ్లాడు గోపాల్. తిరుగుప్రయాణం ఎపుడు, యాత్రల నించి అమ్మా నాన్నా ఎపుడొస్తారు? వంటి సాధారణ సంభాషణతో మొదలుపెట్టి విషయంలోకి వచ్చాడు గోపాల్. ఈ లోపల టీ పట్టుకుని విశాలాక్షి కూడా వచ్చింది.

"నువ్వు గమనించావో లేదో గాని మన ట్రిప్‌లో ఆర్య అస్తమానూ కళ్ళు తుడుచుకుంటూనే వుంది. అందరూ కేరింతలు కొడుతూ ఏవేవో మాట్లాడుకుంటూ నవ్వుతూ పరుగులు పెడుతుంటే ఆర్య చాలా ఉదాసీనంగా వుంది. ఇంట్లో నీ వైఫ్ అవసరార్థం అక్షతం సమర్పయామీ అన్నట్లు టూకీగా మాట్లాడుతోంది." అన్నాడు గోపాల్

"ఆవిడకి తెలుగు రాదండి. మన వాళ్ళ హిందీ ఇంగ్లిష్ నాలెడ్జ్ అంతంత మాత్రం. అదే సమస్య" అంది విశాలాక్షి.

"నాకుతెలుసు విశాలీ. పరిష్కారంలేని సమస్యలుండవు. కామాక్షి అక్కయ్య వీడికి చేసిన బోధనలు చెప్పాడు.తను ఏం చేయలేక పోతున్నాడో చెప్పాడు. ప్రతిభ మనస్తత్వం గురించీ చెప్పాడు. ఇవన్నీ అలా ఉంచి అసలు చికిత్స చేయాల్సింది ఆర్యకి. నువ్వెళ్ళి నెమ్మదిగా నిశ్శబ్దంగా దాన్ని ఇక్కడికి తీసుకురా విశూ"

విశాలి ఖాళీ కప్పుల ట్రే పట్టుకుని కిందకి వెళ్ళింది.అంత వేగంగానూ ఓ చిన్న వెండి గిన్నెలో పెరుగన్నంతో సహా ఆర్యని తోడ్కొని వచ్చింది. పున్నమి వెన్నెల. చల్లగా హాయిగా వుంది. విశాలి ఆర్యని వొళ్ళో కూర్చోబెట్టుకుని చెంచాతో పెరుగన్నం తినిపిస్తోంది. ఆకాశ్ అభావంగా వున్నాడు.

గోపాల్ ఆర్యని మురిపెంగా చూస్తూ "పన్నీరుబుడ్డి ఏదిరా?" అన్నాడు.

కళ్ళు విప్పార్చి గోపాల్ కేసి ప్రశ్నార్థకంగా చూసింది ఆర్య. ఓణీల పేరంటంలో పసుపు, కుంకుమ, గంధం, అక్షింతలు తోటి కజిన్స్ పేరంటాళ్ళకి అందిస్తుంటే వెంకట్ ఆర్యకి వెండి పన్నీరు బుడ్డి ఇచ్చి అందరి మీదా ఎలా జల్లాలో చెప్పాడు. తర్వాత జాగ్రత్తగా తనకివ్వమంది మాలతి. పన్నీరు జల్లడాన్ని యాక్షన్ చేసి చూపిస్తూ మళ్ళీ అడిగాడు గోపాల్. గుర్తొచ్చింది. దాన్ని పన్నీరుబుడ్డి అంటారని ఇపుడే తెల్సుకుంది. చిరునవ్వు పరుచుకున్న పెదవులతో పన్నీరుబుడ్డి అని ముద్దుగా ఉచ్చరిస్తూ మాలతికి ఇచ్చేశానని చెప్పింది ఆర్య. అందరి మీదా పన్నీరు జల్లుతుంటే వాళ్ళు నవ్వుతూ చేతులు అడ్డం పెట్టుకోవడం అన్నీ గుర్తొచ్చి పకపకా నవ్వింది. పొరమారుతుందని నోట్లో ముద్ద పెట్టడం ఆపింది విశాలాక్షి. పెరుగన్నం తినడం పూర్తయింది. కాసిని మంచినీళ్లు తాగింది. తేలిక పడిన వాతావరణంలో మెల్లిగా ఆర్యతో మాట్లాడ్డం మొదలుపెట్టాడు గోపాల్. సంభాషణ ఇంగ్లీష్‌లో నడుస్తోంది.

కంటినీరు తుడుచు కోవడం, ఉదాసీనంగా ఉండడం,గలగలా మాట్లాడకపోవడం గురించి అడుగుతూ ఒక్కో ప్రశ్నకీ సమాధానం రాబట్టాడు." కొంచంసేపు తనతో ఇంగ్లీషులో మాట్లాడినా తర్వాత తనకి ఏమీ తెలియకుండా మాట్లాడుకుని నవ్వుకున్నారని, దగ్గరికి వెళ్లినా 'you do not know go' అని కసిరారని, మహిత కూడా తను అదేంటి ఇదేంటి అని అడిగితే ఓ 'my god' అని విసుక్కుందనీ, భాష రాకపోవడంవల్ల ఏమీ మాట్లాడలేక పోతున్నానని ఏడు పొచ్చిం దని, దిగులేసిందనీ, అమ్మకి చెబితే డోంట్ టాక్ డోంట్ టెల్ మీ అని అందరి ముందూ గట్టిగా

కోప్పడిందనీ” చెబుతూ ఏడ్చేసింది ఏడేళ్ల ఆర్య. చటుక్కున ఒళ్ళోకి తీసుకుని పొదివి పట్టుకున్నాడు ఆకాశ్. చెంపలు తుడి చాడు. అంతా నిశ్శబ్దం. కాస్సేపటికి ఊర డిల్లింది.

ఆర్య చేతులు నిమురుతూ “ఆర్యా డియర్, వీళ్లందరి తిక్క కుదర్చాలి. వాళ్లంతా నిన్ను చూసి ఆశ్చర్యపోవాలి. నీ మాటలు విని థాం అని పడిపోవాలి. నీ చుట్టూ తిరు గుతూ నీ అమెరికా స్కూలు, పియానో మ్యూజిక్, ఆర్ట్, కరాటే కబుర్లు చెప్పమని వేడు కోవాలి. అప్పుడే వెళ్ళిపోతావా?మళ్ళీ ఎప్పుడొస్తావ్? అని అడగాలి. ఉండిపొమ్మని బతిమాలుకోవాలి. వీలయితే ఇక్కడే తమతో కలసి చదువుకోమని ప్రాధేయపడాలి. పడతారు”. అంటూ ఆగాడు గోపాల్. శ్రోతలు ముగ్గురి కళ్ళూ విస్మయంతో విచ్చుకున్నాయి.

“ఒక డ్రీమ్ ల్యాండ్ లోకి తీసుకెళ్ళావ్ మామయ్యా. నువ్వన్నట్లు జరగాలంటే అల్లావుద్దీన్ అద్భుత దీపం రావాలి.” నిట్టూరుస్తూ అన్నాడు ఆకాశ్.

ఇండియన్ కామిక్స్ చదివే ఆర్యకి అల్లావుద్దీన్ తెలుసు. అందుకే తండ్రి మాటలకి నిటారుగా కూర్చుంది. సాధ్యాసాధ్యాల గురించి సాలోచనగా చూసింది విశాలి గోపాల్ వైపు.

“అల్లావుద్దీన్ అక్కర్లేదు మన ఆర్య చాలు. అద్భుత దీపం అవసరం లేదు. మన ఆర్య 'will power' సంకల్పం చాలు. ఏరా అమ్మలూ “అన్నాడు ఆర్య బుగ్గలు పుణుకుతూ.

ఆర్యకి ఇదంతా మేజిక్ లా వుంది. ఎలా అన్నది తెలీదు. అందుకే అడిగింది “ఎలా?”అని.

“సింపుల్. నీకేదైనా గిఫ్ట్ ,బుక్ ,డ్రెస్ లాంటివి కావాలంటే ఏంచేస్తావ్?”

“అమ్మా నాన్నని అడుగుతాను”

“నో అంటే ,ఇవ్వకపోతే ?”

“మళ్ళీ మళ్ళీ అడుగుతాను. అలుగుతాను. ఏడుస్తాను. అన్నం తినను. మాట్లాడను”

“చాలు. నీ దగ్గర భలే తిరుగులేని ఆయుధాలున్నాయి. వాటిని నీ తెలుగు భాషోద్యమంలో ప్రయోగించు. విజయం నీదే ఆర్యా!”

అర్ధం కాలేదన్నట్లు చూసింది ఆర్య. “చూడు నాన్నా! నీకు మీ నాన్న మదర్ టంగ్ వస్తే నే చెప్పిన మ్యాజిక్ అంతా సాధించ గలవ్. నువ్వు చాలా తెలివైన అమ్మా యివి. ఏదైనా చెప్పగానే వెంటనే నేర్చేసుకుంటావు. కాబట్టి మీ దేశంలో మీ ప్రాంతానికి దగ్గర్లో వున్న సిలికానాంధ్ర తెలుగు బడిలో చేర్పించమను. కాదంటే నీ ఆయుధాల్ని ప్రయోగించు. ఒకటొకటి, లేదా అన్నీ కలిపి. అసలంటూ బడి మొదలయ్యాకా మిగతావన్నీ నేర్పించడానికి, తెలుగు వేదికలపై నీతో పద్యాలు, పాటలు,మాటలు వినిపించే ఏర్పాటు చేయడానికి నీకు అద్భుతమైన గురువు మీ నాన్న వున్నాడు. నువ్వు సక్సెస్ ఐతే అప్రయత్నంగా మీ అమ్మ నీ జట్టు అయిపోతుంది. ఇది నా ప్రామిస్. మళ్ళీసారి నీ మ్యాజిక్ చూపించడానికే నువ్వు ఇక్కడికి రావాలి. అప్పుడు వీళ్ళ తిక్క ఠక్కున కుదురుతుంది. అందాకా ఇది సీక్రెట్. సరేనా?”

అర్ధం అయిన ఆర్య ఆనందం పట్టలేక తండ్రి ఒడిలోంచి ఒక్క ఉదుటున లేచి గోపాల్ మెడచుట్టూ చేతులు వేసి థ్యాంక్స్ తాతయ్యా అంటూ బుగ్గమీద గట్టిగా ముద్దు పెట్టింది. మెడచుట్టూ వున్న చేతులు విడదీసి అరిచేతుల్లోముద్దు పెట్టాడు గోపాల్.

“పన్నీరు జల్లావుకదా అదేమిటో తెలుసా?”

తెలీదన్నట్లు తల ఊపింది. “గులాబీ నీటిలో పూల అత్తరు కలిపితే పరిమళ భరిత మౌతుంది. ఆ నీటిని పన్నీరు బుడ్డిలో పోసి జల్లితే పరిమళం పరివ్యాప్తమై చిరుజల్లుగా చల్లగా హాయిగా ఉంటుంది. భాషని మనసు పెట్టి నేర్చుకుంటే భాషా సొగసులోని మాధుర్యం హృదయోల్లాసాన్ని కలిగిస్తుంది. కొంచెం కొంచెం పెద్దవుతున్నకొద్దీ నీకు ఇవన్నీ తెలుస్తాయిరా ఆర్యమ్మా!ఆయుష్మాన్ భవ . విద్యా సరస్వతీ కటాక్ష ప్రాప్తిరస్తు “ఆర్య శిరస్సు మీద చేయి వుంచి ఆశీర్వదించాడు గోపాల్. సజల నయనాలతో గోపాల్ మామయ్యని గాఢంగా కౌగలించుకున్నాడు ఆకాశ్. అక్షరమాలతో సాక్షాత్ వాగ్దేవి కరుణిస్తున్నట్లు ఆర్యని ఎత్తుకుని గుండెలకి హత్తుకుంది విశాలాక్షి.

కవిత

ఉ గా ది

మామిడి చివుళ్ళు తిని
గొంతు సవరించుకుని
కోకిల పిలుస్తోంది
ఉగాదిని రారమ్మని!

కోకిల పాటని విని
కొత్త విత్తులు విత్తుకుని
ఉగాదితో ఆహ్వానిద్దాం
సంవత్సరాదిని!

ఆరు రుచులనూ కలుపుకుని
ఉగాది పచ్చడి చేసుకుని
అందరం గుర్తుచేసుకుందాం
జీవితం సుఖ దుఃఖాల
సమ్మేళనమని!

తోరణాలు కట్టుకుని
పసుపు బొట్టు పెట్టుకుని
ప్రపంచానికి చూపిద్దాం
నిండైన తెలుగుదనాన్ని!

ప్రకృతికి ప్రణమిల్లుకుని
పంచాంగం తెలుసుకుని
పరవశంతో ప్రారంభిద్దాం
కొత్త తెలుగు సంవత్సరాన్ని!

సాంబమూర్తి లండ
9642732008

భాష లేకపోతే భావం లేదు
నీ భావాల్ని నీ భాషలో
చెప్పడమే సరైనది

నూర్ బాషా రహంతుల్లా
6301493266

ఆంధ్రప్రదేశ్‌లో కూడా కొత్త జిల్లాలను ఏర్పాటు చెయ్యాలి

రాష్ట్రాల విభజన లాగానే జిల్లాల విభజనకు కూడా ఒక ప్రామాణిక సూత్రం గానీ, శాస్త్రబద్ధమైన విధానంగానీ, ఒక ప్రాతిపదిగానీ రాజ్యాంగంలో నిర్ణయించలేదు. ప్రాతిపదిక జనాభానా, వైశాల్యమా అనే సూత్రమెక్కడా లేదు.

తెలంగాణలో జిల్లాలు

2016 అక్టోబరులో తెలంగాణాలో ఒక్కసారే 23 కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాయి. జిల్లా కేంద్రం అంటే అభివృద్ధికి కేంద్రం. సాధారణంగా రాజధాని చుట్టూ అభివృద్ధి కేంద్రీకృతం అవుతుంది. 111 ఏళ్ల తరువాత తెలంగాణాలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరిగింది. 1905లో ఆరవ నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ కాలంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరిగింది. తెలంగాణాలో పాలనా వ్యవస్థలో భారీ అధికార వికేంద్రీకరణ జరిగింది. 38 ఏళ్ల తర్వాత 23 కొత్త జిల్లాలతో రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 33కి, రెవెన్యూ డివిజన్లు 68కి, మండలాలు 584కి పెరిగాయి. ఈ జిల్లాల పునర్విభజనను చాలా మంది ఎన్టీఆర్ మండల వ్యవస్థతో పోలుస్తున్నారు. జిల్లాల పరమార్థం అభివృద్ధి వికేంద్రీకరణే. జిల్లా యూనిట్‌గా కేంద్రం నుంచి రావాల్సిన నిధులు పెరిగి, అవి నూతన అభివృద్ధి కేంద్రాలుగా రాణిస్తాయి. కొత్త జిల్లాలతో ప్రజలకు దూరభారాలు, వ్యయ ప్రయాసలు తగ్గి త్వరితంగా పనులు పూర్తి చేసుకో గలుగుతారు. ప్రజలకు ప్రయాణ చార్జీలు తగ్గుతాయి. జిల్లాలసంఖ్య పెరుగుదలతో ఉద్యోగుల సంఖ్య పెంచవలసి వస్తుంది. అది ఉపాధి అవకాశాలు పెంచుతుంది.

వరుస సంఖ్య	జిల్లా	వైశాల్యం	జనాభా	మండలాలు	రెవిన్యూ డివిజన్లు	పార్లమెంటు స్థానాలు	అసెంబ్లీ స్థానాలు
1	అదిలాబాదు	4,153	708,972	18	2	2	7
2	భద్రాద్రి కొత్తగూడెం	7,483	1,069,261	23	2		
3	హైదరాబాదు	217	3,943,323	16	2	2	14
4	జగిత్యాల	2,419	985,417	18	2		
5	జనగామ	2,188	566,376	13	2		
6	జయశంకర్ భూపాలపల్లి	6,175	711,434	20	2		
7	జోగులాంబ గద్వాల	2,928	609,990	12	1		2
8	కామారెడ్డి	3,652	972,625	22	2		7
9	కరీంనగర్	2,128	1,005,711	16	2	1	7
10	ఖమ్మం	4,361	1,401,639	21	2	1	7
11	కొమరం భీమ్ ఆసిఫాబాద్	4,878	515,812	15	2		
12	మహబూబాబాద్	2,877	774,549	16	2	1	7

వరుస సంఖ్య	జిల్లా	వైశాల్యం	జనాభా	మండలాలు	రెవిన్యూ డివిజన్లు	పార్లమెంటు స్థానాలు	అసెంబ్లీ స్థానాలు
13	మహబూబ్ నగర్	5,285	1,486,777	26	2	1	7
14	మంచిర్యాల	4,016	807,037	18	2		7
15	మెదక్	2,786	767,428	20	3	1	7
16	మేడ్చల్- మల్కాజిగిరి	1,084	2,440,073	14	2	1	7
17	నాగర్ కర్నూలు	6,545	893,308	22	3	1	7
18	నారాయణపేట			11	1		
19	ములుగు	3,881	294,671	9	1		
20	నల్గొండ	7,122	1,618,416	31	3	1	6
21	నిర్మల్	3,845	709,418	19	2		
22	నిజామాబాద్	4,288	1,571,022	27	3	1	7
23	పెద్దపల్లి	2,236	795,332	14	2	1	
24	రాజన్న సిరిసిల్ల	2,019	552,037	13	1		
25	రంగారెడ్డి	5,031	2,446,265	27	5		
26	సంగారెడ్డి	4,403	1,527,628	26	3		
27	సిద్దిపేట	3,632	1,012,065	22	3		
28	సూర్యాపేట	3,607	1,099,560	23	2		
29	వికారాబాద్	3,386	927,140	18	2	1	7
30	వనపర్తి	2,152	577,758	14	1		
31	వరంగల్ రూరల్	2,175	718,537	15	2		7
32	వరంగల్ అర్బన్	1,309	1,080,858	11	1	1	
33	యాదగిరి భువనగిరి	3,092	739,448	16	2	1	8
మొత్తం	-	**112,077**	**35,003,674**	**584**	**64**	17	121

ఆంధ్రప్రదేశ్ లో జిల్లాలు

1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది మొదలు ఈ 63 ఏళ్ళ కాలంలో కేవలం రెండే జిల్లాలు కొత్తగా ఏర్పాటయ్యాయి. అవి ప్రకాశం (1970), విజయనగరం (1979) జిల్లాలు. కొత్త జిల్లాల ఏర్పాటు సమస్య మన రాష్ట్రంలో అలా నానుతూనే ఉంది. ప్రజల చేరువకు

ప్రభుత్వం అంటూ కబుర్లు తప్ప కొత్తజిల్లాలు ఏర్పాటు చేసి అధికార యంత్రాంగాన్ని ప్రజలకు చేరువచేయలేదు. కొత్త జిల్లాల ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వాలు ఆనాటి నుండీ అసలు ప్రాధాన్యతే ఇవ్వలేదు. జాతీయ స్థాయిలో జిల్లాల సగటు వైశాల్యం ఈనాడు 4534 ; చ.కి.మీ.లకు తగ్గిపోగా ఆంధ్రప్రదేశ్ ;12323 చ.కి.మీ. తో దేశంలోనే మొదటి స్థానంలో ఉంది.

పరిపాలనను ప్రజల దగ్గరకు తీసుకొనివెళ్ళాలనే ఉద్దేశ్యంతో అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు గారు రాష్ట్రంలోని 315 తాలూకాలను విడగొట్టి, వాటి స్థానంలో 1110 మండలాలను 1985 మే 25న ఏర్పాటు చేశారు. మండలాల మాదిరిగానే కొత్త జిల్లాలు కూడా ఏర్పాటు చేయమని కోరగా మండల వ్యవస్థ కుదురు కోగానే కొత్త జిల్లాల ఏర్పాటుపై దృష్టి సారిస్తామని సచివాలయం నుండి నాకు 21. 9. 1988న జవాబు ఇచ్చారు.

మన రాష్ట్రంలో ఒక్కొక్క పార్లమెంటు సభ్యుడు సగటున 20 లక్షల మందికి ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఒక్కొక్క జిల్లా కలెక్టర్ 38 లక్షల మంది అవసరాలను ఆలకిస్తున్నాడు. దేశంలో సగటున 18 లక్షల జనాభాకు ఒక జిల్లా ఉంది. అరుణాచల ప్రదేశ్‌లో అయితే 86 వేల మంది జనాభాకే ఒక జిల్లా ఉంది. మన రాష్ట్రంలో మాత్రం 38 లక్షల మందికొక జిల్లా ఉంది. అలాగే త్రిపురలో 1311 చ.కి.మీ.లకు ఒక జిల్లా కలెక్టర్ ఉంటే మన రాష్ట్రంలో 12323 చ.కి.మీ ల భూ భాగానికి ఒక కలెక్టర్ ఉన్నాడు. పనులకోసం వచ్చే ప్రజలకు అత్యంత దూరం భారం కలిగించే రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ దేశంలో మొదటి స్థానంలో ఉంది.

మన అనంతపురం జిల్లా వైశాల్యం 19130 చ.కి.మీ. గోవా, త్రిపుర, సిక్కిం, నాగాలాండ్ లాంటి రాష్ట్రాలకంటే మన అనంతపురం జిల్లా పెద్దది. అంతేకాదు మన అనంతపురం జిల్లా మాల్దీవులు, మాల్టా, గ్రెనెడా, ఆండొర్రా, బహ్రెయిన్, బ్రూనే, కేప్ వర్డీ, సైప్రస్, డొమినిక, ఫిజీ, గాంబియా, జమైకా, కువైట్, లెబనాన్, లక్సెంబర్గ్, మారిషస్, పోర్టోరికో, కటార్, సీషెల్స్, సింగపూర్, ఆ్వజీలాండ్, టోంగో, ట్రినిడాడ్ మరియు టుబాగో, వనౌటూలాంటి దేశాల కంటే పెద్దది.

తెలంగాణలో కొత్త జిల్లాల ఏర్పాటు ప్రభావం ఆంధ్రపై కూడా పడింది. తెలంగాణాలో జిల్లాల సంఖ్య పెరిగినప్పటి నుండి ఆంధ్రాలో ప్రజలు మనకెప్పుడు అనే ప్రశ్న అడుగుతున్నారు. ముఖ్యంగా చారిత్రక ప్రాధాన్యత గల విజయవాడ, తిరుపతి, రాజమండ్రిలాంటి పట్టణాలు జిల్లా కేంద్రాలు అవుతాయని పరిసరాల ప్రజలు కోటి ఆశలతో ఉన్నారు. కోస్తా ఆంధ్రలో కొన్ని జిల్లాలకు జిల్లా కేంద్రాలు ఒక మూలన అంచులో ఉంటాయి. బ్రిటీష్ కాలంలో నౌకాశ్రయాలను దృష్టిలో పెట్టుకుని జిల్లా కేంద్రాలను నిర్ణయించారు. ఆంధ్ర రాష్ట్ర పాలన విజయవాడ నుంచి సాగుతోంది. విజయవాడ జిల్లా కేంద్రం కూడా కాదు. ఓడరేవులైన బందరు, కాకినాడ, విశాఖపట్నం లను జిల్లా కేంద్రాలుగా చేశారు. బ్రిటీష్ కాలంనాటి జిల్లాల స్వరూపం అదే విధంగా కొనసాగుతోంది.ఇలాంటి జిల్లాల కేంద్రాలను ఆయా జిల్లాల మధ్య ప్రాంతాలకూ మార్చలేదు. ఆంధ్ర రాష్ట్రంలో కూడా పార్లమెంటు నియోజకవర్గాలన్నిటినీ 25 జిల్లాలుగా మార్చాలని ఎంతోకాలంనుండి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాల సంఖ్య పెరిగితే అధికార వికేంద్రీకరణ జరుగుతుంది.

తెలుగులో పాలనకు దోహదం

ఉభయ రాష్ట్రాల్లో కూడా తెలుగులో పాలనకు కూడా చిన్న జిల్లాలు బాగా దోహద పడతాయి.ఎందుకంటే స్థానికులు ఎక్కడికక్కడ తమ భాషలోనే పాలన జరగాలని నిలదీస్తారు. కలక్టర్లందరూ తెలుగు నేర్చుకొని జవాబులివ్వాల్సి వస్తుంది. చిన్న జిల్లాలలో స్థానికులకు స్థానబలం పెరుగుతుంది. తమ విన్నపాలకు జవాబులు తమకు అర్థమయ్యే విధంగా తమభాషలోనే జవాబులు ఇవ్వమని అధికారులను అడిగి మరీ సాధించుకుంటారు. ఉర్దూ కూడా కొంతమేర బాగుపడుతుంది.

ఒక్క రాజధాని నగరాన్ని మాత్రమే బాగా అభివృద్ధి చేసి, అక్కడే విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను విస్తృతంగా సృష్టించి, ప్రజలందరినీ అక్కడికే ఆకర్షించే కేంద్రీకృత విపరీత పారిశ్రామికీకరణ వల్ల కాలుష్యం, ట్రాఫిక్, వనరుల కొరతతో పాటు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురవుతాయి.కొత్తజిల్లాల స్థాపన వల్ల అభివృద్ధి వికేంద్రీకరణ సాధ్యమవుతుంది. జిల్లా కేంద్రాలను , విద్యా సంస్థలను, పారిశ్రామిక యూనిట్లను, వ్యాపార సంస్థలను వేర్వేరు పట్టణాలకు కేటాయించాలి. జిల్లా కేంద్రాల ప్రాంతాల్లో ఊహించని ఆర్థికాభివృద్ధికి పునాదులు పడతాయి. అభివృద్ధి జిల్లా కేంద్రాల వెంట పరుగులు తీస్తుంది.

రాష్ట్రంలో 3 కోట్ల జనాభా ఉన్న సమయంలో ఏర్పడిన జిల్లాలే తప్ప ఇంత వరకూ కొత్త జిల్లాలంటూ లేవు.ప్రస్తుత జనాభా 5 కోట్లకు చేరిన నేపథ్యంలో, పరిపాలనా సౌలభ్యం కోసం మరికొన్ని కొత్త జిల్లాలు ఏర్పడాలి. ప్రతి పార్లమెంటు నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా ఏర్పాటుచేస్తామని వైసీపీ నాయకుడు జగన్ కూడా ప్రకటించారు. కొత్త జిల్లాల ఏర్పాటు ద్వారా పరిపాలన వేగవంతంగా జరుగుతుంది. ప్రతి చిన్న అంశానికి రాజధానికి వెళ్లనక్కర లేకుండా మూడు ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజల్లో ప్రభుత్వం తమకు దగ్గరగా ఉందనే భావన పెరుగుతుంది. **ప్రతి పార్లమెంటు నియోజక వర్గానికి ఒక జిల్లా వల్ల జిల్లాలలో వాణిజ్యం పెరగడంతో పాటు, భూముల విలువ పెరుగుతాయి, దానివల్ల ఖజానాకు ఆదాయం కూడా సమకూరుతుంది. రాజకీయంగా ఎక్కువ మంది స్థానిక నాయకులకు అవకాశం ఇచ్చినట్టవుతుంది.మంత్రి పదవులతో పాటు, జడ్పీ చైర్మన్లు, డీసీసీబీ చైర్మన్లు, ఇంకా జిల్లా స్థాయిలో పదవులు వస్తాయి.**

ఆంధ్రప్రదేశ్ లో జిల్లాలు

వరుస సంఖ్య	జిల్లా	రెవిన్యూ డివిజన్లు	మండలాలు	జనాభా	వైశాల్యం	పార్లమెంటు స్థానాలు	అసెంబ్లీ స్థానాలు
1	అనంతపురం	5	63	4,083,315	19,130	2	14
2	చిత్తూరు	3	66	4,170,468	15,152	2	14
3	తూర్పు గోదావరి	7	64	5,151,549	10,807	3	19
4	గుంటూరు	4	57	4,889,230	11,391	3	17
5	కడప	3	50	2,884,524	15,359	1	10
6	కృష్ణా	4	50	4,529,009	8,727	2	16
7	కర్నూలు	3	54	4,046,601	17,658	2	14
8	నెల్లూరు	5	56	2,966,082	13,076	1	10
9	ప్రకాశం	3	56	3,392,764	17,626	1	12
10	శ్రీకాకుళం	3	37	2,699,471	5,837	1	10
11	విశాఖపట్నం	4	46	4,288,113	11,161	2	15
12	విజయనగరం	2	34	2,342,868	6,539	3	9
13	పశ్చిమ గోదావరి	4	46	3,934,782	7,742	2	15
	మొత్తం	50	679	49,378,776	160,205	25	175

జిల్లా కేంద్రాలుగా మారవలసిన 12 పార్లమెంటు నియోజకవర్గాలు :

1. అరకు, 2. బాపట్ల, 3. అనకాపల్లి, 4. అమలాపురం, 5. హిందూపురం, 6. నంద్యాల, 7. నరసాపురం, 8. నరసరావుపేట, 9. రాజమండ్రి, 10. రాజంపేట, 11. తిరుపతి, 12. విజయవాడ.

నిర్ణయించుకోవలసింది రాష్ట్ర పాలక వర్గమే.

కొత్త జిల్లాల ఏర్పాటు అనేది రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో చేసే పనే.దానిపై నిర్ణయం తీసుకోవాల్సింది రాష్ట్ర కేబినెట్ మాత్రమే.రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచీ వేర్వేరు ప్రాంతాల ప్రజలు కొత్త జిల్లాల ఏర్పాటు కోసం పట్టుబడుతున్నప్పటికీ ఒక్క కొత్త జిల్లా కూడా ఏర్పాటు కాలేదు. కొత్త జిల్లాలు ఏర్పాటు చేసిన పక్షంలో పాలనా భవనాలు లాంటి మౌలిక సదుపాయల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం పెట్టే ఖర్చు ఒక్కసారి చేసే పెట్టుబడి మాత్రమే. కానీ దీనివల్ల అటు ప్రభుత్వం, ఇటు ప్రజలు పొందే శాశ్వత ప్రయోజనాలు చాలా ఉంటాయి. చిన్న జిల్లాలు పరిపాలనను సులభ సాధ్యం చేస్తాయి.

ప్రజలకు దూరం భారం తగ్గుతాయి

మనది తీరప్రాంత రాష్ట్రం. తరచుగా తుఫాను తాకిడికి, వరదలకు గురయ్యే కోస్తా ప్రాంతంలో చిన్న జిల్లాల ఏర్పాటు వల్ల సహాయ కార్యక్రమాలు చురుకుగా అమలు జరుగుతాయి. నదులు, కాలువలు, వాగులు దాటి జిల్లా కేంద్రాలకు చేరుకోవలసిన పల్లె ప్రజలకు కొత్త జిల్లాల ఏర్పాటు వల్ల దూరం భారం తగ్గుతాయి. జిల్లా కేంద్రాలు గ్రామాలకు దూరంగా ఏదో ఒక మూలన ఉండటం వల్ల ప్రజలు చాలా యాతన పడుతున్నారు. రాష్ట్రంలో కొన్ని జిల్లాలను చూసినప్పుడు అవి దేశంలో కొన్ని రాష్ట్రాల కన్నా పెద్దవిగా ఉన్నాయి. ఇది పాలనాపరమైన అనేక సమస్యలకు దారి తీస్తోంది. బ్రిటీష్ పాలకులు కొన్ని జిల్లా కేంద్రాలను సముద్ర తీరంలో ఒక అంచున ఏర్పాటు చేశారు.వాటిని ఇంతవరకు ఆయా జిల్లాల నడిమధ్యకు కూడా తేలేదు.కలక్టర్ ను కలిసి రావటానికి ఎంతో దూరం ప్రయాణించాల్సి

వస్తున్నదని ఆ జిల్లాల ప్రజలు బాధపడుతున్నారు.

అందరికీ భవనాలు – సరిపడినంత పని

చిన్న జిల్లాల ఏర్పాటు తప్పనిసరి అవసరం. ప్రభుత్వం ప్రస్తుతానికి తప్పించుకోవచ్చు కానీ రేపైనా వాటిని ఏర్పాటు చేయక తప్పదు! అధికార వికేంద్రీకరణ అనేది ఒక అందమైన నినాదంగా మిగిలిపోయింది. అధికారం అంతా ఒక్కచోటే ఉండకూడదు. అన్ని జిల్లాలకూ పలచగా పంచాలి. భూమిశిస్తు కమిషనర్ కు కలెక్టర్లకు మధ్య ప్రాంతీయ అధికారులు ఉండాలి. డిప్యూటీ కలెక్టర్లకు అధికారాలు పెంచాలి ప్రతిజోన్ లోను ల్యాండ్ రెవిన్యూ జోనల్ కమీషనర్లు ఉండాలి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా జిల్లాలు,రెవిన్యూ డివిజన్ల సంఖ్య పెంచాలి. ప్రజలకు అధికారుల్ని చేరువచేయాలి.

గ్రామ సర్పంచ్ లకు మండలాధ్యక్షులకూ ఆఫీసు భవనాలు ఉన్నాయి గానీ కేంద్ర ప్రభుత్వ సెక్రెటరీ హోదా కలిగిన ఎంపీలకూ,కలక్టర్ స్థాయి జీతంవచ్చే ఎమ్మెల్యేలకు సొంత ఆఫీసు భవనాలు లేవు. జిల్లా పరిషత్ ఛైర్మన్ – సీఈఓ, మండలాక్షుడు – ఎంపీడీఓ ఒకే భవనం లో కూర్చుంటున్నారు. అలాగే ప్రతి ఎంపీకి ఒక కలెక్టరు,ప్రతి ఎమ్మెల్యేకి ఒక డిప్యూటీ కలెక్టర్‌ను అనుసంధానం చేసి ఆయా భవనాలలో కూర్చోబెడితే మన రాష్ట్రంలోజిల్లాలు 13 నుండి 25 కు, డివిజన్లు 50 నుండి 125 కు పెరిగి ప్రజలకు పాలన మరింత దగ్గరౌతుంది. ఆమేరకు శాశ్వతభవనాలూ, మౌలికఆస్తులూ, సౌకర్యాలు ఎక్కువ ప్రాంతాలకు వికేంద్రీకరించబడతాయి.కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రతి జిల్లాలోనూ ఒక భారీ పరిశ్రమ ఏర్పడి స్థానికులకు ఉపాధి దొరుకుతుంది.రాష్ట్రంలో ఇప్పుడు 246 మంది డిప్యూటీ కలక్టర్లు, 33 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలక్టర్లు మొత్తం 279 మంది ఉన్నారు. అయితే ఇంతమందిలో 50 ఆర్.డి.వో.లు,50 డి.ఆర్.వో.లు,50 అడిషనల్ జాయింట్ కలక్టర్లు (మొత్తం 150 మంది) తప్ప మిగిలిన 129 మంది స్పెషల్ పోస్టుల్లో ఉంటున్నారు.వీళ్ళందరినీ పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావచ్చు. ఏ అధికారీ ఖాళీగా ఉండనక్కరలేదు. స్పెషల్ పోస్టుల అవసరం ఉండదు. అందరికీ సరిపడినంత పని ఉంటుంది.

సులభపాలనకు చిన్న జిల్లాలు

పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా, చిన్న జిల్లాల ఆవశ్యకత ఎంతైనా ఉంది. మారుమూల గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి బస్సులో వెళ్ళి అదే రోజు ఇంటికి చేరుకోలేనంత పెద్ద జిల్లాలున్నాయి.పెద్ద జిల్లాలలో పనుల వత్తిడి ఎక్కువై జాప్యం జరుగుతోంది.ప్రజలకు దూరం భారం ఎక్కువయ్యాయి. చాలా సమయం ప్రయాణాలకే వెచ్చించాల్సి వస్తోంది. ప్రతి పనికీ దూరంగా ఉన్న రాజధానికి పరిగెత్తుకు రావలసిన అవసరమూ తప్పుతుంది. తాలూకాలను మండలాలుగా విడగొట్టినందువలన ప్రజలకు పాలనా యంత్రాంగం దగ్గరయ్యింది.ఇప్పుడు మండలాలు తీసేసి మళ్ళీ తాలూకాలనే పెట్టమని ఎవరూ అడగరు. చిన్న జిల్లాల ఏర్పాటు వలన అధికారులందరికీ పని సమానంగా పంచబడుతుంది.తీవ్ర పని భారం తగ్గి ప్రజలకు పనులు త్వరగా జరుగుతాయి. కొత్త జిల్లాల ఏర్పాటుకు అన్ని పార్టీలు చొరవ తీసుకోవాలి. జిల్లాల విభజన శాస్త్రీయంగా ఎంపీ నియోజకవర్గాలతో సమానంగా జరిగితే వాటి మధ్య అసమానతలు అంతమౌతాయి.రెంటికీ ఏకరూపత, సారూప్యత, అధికార పరిధుల్లో స్పష్టత సిద్ధిస్తుంది. అన్ని ప్రాంతాలలో అభివృద్ధి సమంగా జరుగుతుంది.పెద్ద తాలూకాలు చిన్న మండలాలుగా మారినట్లే పెద్ద జిల్లాలు చిన్న జిల్లాలుగా మారడం ఒక చారిత్రక ప్రజా అవసరం.

(...19 వ పుట తరువాయి)

అనిపించవచ్చు.

తెలుగు భాష కూడా అంతే. సంస్కృతం-ప్రాకృతం లాంటి ప్రాచీన భాషల నుండి, మరాఠీ, ఉర్దూ, హిందీ లాంటి ఆధునిక భాషల నుండి ఎన్ని పదాలను చేర్చుకున్నా తెలుగు ఆర్య భాష అయిపోదు. శరీర భాగాలకున్న పేరులు, ప్రాంతీయ జంతువులు, చెట్లు, మౌలిక క్రియలు, పనులు, బంధుత్వాల పేర్లు, కింది స్థాయి అంకెలు, లాంటి మౌలిక భాషా పదాలను ఈ పరభాషా పదాలు వచ్చి మార్చివేయలేదు. ఆ పదాలకు మూలం మూల ద్రావిడ భాష పదాలని మనకి తెలుస్తున్నది. పై పదాలేవీ సంస్కృతం వలన మారిపోలేదు. సంస్కృతం నుండి వచ్చి చేరిన పదాలన్ని కూడా స్థూల స్థాయిలో సాంకేతిక పదజాలం కోసమో, వ్యాకరణ పరంగానో, తాత్విక పరంగానో వచ్చి చేరాయి.

సాధారణంగా భాషాశాస్త్రజ్ఞులు ఒక భాష ఏ భాషా పరివారానికి చెందుతుందోనన్న విషయాన్ని నిర్ణయిస్తారు. అందుకు వారు ఆ భాషని క్షుణ్ణంగా పరిశీలిస్తారు:

మొదటగా, ఆ భాషలోని ప్రతి పదానికి వ్యుత్పత్తి చూపించగలగాలి. ఈ ఒక్క కారణం చాలు తెలుగులోని ఫలానా పదం సంస్కృతంలోని పదం కాబట్టి తెలుగు సంస్కృతజనితం అనే నిర్ధారణకి రాకుండా ఉండటానికి. పైగా, ప్రతి పదానికి పలు భాషల్లో ఉన్న సమీప పదాలను పరిశీలించాలి.

అన్నిటికన్నా సులువైన విధానం, మోరిస్ స్వదేశ్ లో ఇచ్చిన 100, 200, 500 పదాల మౌలిక పదనిధిని తీసుకొని ఆ భాషలోని పదాలతో వాటిని పోల్చి చూసుకుంటే, ఆ భాషా ఏ భాషా కుటుంబానికి చెందినదో చెప్పగలుగుతాము. వందల భాషల మీద, భాషా పరివారాల మీద ఈ పదాల జాబితా ప్రయోగించబడి, నిర్దుష్టమైన ఫలితాన్ని ఇచ్చాయి.

ధూపం అభిమన్యుడు
94904 83744

తెలుగువారి ఉగాదే ప్రపంచానికి యుగాదా...

ఉగాది అంటే తెలుగువారి సంవత్సరాది...ఈ ఉగాదినే చాలా ప్రాంతాల ప్రజలు సంవత్సరాదిగా భావిస్తారు...

యుగాది అనే పదమే మన ఉగాది అయింది...అంటే యుగాలు ప్రారంభమైంది ఈ రోజేనా...? అసలు యుగాలు అనే కాల గణన ఎప్పుడు మొదలైంది...? అసలు కాలాన్ని లెక్క వేసినవారు తెలుగువారేనా...? ఇందులో శాస్త్రీయత వుందా...?

'తాతాజీ' తాపీ ధర్మారావుగారు అంటారు – దేవాలయాలపై బూతు బొమ్మలెందుకు అనే పుస్తకంలో...ప్రపంచవ్యాప్తంగా వారానికి ఏడు రోజులే ఎందుకున్నాయి? ఆ ఏడు రోజులకు అంతటా అవే పేర్లే ఎందుకున్నాయి? అని...

కాలాన్ని విభజించి...దాన్ని ఒక క్రమపద్ధతిలో లెక్కించిన వారు భారతీయులు. అందులో ఎవరికీ ఎటువంటీ సందేహం అక్కర లేదు...కానీ ఆ భారతీయులు ఎక్కడి ప్రజలు? వారు తెలుగువారే అంటాను నేను. ఎందుకంటే...భూగోళంపై తొలి నాగరీకులు తెలుగువారే అనే నా భావనకు సమర్థనే ఈ వ్యాసం...

ప్రపంచమంతటా వారానికి ఏడు రోజులే వున్నాయి. సంవత్సరానికి 12 నెలలే వున్నాయి. వీటిని ఎందుకు మనం మార్చకూడదు. ఎందుకు వాటిని అలాగే కొనసాగనివ్వాలి?

వారంలో ఏడు రోజులేంటి?! 10 రోజులుంటే చక్కగా వుంటుందిగా. తప్పు అలా వుండకూడదు. గ్రహాల గమనం ఆధారంగా రోజులకు పేర్లు పెట్టారు కాబట్టి వాటిని అలాగే వుంచాలి అంటారా? మరి అలాంటప్పుడు గ్రహాలు తొమ్మిది వున్నప్పుడు వారానికి తొమ్మిది రోజులు ఎందుకు పెట్టలేదు? ఆదివారం నుండి శనివారం వరకు పేర్లు పెట్టి రాహువు, కేతువు అనే రెండు గ్రహాలకు అన్యాయం చేశారుగా...

ఇక్కడే మన ప్రాచీన ఋషుల విద్వత్తు అద్భుతంగా గోచరిస్తుంది...గణిత శాస్త్రాన్ని ఔపోసన పట్టిన గొప్ప మేథావులు ఈ కాలాన్ని లెక్కించారు. మరి వారు కాలాన్ని లెక్కించడానికి ఎలాంటి పరికరాలను వాడారు అన్న చర్చ ఇక్కడ అప్రస్తుతం కాబట్టి దాన్ని అలా ప్రక్కకు పెడదాం.

కాలాన్ని ఎలా అతి చిన్న భాగాలుగా విభజించారో చూద్దాం. భూమి తన చుట్టూ తాను ఒక్కసారి తిరగడానికి పట్టే సమయం ఎంత? ఒక పగలు, ఒక రాత్రి...అంటే సూర్యుడు కనిపించినప్పటి నుండి మళ్లీ మరుసటి రోజు సూర్యుడు కనిపించే సమయం వరకు ఒక రోజు అంటే భూమికి ఒక ఆత్మ ప్రదక్షిణ. అంటే భూగోళంలో సూర్యుడినే గుర్తుగా ఎంచుకున్నారన్న మాట. సూర్యోదయం నుండి మరుసటి రోజు సూర్యోదయ కాలం వరకు సూర్యుడు కనిపించే ప్రాంతం మొత్తం 360 డిగ్రీలుగానే మన ప్రాచీన ఋషులు భావించారు. దానిని దృష్టిలో వుంచుకునే ఒక డిగ్రీ భూమి తిరిగే సమయాన్ని 10 విఘడియలుగా లెక్కించారు. అంటే నేటి మన లెక్కలో సుమారు నాలుగు నిముషాలు. అలా ప్రతి డిగ్రీ తిరగడానికి పట్టే సమయాన్ని హోర అని అంటారు. ఈ హోర అనే పదమే నేటి హవర్ అనే ఆంగ్ల పదానికి మూలం. ఇలా ప్రతి నాలుగు నిముషాల హోరను లెక్కించడానికి సులభంగా ఉండేందుకు గాను ప్రతి హోరాకు ఒక గ్రహం పేరు పెట్టారు. వీటికి వరుస క్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ వరుస క్రమం ఎలా వుంటుందంటే రవి, శుక్ర, బుధ, చంద్ర, శని, గురు, కుజ అనే క్రమంలో వుంటుంది.

ఒక గంటలో 15 హోరలు వుంటాయి. ఉదాహరణకు ఆదివారం రోజు సూర్యోదయం రవి హోరలో జరుగుతుంది. కనుక ఆ రోజు రవి వారం లేదా ఆదిత్యుని వారం కాబట్టి ఆదివారం అంటారు. 360 డిగ్రీలలో భూమి ఒక డిగ్రీ తిరగడానికి పట్టేకాలం నాలుగు నిముషాలు అంటే ప్రతి నాలుగు నిముషాలకు ఒక డిగ్రీ వంతున భూమి ఆత్మ ప్రదక్షిణ చేస్తుంది. అలా రవి హోరలో ఆదివారం ప్రారంభమై మరుసటి రోజు సూర్యోదయ సమయానికి చంద్ర హోర వుంటుంది కనుక ఆ రోజును సోమవారంగా పిలిచారు. అలాగే కుజుడు వుంటే మంగళవారం, బుధ హోరలో బుధవారం, గురు, శుక్ర, శని వారాలు వరుసగా వస్తాయి. శనివారం పగలు రాత్రి పూర్తయి ఆదివారం మొదలయ్యే సమయానికి మళ్లీ రవి హోర ఖచ్చితంగా వస్తుంది.

ఇలా వారానికి ఏడు రోజులే రావడానికి కారణం ఒక ఆవృతం పూర్తయ్యే సరికి మళ్లీ అదే ఆవృతం మొదలు కావడం ఒక్క ఏడు అంకె వల్ల మాత్రమే సాధ్యం. సంఖ్యాశాస్త్ర రీత్యా ఏ అంకెకు కూడా ఇలాంటి ప్రాధాన్యత లేదు. అందుకే భారతీయులు జ్యోతిశాస్త్రంలో కూడా

13--16	చం	శ	గు	కు	ర	శు	బు	చం	శ	గు	కు	ర	శు	బు	చం	శ
17--20	శ	గు	కు	ర	శు	బు	చం	శ	గు	కు	ర	శు	బు	చం	శ	గు
21–24	గు	కు	ర	శు	బు	చం	శ	గు	కు	ర	శు	బు	చం	శ	గు	కు
25--28	కు	ర	శు	బు	చం	శ	గు	కు	ర	శు	బు	చం	శ	గు	కు	ర
29--32	ర	శు	బు	చం	శ	గు	కు	ర	శు	బు	చం	శ	గు	కు	ర	శు
33--36	శు	బు	చం	శ	గు	కు	ర	శు	బు	చం	శ	గు	కు	ర	శు	బు
37--40	బు	చం	శ	గు	కు	ర	శు	బు	చం	శ	గు	కు	ర	శు	బు	చం
41–44	చం	శ	గు	కు	ర	శు	బు	చం	శ	గు	కు	ర	శు	బు	చం	శ
45--48	శ	గు	కు	ర	శు	బు	చం	శ	గు	కు	ర	శు	బు	చం	శ	గు
49--52	గు	కు	ర	శు	బు	చం	శ	గు	కు	ర	శు	బు	చం	శ	గు	కు
53--56	కు	ర	శు	బు	చం	శ	గు	కు	ర	శు	బు	చం	శ	గు	కు	ర
57--60	ర	శు	బు	చం	శ	గు	కు	ర	శు	బు	చం	శ	గు	కు	ర	శు

గు	కు	ర	శు	బు	చం	శ	గు
కు	ర	శు	బు	చం	శ	గు	కు
ర	శు	బు	చం	శ	గు	కు	ర
శు	బు	చం	శ	గు	కు	ర	శు
బు	చం	శ	గు	కు	ర	శు	బు
చం	శ	గు	కు	ర	శు	బు	చం
శ	గు	కు	ర	శు	బు	చం	శ
గు	కు	ర	శు	బు	చం	శ	గు
కు	ర	శు	బు	చం	శ	గు	కు
ర	శు	బు	చం	శ	గు	కు	ర
శు	బు	చం	శ	గు	కు	ర	శు
బు	చం	శ	గు	కు	ర	శు	బు

ఏడు ప్రధాన గ్రహాలుగా మరో రెండు ఛాయాగ్రహాలుగా పరిగణించారు.

ఇక్కడ వున్న హోరా చక్రాలను గమనించండి.

(హోరా చక్రాలు)

ఒక గంట కాలంలో 15 హోరలు వుండడం గమనించండి, అలాగే ప్రతి గంటకూ హోర ఖచ్చితంగా వుండడం కూడా గమనించండి. సంఖ్యా శాస్త్రం పై ఎంతో పట్టు వుంటే కాని ఇలాంటి కాల విభజన చేయడం కుదరదు. మన ప్రాచీన ఋషుల మేధో సంపత్తి నేటి ఆధునికులకు అంతుబట్టని ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

నిజానికి రోజు అంటే ఒక పగలు, ఒక రాత్రి. సూర్యోదయం నుండి మళ్ళీ సూర్యోదయం వరకు వుండే కాలాన్ని మాత్రమే రోజు అనాలి. **ఇప్పుడు మనం పాటిస్తున్నట్లు అర్థరాత్రి రోజు మొదలు కావడం పూర్తిగా అశాస్త్రీయం)**

ఇవన్నీ సరే. ఇది తెలుగు వాళ్లే నిర్ణయించారనడానికి ఆధారమేంటీ?! ఇదేగా మీ ప్రశ్న! అక్కడికే వస్తున్నా...ప్రపంచ వ్యాప్తంగా అతి కొద్ది మంది ప్రజలు మాత్రమే వారి కేలండర్‌ల నిర్మాణానికి చాంద్రమానాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నారు. అలాంటి వారిలో మొదటి వారు తెలుగువారు. చైత్ర శుక్ల పాడ్యమిని మాత్రమే సంవత్సరాదిగా మనం పరిగణిస్తాం. డిశంబర్, జనవరి నెలల్లో చెట్లు ఆకులు రాల్చడం మొదలవుతుంది. ఉగాది సమయానికి ప్రతి చెట్టూ ఆకులను చిగురిస్తుంది. పుట్టడం మొదలు...రాలిపోవడం చివర? ఇదేగా వాస్తవం. మరి అలాంటప్పుడు ఆకులు రాలిపోయే కాలం మొదటిదెలా అవుతుంది????

సూర్యమానంలో కేవలం కాలాన్ని మాత్రమే గణించగలం కానీ చాంద్రమానంలో మొత్తం విశ్వంలో మన స్థానాన్ని గుర్తించగలం. ఎందుకంటే తెలుగువారు ఉగాదినాడు ఖచ్చితంగా పంచాంగ శ్రవణం చేస్తారు. పంచాంగం అంటే తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం. ఈ ఐదు అంగాలు కలిగినది కాబట్టే దానిని పంచాంగం అంటున్నాం. తిథి అంటే చంద్రుని కళలకు సంబంధించినది. వారం అంటే ఆ రోజు పేరు; నక్షత్రం ఆ రోజు చంద్రుడితో కలసి వున్న నక్షత్రం; యోగం అంటే నిర్ణీత స్థానం నుండి చంద్రుడూ, సూర్యుడూ కదిలే దూరం; కరణం అంటే సగం తిథి.

ఇవన్నీ కూడా చంద్రుడికి సంబంధించినవి కనుకనే తెలుగు వారి కాలగణనను చాంద్రమానం అన్నారు. "యుగాది" అనే పదాన్ని తెలుగువారు ఉచ్చారణలో "ఉగాది" అని పలుకుతారు. యకారాది పదాల వాడకం తెలుగు సాంప్రదాయంలో కనిపించదు. కనుక యుగాది అనే పదాన్నే మనం ఉగాది అని పలుకుతున్నాం.

మన పూర్వీకులు వసంత విషువత్తు నుండే కాలం లెక్క కట్టడం ప్రారంభించారు. ఎందుకంటే విషువత్తులు పగలు, రాత్రి సమానంగా వుండే రోజులు కావడమే దీనికి కారణం. విషువత్తు తరువాత వచ్చే చంద్రోదయమే సంవత్సరాది.

ఈ సంగతులు అన్నీ అందరికీ తెలిసినవేలే, కానీ నీవు చెప్పేదేంటీ అంటారా...

కాలాన్ని ఖచ్చితంగా గణించడం అంటే అపారమైన గణితశాస్త్ర ప్రావీణ్యంతో, పాటు ఖగోళాన్ని నిశితంగా పరిశీలించడం, గ్రహాలనూ, నక్షత్ర గమనాలను నిశితంగా గమనించడం జరగాలి. ఇవన్నీ జరగడానికి కొన్ని వందల ఏళ్లు పట్టి వుండవచ్చు. కృతయుగ ఆది నుండీ లెక్కలు ఖచ్చితంగా కట్టినట్లు మన పురాణాలు చెబుతున్నాయి. ఇప్పటి వరకూ ప్రపంచంలో వున్న కేలండర్లేవీ తెలుగువారి పంచాంగం అంత వివరంగా, ఖచ్చితంగా వుండవు. **యూరోపియన్ల కేలండర్లు కేవలం రోజులను, నెలలను, సంవత్సరాలను మాత్రమే తెలిపితే, తెలుగువారి పంచాంగం విశ్వ సమాచారాన్ని మానవులకు అందిస్తోంది.**

చివరగా నా వాదన ఏమిటంటే – జల ప్రళయం తరువాత నివశించిన ప్రాంతం కర్నూలు జిల్లాలోని కేతవరం ప్రాంతమే అయి వుండాలి.


గత సంస్కృతులకు వారసులైనవారే జల ప్రళయం తరువాత తొలి మానవులయ్యారు. వారే గత నాగరికత సంస్కృతుల జ్ఞాన సంపదను ఈ తరాలకు అందించారు. అందువల్లనే తెలుగువారి పంచాంగం ప్రపంచానికి కాల గణనను నేర్పింది. ఇక్కడి నుండే వివిధ ప్రాంతాలకు వలసలు వెళ్ళిన ప్రజలు ఈ వారసత్వ సంపదను ఆయా ప్రాంతాలకు తీసుకు వెళ్ళారు. మెసపొటేమియన్లు నేటికీ మన కేలండరే వాడడం వంటి అంశాలు– ఈ వాదనకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

ఈ వ్యాసంపై పాఠకుల స్పందనను కోరుతున్నాము – సం.

పొరుగు తెలుగు

కన్నడతోటలో విరిసిన తెలుగుపాట

బుర్రకథ ఈరమ్మ-సంచారి ఆత్మకథ



కన్నడ మూలం
డా. నింగప్ప ముదేనూరు

అనువాదం
రంగనాథ రామచంద్రరావు

(మార్చి సంచిక తరువాయి...)

తన కావ్య లోకంలోకి...

"నాకు చాలా ఇష్టమైన కావ్యమంటే బాలనాగమ్మదే. ఎందుకంటే ఇది ఆడకూతురి కథ. ఇక్కడ మగవాడి కథ వేరు. ఆడదాని కథేవేరు. మగవాడి కథంటే అక్కడ మగవాళ్లు యుద్ధం చేయటం గురించే ఉంటుంది. ఇక్కడ ఆడదాని కథ అంటే అందులో ఆడదాని బాధలు, దుఃఖాలు కూడుకుని ఉంటాయి" అని ఈరమ్మ తనదే అయిన స్పష్టమైన అభిప్రాయం చెబుతుంది.

'ఇతర కళాకారులు – ఉదాహరణకు జుంజప్ప, మైలారలింగ, మంటేస్వామి, మాదేశ్వరుని కావ్యాలు గానం చేసే గాయకులు నీకు తెలుసా?' అని ఈరమ్మను అడిగితే 'లేదప్పా, సరస్వతి మీదొట్టు. నేను వినలేదు. అబద్ధం ఎందుకు చెప్పాలి. నేను చేయాల్సిన సాధనే నాకు ఎక్కువగా ఉంది' అని అంటుంది. 'నువ్వు కథలు చెప్పటానికి ఎన్ని ఊళ్లు తిరిగావు? నువ్వు కథ చెప్పే ఊళ్లకు ఇతర ఊర్ల కళాకారులు వచ్చేవారా? లేదా నువ్వు కథ చెప్పిపోయిన తరువాత ఆ ఊరికి ఎవరైనా కథ చెప్పటానికి వచ్చారా?' అని అడిగితే 'వస్తారు. అయితే వాళ్లు తెలుగులో కథ చెప్తారు. వాళ్లకు కన్నడ రాదు. మా పల్లెలోని జనం వాళ్లను అంతగా పట్టించుకోరు. మీకు నా పట్ల అభిమానం ఎలా ఉందో, అదే విధంగా ప్రజలకు నా పట్ల అభిమానం ఉంది' అని అడిగిన ప్రశ్నకు అమాయకంగా జవాబు ఇస్తుంది.

ఈ ప్రాంతంలో ఏ పల్లెకు వెళ్ళినా ఈరమ్మ పేరే వినిపిస్తుంది.

చిన్న పిల్లల నోటి నుండి కూడా 'ఈరమ్మ రావాలి, కథ చెప్పాలి. మేము వినాలి' అంటారు.

'వారికి నా కథలు వినటం ఇష్టం. నాకూ కథలు చెప్పటం ఇష్టం. వాళ్ళకు నా పట్ల అభిమానం. ప్రజల అభిమానం తప్ప నాకు ఇంకేమి కావాలి? జీవితంలో అంతా చూశాను. రెండు రోజులు వెలుతురు ఉంటే రెండు రోజులు చీకటి. అంతా అనుభవించాలి. కష్టసుఖాలు ఎవరినీ వదల్లేదు. ఈ ప్రజలకు నా పట్ల చాలా విశ్వాసం' అని ఈరమ్మ అంటుంది.

ఈరమ్మకు వయస్సు మీరింది. రామన్న అనే వేషగాడు ఈరమ్మ గురించి మాట్లాడుతూ, 'ఆది దేవుని శక్తో ఏమిటో.... మాకు ఆమె చెప్పే కథలోని ఒక పంక్తి కూడా చెప్పటానికి కూడా రాదు. మా నాలుకను కాల్చినా వాటిని పలకలేము. మేము నేర్చుకోవాలని ఎన్నో ప్రయత్నాలు చేశాం. అయినా సాధ్యం కాలేదు' అని అంటాడు. రామన్న చెప్పింది ఏ మాత్రం కల్పితం కాదు. నూటికి నూరుపాళ్లు నిజం. ఈరమ్మ జ్ఞాపక శక్తి ఎలాంటిదంటే బాలనాగమ్మ కథ చెబుతున్నప్పుడు బొబ్బిలి నాగిరెడ్డి కథ చెప్పమ్మా అని అడిగితే వెంటనే ఆ కథను మొదలుపెడుతుంది. అది ఆమె గొప్పదనం. ఇలా ఒక కథ నుంచి మరో కథకు ఎగిరే మౌఖిక పక్షిలా ఆమె జీవితం సాగిపోతోంది.

అక్షరాలు నేర్చుకున్న మనలాంటివాళ్లు పొరబాటున మళ్లీ అక్షరాలను గుర్తుచేసుకున్నట్టు ఈరమ్మ ఎప్పుడూ కథలను జ్ఞాపకం చేసుకోదు. చేతిలో తంబూర తీసుకుంటేచాలు... జలజలమని ప్రవహించే జీవనదిలా ఆమె నోటి నుంచి కావ్యం ప్రవహిస్తుంది. ఒకసారి కావ్యగానం మొదలుపెడితే ఒక 'సంధు' వచ్చేవరకూ ఆపదు. ఒక 'సంధు' అంటే జానపద గీతంలా, సినీ గీతంలా అయిదుపది నిముషాల లెక్క కాదు. అది గంటల లెక్క కూడా కాదు. బాలనగమ్మలాంటి కావ్యకథలకు ఒక 'సంధు' రావాలంటే కనీసం ఒక రోజు సమయం పడుతుంది. అందువల్ల ఇలాంటి కావ్యం పూర్తి కావాలంటే నాలుగైదు రోజులు కావాలి. అలా రోజుల తరబడి కథ చెప్పే శక్తి ఈరమ్మకు ఉంది. మనం ఊహించలేని స్థాయిలో ఇలాంటి వారు నిలబడుతారు. ఈరమ్మ మనలాంటి వారితో మాట్లాడటం తక్కువే. ఆమె తన అంతరంగంలోని విషయాలు బయటికి చెప్పుకోదు. ఆమె బాధలు గుండెలోనే దాచుకుంది. ఎంతో బలవంతం చేస్తే నాలుగు మాటలు మాట్లాడుతుంది. అదికూడా ఆమె పాటల గురించే మాట్లాడుతుంది. ఆమె జీవితాన్ని కథలా అవగాహన చేసుకుని ముందుకుసాగగలదు. ఇదే ఆమె అలవరుచుకుంటూ వస్తున్న జీవితపు గుట్టు.




కన్నడ రచయిత
డా. నింగప్ప ముదేనూరు

అనువాదకుడు
రంగనాథ రామచంద్రరావు

ఈ జీవితపు గుట్టులను శ్రమతో వెదికి తెచ్చినవారు అనేకులు.

అటు తరువాతి కాలంలో ఆమెను ఇంటి ఆడపడుచులా గుండెలో దాచుకున్నది కన్నడ విశ్వవిద్యాలయం. విజిటింగ్ ప్రొఫెసర్‌లానో, ముఖ్యమైన అతిథిలానో వచ్చివెళ్లే వ్యక్తి కాదీమె. పిల్చిన వెంటనే బస్సులోనో, నడిచో వచ్చి వారు కోరిన కావ్యాలను గానం చేసి వాళ్లు ఇస్తే చిరు కానుకలను తీసుకుని వెళుతుండేది. ఈరమ్మకు కన్నడ విశ్వవిద్యాలయంలోని 'గిరిసీమె' ఆమె సొంత ఇల్లులా మారింది. ఈరమ్మను చాలా దగ్గరి నుంచి గమనించిన, ఆత్మవిశ్వాసంలోకి తీసుకున్న వ్యక్తి డా. బొరలింగయ్యగారు ఈరమ్మ జ్ఞాపకాల్లో 'మా బొరలింగయ్య' అయ్యారు. ఆమె తనకు విశ్వవిద్యాలయంలో పరిచయమైన వారిని 'మా మైత్రి', మా రమేశ్' అని ఆత్మీయంగా పిలిచేది.

అదే సమయంలో 'కుడుతిని'లో ఉన్న ఆర్. చేతన్ కుమార్‌గారు మొదట్లో నందిహళ్లిలోని పి.జి. సెంటర్‌లో 'బళ్లారి జిల్లా వృత్తిగాయకుల పరంపర'కు సంబంధించి పరిశోధన చేస్తుండేవారు. తరువాత సిరుగుప్పలోని కాలేజికి బదిలీ అయ్యారు. ఆయన ఈరమ్మను 'కన్నడ సంస్కృతి శాఖ'కు పరిచయం చేశారు. చేతన్‌కుమార్ ముందుగా తన ఇంటి ముందే వేదిక ఏర్పాటు చేసి ఆమె చేత కథ చెప్పించి సంబరపడ్డారు, ఆమెను సుండూర్‌కు తీసుకునిపోయారు. అక్కడ సుండూర్ గ్రామంలో ఒకటి రెండు ప్రదర్శనలు ఇచ్చిన ఈరమ్మ విశ్వవిద్యాలయ స్థాయిలో మొదటిసారిగా నందిహళ్లి పి.జి. సెంటర్‌లో తన కావ్యాన్ని గానం చేసింది.

నందిహళ్లి నుంచి మొదలైన ఈరమ్మ బుర్రకథ ప్రదర్శనల పరంపరను బళ్లారి సంస్కృతి శాఖ అప్పటి డైరెక్టర్ అయిన నాగరాజుగారు గుర్తించటం జరిగింది. అప్పటి నుంచి ఇప్పటి డైరెక్టర్ అయిన చోరనూరు కొట్రప్పగారూ ఈరమ్మ సాధనను గురించి అనేక వ్యాసాలు రాయటమే కాకుండా తామే పూనుకుని ఈరమ్మకు ఫించన్ వచ్చేలా చేశారు.

ఈరమ్మ బతికి ఉన్నంతవరకూ కన్నడ సంస్కృతిశాఖ ఎప్పుడు పిలిచినా వెళ్లి కార్యక్రమాల్లో పాల్గొని వచ్చేది. హంపి సాంస్కృతిక ఉత్సవం, జానపద ఉత్సవం, స్వాతంత్ర్య సువర్ణ మహోత్సవం, గడినాడు ఉత్సవం, మహిళా కళా ఉత్సవం-ఇలా మొదలైన అనేక కార్యక్రమాల్లో ఈరమ్మ పాల్గొంది. అంతేకాకుండా తాలూకా, జిల్లా, రాష్ట్రస్థాయిలోనూ అనేక జానపద పురస్కారాలను అందుకున్నది. ఆమె సాధనను మెచ్చుకున్న కర్ణాటక ప్రభుత్వం 1999వ సంవత్సరపు రాజ్యోత్సవ పురస్కారాన్ని, 2003లో డా. అంబేద్కర్ పురస్కారాన్ని, ఇచ్చి గౌరవించింది. వాటితోపాటు మంగళూరు సందేశ కలా ప్రశస్తి కూడా లభించింది.

సంచార సముదాయాలవారి బుర్రకథ పరంపరకు ఈ పురస్కారం, బంగారు పతకం లభించటం ఒకింత నమ్మకాన్ని కలిగించినా, ఆ జనసముదాయానికి ప్రభుత్వం సామాజికంగా, ఆర్థికంగా భద్రతను ఒదిగించే పనులు చేయవలసివుంది. అప్పుడు మాత్రమే ఈరమ్మలాంటివారి కళకు ఒక సామాజిక విలువ లభిస్తుంది. అయితే స్వయంగా ఈరమ్మ వీటిని ఆశించే వ్యక్తి కాదు. అయితే పురస్కారాలతోపాటు నివాస స్థలం దొరికితే, 'చల్లగా చావచ్చు' అని కలలు కనేది. (ఆ కల ఇప్పుడు కొత్త ఇంటి రూపంలో తీరబోతోంది) చేతన్‌కుమార్, ట్రైబల్ స్టడీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ప్రొఫెసర్ డా.కె. ఎం.మైత్రి, చెల్వరాజులాంటివారు ఈ దారిని ఈరమ్మకు చూపకపోయివుంటే ఇలాగే ఊరూరా తిరుగుతూ దిక్కుదిశ లేకుండా పోయేవాళ్లమని ఈరమ్మ అంటుంది. ఇప్పటికే ఎన్నో సంచార సముదాయాలు దిక్కుదిశలేకుండా పోయాయి. వాళ్లను గుర్తించే ఇలాంటి గొప్ప మనస్సు కలవారువుండాలి.

ఈరమ్మ తన బుర్రకథలతో ప్రజల మనస్సులను గెలుచుకుంది. ఈ ప్రాంతీయ పత్రికల్లో పరిచయమైంది. రాజ్యోత్సవ పురస్కారం వచ్చిన తరువాత ఉదయ టి.వి.లో ప్రసారమైన 'ఆత్మ', 'హెజ్జెగళు' ధారావాహిక అశోక్ కస్యప్, బృందంవారు హళెదరోజి వచ్చి వెళ్లారు. ఆనెగొంది షూటింగ్‌లో ఉన్న వీళ్లు కోళూరు నుంచి ఈరమ్మను పిలిపించుకుని డాక్యుమెంటరీ చిత్రీకరించి వెళ్లారు. మరొకసారి విదేశాలకు పంపాలని క్యాసెట్ రికార్డ్ చేసుకుని వెళ్లారు. ఈటీవీ వాళ్లు ఆమెను ఇంటర్వ్యూ చేశారు. ఇదంతా చూస్తే తమ కళలకూ గౌరవం లభిస్తుందని ఈ సముదాయం జనం నమ్ముతున్నారు.

'ఇది ఇక్కడితో ఆగకుండా మైత్రిగారు ఎప్పుడు తమకు పరిచయమయ్యారో ఆయన మాకు మంచి దారి చూపారు' అని ఈరమ్మ అంటుంది. మళ్ళీ-

'మా చేత కథలు చెప్పించి, పాటలు పాడించి, మా బుడగ జంగమల కష్టసుఖాలనంతా విని అర్థం చేసుకున్నారు. నా గురించి పత్రికల్లో ఏమేమో రాశారు. నేను పాడిన రెండు కథలు పుస్తకాలుగా వచ్చాయి. కన్నడ విశ్వవిద్యాలయం నాకు ఎంతో సహాయం చేసింది. విశ్వవిద్యాలయంలోని జానపద విభాగంవాళ్ళు కూడా నన్ను గుర్తించాయి. బొరలింగయ్య, చెలువరాజు, ప్రభాకర, రమేశు, బేవినకట్టి -వీళ్లంతా నన్ను ఎంతో అభిమానంతో చూసుకున్నారు.

సొంత భాషను అణగద్రొక్కి సంస్కృతిని కాపాడలేరు

నా చేత పాటలు పాడించుకుని సంతోషపడ్డారు. మారుతిగారు వచ్చి ప్రేమతో నా రెండు కథలను రాసుకున్నారు. కంబార సారు (డా. చంద్రశేఖర కంబారాగారు), వీరప్ప మొయిలుగారు ఉన్నప్పుడూ మేము వచ్చాం' అని ఈరమ్మ తన వెనుకటి రోజులను పదేపదే గుర్తుచేసుకుంటుంది.

ఇలా పదే పదే గుర్తుతెచ్చుకోవడం, స్మరించడం జానపద కళాకారుల మనోధర్మం.

1996-97లో కావచ్చు. మొదట్లో యూనివర్సిటీ వాళ్లు కన్నడలో కావ్యాలను పాడేవారి కోసం వెదకసాగారు.

అప్పట్లో కొందరు వేషగాళ్లు కూడా హొసపేట తాలూకాలోని వెంకటాపుర క్యాంపులో ఉండేవారు.

ఈ జనసముదాయానికి చెందిన శ్రీనివాస అప్పట్లో కెనాల్ మీద పనిచేస్తుండేవాడు. అతడికి నెలకు అయిదారువేలు జీతం వచ్చేది. మొదట్లో ఇతడిని సంప్రదించి, వివరాలు తెలుసుకుని, సోమలాపురంలో పాడుతున్న తెలుగు బుర్రకథకులను పిల్చుకునిపోయారు. అయితే వీరికి తెలుగు తప్ప కన్నడలో పాడటానికి రాదు. ఎంత ప్రయత్నించినా సాధ్యం కాకపోవటంతో మళ్లీ కన్నడలో పాడగలిగే కళాకారులను వెదికే ప్రయత్నం చేశారు. గ్రామాల్లో చాలామందిని విచారించిన మీదట హళెదరోజి ఈరమ్మ గురించి తెలిసింది. తెలుగు, హిందీ, కన్నడ, బుడగ-ఇలా బహుభాషల్లో ఈరమ్మ కావ్యాలను గానం చేస్తుందని ప్రజలు తెలియజేశారు. అప్పుడే దరోజిలో ఉన్న ఈ కావ్యాలనిధిని కలిసి 15-20 రోజులపాటు విశ్వవిద్యాలయంలో నిలుపుకుని కథలను పాడించి క్యాసెట్లు చేసుకున్నారు. ఆ సమయంలో ఈరమ్మతోపాటు మల్లికార్జున, పార్వతమ్మ, శివమ్మలు ఉన్నారు. అప్పుడు ఈరమ్మకు 5000/- గౌరవ ధనంగా ఇచ్చారు. (ఆ ధనాన్ని అందరూ సమానంగా పంచుకున్నారు. సాధారణంగా ఈరమ్మకు పార్వతమ్మ, శివమ్మలు సహకారం ఇచ్చేవాళ్లు. ఆమె తనకు వచ్చిన పారితోషికాన్ని మూడు సమాన భాగాలుగా చేసి పంచేది. అది డబ్బు కానీ, ధాన్యపు గింజలుకానీ, వస్త్రాలుకానీ, నగలు కానీ, పశువులు కానీ, సంపాదనలో ఏదైనా కానీ ముగ్గురుకి సమానంగా పంచాల్సిందే. ఏదైన వస్తువును పంచడానికి కుదరని పరిస్థితిలో దాన్ని అమ్మి డబ్బును పంచుకునేవారు. ఈరమ్మ ఈ పద్ధతిని చివరి వరకూ పాటించింది.)

'ఈ విధంగా విశ్వవిద్యాలయానికి మాకు బంధుత్వం ఏర్పడింది. మైత్రిసార్, వారి శ్రీమతి దాక్షాయని మేడమ్ ఎల్లప్పుడూ మా క్షేమసమాచారాలు విచారిస్తూ మా హళెదరోజికి వచ్చి వెళ్లేవారు. దాక్షాయని మేడమ్ మాకు మరీ ఆత్మీయులైపోయారు. వాళ్ల ఇంటికి వెళితే మమ్మల్ని తమ కుటుంబంలోని మనుష్యుల్లా చూసుకునేవారు. అక్కడ మాకు కావలసింది మేమే వండుకుని తినేవాళ్లం. అంత స్వాతంత్రం మాకుండేది. ఆ ఇంట్లో కులమతాల ప్రసక్తి లేదు-మైత్రి సార్ చాలా మంచివారు'' అని ఈరమ్మ ఆత్మీయంగా గుర్తుచేసుకుంటుంది.

ఈరమ్మ కన్నా ముందరి రెండు తరాలు ఈ బుర్రకథ పరంపరను అనుసరించుకుంటూ వచ్చాయి. అనేక కథలను ఏ రోజుల్లో చెప్పినా కొన్ని ప్రత్యేకమైన కథలను మాత్రం ప్రత్యేకమైన రోజుల్లోనే చెప్పేవారు. ఉదాహరణకు ఎల్లమ్మ కథను మంగళవారమో లేదా శుక్రవారమో చెప్పేవారు. ఈ కథను చెప్పటానికి రెండు రోజులు అవసరమయ్యేది. అందువల్ల కథను ప్రారంభించే రోజు లేదా ముగించే రోజు మంగళవారమో లేదా శుక్రవారమో వచ్చేలా లెక్కలు వేసుకుని కథను ప్రారంభించేవారు.

ఇక ఇతర కథలు చెప్పటానికి ఫలాన వారం అన్నది లేదు. ఏ రోజైనా కథ ప్రారంభించవచ్చు. ఒప్పుకున్న రోజునే ఆ ఊళ్ళో కథ చెప్పి తరువాతి ఊరికి వెళ్ళేది. ఇంటి దేవుళ్ల పూజలు ఉన్నప్పుడు మాత్రం తన తంబూర, గగ్గరి, దుముకిలను పూజించేది.

ఈరమ్మకు తన తంబూర అంటే సరస్వతిదేవే. ఆమె పరంపర నిజమైన దైవమూ ఆ సరస్వతే. ఇప్పటికీ తాతల కాలం నుంచి వాయిస్తున్న తంబూరనే ఈరమ్మ బుర్రకథలకూ చైతన్యవంతమైన లయను చేకూర్చుతోంది. ఈరమ్మ ఆ తంబూను తన కూతురుకన్నా మిన్నగా కాపాడుకుంటూ వచ్చింది.

ఇతర ఊళ్లకు కథలు చెప్పటానికి వెళ్ళినప్పటికీ వీళ్ళు ప్రత్యేకమైన వేషాధారణ చేసుకోరు. ఈరమ్మ, పార్వతమ్మ, శివమ్మలు సాధారణమైన చీరలు రవికలు ధరించేవారు. అయితే పగటివేషాలు వేసే మరొక సముదాయంవారి వృత్తివిధానాలే వేరు. ఈరమ్మ సముదాయం వాళ్లు నుదుటి నిండా విభూతి, గంధం పూసుకుని, మెడలో పూసలదండ, చేతికి గాజులు తప్ప ప్రత్యేకంగా ఏమీ ధరించేవారుకాదు. ఇక దీర్ఘ కథనాలే ఈరమ్మకు ప్రత్యేకమైన ఆభరణాలు !

ఈరమ్మ పాడే పాటలను ఇతరులు కూడా పాడుతారు.

అయితే వాళ్లు తెలుగులో పాడుతారు.

వాళ్లల్లో ఈరమ్మలాంటి బహుభాషా కళాకారులు ఉండటం తక్కువ.

ఈరమ్మ తెలుగులోనూ కథలు చెబుతుంది.

ఆంధ్రలోని కణివికల్లు, గుత్తి, ధర్మవరం, ఏకపల్లె, బుడవెపల్లె, ఎరడుసేరు. గూళ్యం, నటరవాడ, సూళెకల్లు, ఆలరవి, ఎర్రగుంట, బెన్నెకల్లు, హడ్లిగి, బసరకోడు, హొసమొక్క, హళెమొక్క-ఇలా వందలాది ఊళ్లల్లో కథలు చెప్పింది.

అయితే ఈరమ్మ తెలుగు, హిందీ, బుడగ భాషల్లోనే కాకుండా కన్నడలోనూ కథలు చెబుతుంది.

అందులోనూ కన్నడలో పాడుతున్నది ఈరమ్మ ఒక్కతే అంటే ఆమె ప్రత్యేకత ఏమిటో ఊహించవచ్చు.

ఈరమ్మ ఎక్కువగా కన్నడలోనే కథలు చెబుతుంది. ఈ కులసముదాయానికి చెందిన వేషగాళ్ళు బళ్లారి, కురుగోడు, రాంపుర, దరోజి, మాళపుర, హొసల్లి, బలకుంది, హళేకోట, సిరుగుప్ప, కంప్లి, వెంకటాపుర క్యాంపు, హొసపేట, నారాయణపుర, చళ్లకేరి,

తెలుగును బోధించడం కాదు ; తెలుగులోనే అన్నీ బోధించాలి

ధావణగెరె, ఇటువైపు కారటగి, సిద్ధాపుర, ప్రాంతాల్లో గుడారాలు వేస్తారు. ఈరమ్మ ఈ ప్రాంతమంతటా కథలు చెబుతుంటుంది.

దూరంలోని బెంగళూరు, మండ్య, మైసూరు ప్రాంతాల్లోనూ ఈ సముదాయపు జనం పెద్దపెద్ద ఉద్యోగాల్లో ఉన్నట్టు చెబుతారు. ఈ సముదాయానికి చెందిన వై.కృష్ణప్ప బెంగళూరులోని ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఉన్నారు. ప్రస్తుతం ఈరన బుడగజంగమ సంఘానికి రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్నారు. డా. ఎన్.ఆర్. వెంకటేశ్‌గారు ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఈ సముదాయానికి చెందిన కొందరు పోలీస్ శాఖలోనూ ఉద్యోగాలు చేస్తున్నారు. హళెదరోజిలో సుమారు 150 మంది బుడగ జంగములు ఉన్నారు.

పగటి వేషగాడైన రాముడు ఈ వేషగాళ్ల వృత్తి, ఈ బుర్రకథా పరంపర, బిచ్చమడుగుతూ తిరగడం, అపహాస్యానికి గురవ్వడం అత్యంత బాధను కలిగిస్తుందని అంటాడు. అతను వ్యక్తిగతంగా ఈ పరంపర, సంస్కృతి ఇలాగే ఉండాలని కోరుకునే వ్యక్తి కాదు. తమ వాళ్లు ఏదో ఒక వృత్తినో లేదా వ్యాపారమో చేసుకోవాలని ఆశించేవాడు. అయితే ఈరమ్మకు మాత్రం రేపు తాను చనిపోతే ఈ కావ్యాలను ఎవరు గానం చేస్తారనే చింతపట్టుకుంది?

ఈరమ్మకు వృద్ధాప్యం మీద పడింది.

వీపు, తల, చేతులు వణుకడం మొదలైంది.

శారీకంగా మెత్తబడింది.

అయితే ఆమె కంఠం మాత్రం కంచుకంఠమే.

చేతిలో తంబూర పట్టుకుందంటే ఆమెకు ఆమే సాటి. రెండు పగళ్లు, రెండు రాత్రిళ్లు కథ చెప్పినా ఆమె అలసిపోయేదికాదు.

ఆమె నిద్రాసమయమంతా కథల్లోనే గడిచిపోయేది. అయితే ఆమె ఎన్నడూ కడుపు కట్టుకున్నది కాదు. ఆకలి తీరటానికి అన్నం కావాల్సిందే. అయితే కడుపు నిండుగా తిని తన గానానికి ఇబ్బంది తెచ్చుకునే మనిషి కాదు. భోజనం విషయంలో జాగ్రత్తగా ఉండేది. వందలాది పల్లెలను తిరిగిన మనిషి. వందలాది చోట్ల భోజనం చేసిన మనిషి. ఆమెకు సమాజంలో వస్తున్న పేరు ప్రఖ్యాతలు చూసి ఈర్ష్యపడే జనం ఉండేవారు. అలాంటివారు తినేపదార్థాలలో ఏదైనా మందోమాకో పెడతారేమోనని ఆమె తల్లితండ్రులు భయపడేవారు. అప్పటి నుంచి ఈరమ్మ విషాలకు విరుగుడుగా వేపాకులు, వేప బెరడుతో కషాయం చేసుకుని తాగటం మొదలుపెట్టింది. బహుశా అందువల్లనే కాబోలు 70 ఏళ్ల జీవితంలో ఒక్క రోజు కూడా ఒక మాత్ర వేసుకోవటం కానీ, ఒక సూదిగానీ వేయించు కున్నది కాదు. అలోపతి మందులు వాడనే లేదు. జలుబు, స్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, అలసట ఏదీ వచ్చినా వేపాకుల రసం, వేపబెరడులతో కషాయం చేసుకుని తాగేస్తుంది. కంఠస్వరంలో ఏదైనా తేడా కనిపించినా శొంఠి, మిరియాలు, బెల్లం దంచి ఉడికించి తాగేది. లేదా సున్నాన్ని నీటిలో ఉడికించి మెడకు పట్టీ వేసుకునేది.

ఈరమ్మకు తన తదనంతరం ఈ కావ్యాలను ఎవరు గానం చేస్తారు? అనే ప్రశ్న నిరంతరం వేధించేది. ఎవరికైనా తన కావ్యాలను నేర్పించానే కోరిక స్వయంగా ఈరమ్మకు ఉంది. అయితే ఎవరూ నేర్చుకోవటానికి ఆసక్తి చూపలేదు. ఆమె కన్న కూతురే కొంత కాలం పాటలు పాడి మానేసింది. కూలీ పనులకు పోవడం. ఖాళీ సమయాల్లో 'గంగమ్మ-గౌరమ్మ' పాటలతో బిచ్చానికి పోతుంది. ఇక ఈరమ్మ చెల్లెళ్లకు పరంపరను కొనసాగించడానికి సాధ్యం కావడం లేదు. ఈ ఆలోచనలతో ఈరమ్మ విచారానికి లోనవుతుంది. విసుగొచ్చి తంబూరను పక్కనపెట్టి పడుకుంటే నిద్రలో తంబూర లెయ్...లెయ్ అని లేపుతుందట. కలలో సరస్వతి వచ్చినట్టు అనిపిస్తుందట. అందువల్ల ఆమె తాను వాయించే తాతల కాలపు తంబూర మూలన పడకూడదని ఇంకా పాడుతూనే ఉంది.

ఈరమ్మ చుట్టుపక్కలున్న పల్లెలను, ప్రజల వందలాది అనుభవాలను, వారి కాయకపు గుణాలను సంతరించుకుంది. ప్రజలే ఆమెలో నిజమైన శక్తిని నింపారనిపిస్తుంది. తన తరువాత ఇలాంటి ప్రజలు తన పాట, కథ వినకుండా పోతారుకదా అనే బాధ ఆమెలో చోటుచేసుకుంది. ఈరమ్మతో ఈ కథా పరంపరల మూడవతరం ముగిసిపోవచ్చు.

కాలం దొర్లుతూనే ఉంది.

కాలంతో పాటు ఈరమ్మ కూడా మరణం వైపు దొర్లుతూనే ఉంది.

ప్రచురించిన ఆమె కావ్యాలు తమ గొప్ప సాధన అని విశ్వవిద్యాలయాలు గర్వించవచ్చు.

అయితే అవి ఈరమ్మలా శ్రద్ధతో, ఓర్పుతో, నిద్రపోకుండా మనకు పాడటానికి నేర్పలేవు.

ఈ కాలపు బౌద్ధిక జ్ఞానానికి సవాలు విసిరే అపారమైన మౌఖిక జ్ఞాన సంపదను ఈరమ్మలాంటివారు భవిష్యత్ తరాలవారికి అందిస్తూనే ఉన్నారు. ఏదైనా విశ్వవిద్యాలయానికి కులపతులవ్వాల్సిన ఇలాంటివారు విశ్వవిద్యాలయం ఇచ్చే ఒక పురస్కారానికో, ప్రభుత్వ పురస్కారానికో, సన్మానానికో లోనై సద్దులేకుండా మట్టిలో కలిసిపోతారు.

విశ్వవిద్యాలయాలు తలుచుకుంటే ఆమె కావ్యాలన్నిటిని ప్రకటించి వాటిని ఆమె ఎత్తుకు నిలిపినా ఆమెలోని ఒక ప్రశ్నకు మాత్రం సమాధానం సరియైన జవాబు ఇవ్వలేవు.

"మా తాత పరంపరను మా నాన్న ముందుకు కొనసాగిస్తే, మా తండ్రి పరంపరను నేను కొనసాగించాను. ఇక నా పరంపరను ఎవరు ముందుకు కొనసాగిస్తారు?..."

ఈ ప్రశ్నకు ఎవరు జవాబివ్వాలి?

***

(వచ్చే నెల ముగింపు - **చివరి రోజులు**)

కన్నవారినీ తోడబుట్టినవారినీ తెలుగులో పిలువలేని బ్రతుకెందుకు?!

స.వెం. రమేశ్

అలమరంలో దేవరం

2017–18 సం.లలో మన పత్రికలో 12 నెలలపాటు ప్రచురించిన 'మౌనంలోని మాటలు' ఇప్పుడు పుస్తక రూపంలో వెలువడబోతున్నది. దానికి స.వెం.రమేశ్ వ్రాసిన 'ముందుమాటల'ను ఇక్కడ ఇస్తున్నాము. ఎంతో ఆసక్తితో 'మౌనంలోని మాటలు' ను చదివి మెచ్చుకొన్న చదువరులకు ఇది ఉపకరిస్తుంది. – సంపాదకుడు

డద్దణక డద్దణక డద్దణక డణ్‌డణ్...అనే పలకసద్దు రాగవయ్యపేట తెరువుల్లో వారానికొకసారి వినిపించేది. నట్టింటి బొట్టల సందున దాంకోబూచి ఆడుతుండేవాళ్లూ, నడీది కానగమాను మీద కోతికొమ్మచ్చులు ఎగురుతుండేవాళ్లూ, నొగను వాల్చిపెట్టుండే బండి కాడిపైన ఊగుతుండేవాళ్లూ, ఒకరి మెడమీద ఒకరు చేతులేసుకొని 'ఉట్టిమీద ఊరగాయ్ అందుకో చెల్లెలా' అంటా తిరుగుతుండేవాళ్లూ, ఒకరని కాదు, ఒకగుంపని కాదు, నాలాంటి పిలకాయల కాళ్లన్నీ ఆ పలకమోత తట్టుకు పరుగులు తీసేవి. పలకమోత దగ్గర పడతా ఉండగానే మువ్వలమోత కూడా వంత పలకతా వినిపించేది.

ఒక్క పరుగున ఉరికిన కాళ్లు టక్కున అక్కడ నిలబడిపోయేవి. బిత్తరతో సన్నగా తత్తరపడేవి. బెదురుబెదురుగా అడుగులు కదిలేవి. ఎదురుగా ఒక అడపొడ – అప్పుడే కొలిమిలో కరిగించి కరుగులో పోసిన ఇనుములాంటి చెమటలు కారతుండే నల్లటి ఒళ్లు, గోసి పోసికట్టిన ఎర్రటి పంచె, మొకానికి ఓరగా పెట్టుకొనుండే రాకాసి చెక్కముసుగు, కాళ్లకు మువ్వలు, చేతిలో పలక, ఆ తట్టు నేలమీద నిలబెట్టి ఉండే నలుచదరపు దేవరపెట్టి, పెట్టెలో పసుపుకుంకుమలను పులుముకొన్న మిడిగుడ్ల పోలేరమ్మ–ఆ అడపొడ పేరు దేవరపెట్టి అంకడు. ఇల్లిల్లూ తిరిగి తిరిపెం ఎత్తడం అతని పని. అడుక్కొనే ముందు దేవరపెట్టిని ఒకచోట నిలిపి ముసుగును తగిలించుకొని, పలకను కొడతా బీకరంగా చిందేసే అంకయ్యను చూడటం పిలకాయలకు జడుపుతో కూడుకొన్న వేడుక.

ఆ ఈడులో నాకు అంకయ్య ఊరూపేరూ ఏమీ తెలియదు. ఎన్నో ఏండ్లు గడచి పోయినాక పదైదేండ్ల కిందట ఒకసారి అదే పేటలో అతను కనిపించినాడు. పక్కన దేవరపెట్టి లేదు, మొకానికి ముసుగులేదు, చేతిలో పలకలేదు. పెట్టెకు మారుగా ఉరుముడోలును మోగిస్తా ఒక ఆడామె. ముసుగుకు మారుగా మొకమంతా కమ్ముకొంటున్న ముదుతలు. పలకకు మారుగా ఒళ్లను చెళ్లుమనిపిస్తుండే వీరగోలు. నడిపొద్దు వరకు తెరువంతా తిరిగి తిరిపెం అడిగి, ఉరుముడోలును గుయ్యిగుయ్యిమని రుద్ది రుద్ది అలసిపోయి, వీరగోలుతో మేనుని చరచుకొని సొలసిపోయి, మానునీడకు చేరి కూటిమూటను విప్పినారు ఆ ఆలూమొగుళ్లు. వాళ్లను తిననిచ్చి, నాకు కలిగినదేదో చేతపెట్టి కొంతసేపు ముచ్చటపెట్టినాను అంకయ్యతో. ఆ కాసేపు ముచ్చటలోనే తన బతుకును కొంత విప్పిచెప్పినాడు అంకయ్య.

"మా ఊరేదని అడగతా ఉండావా సామీ ! మేము అలమరోళ్లం. మాకు ఒక ఊరనేది ఉంటాదా? ఈ నడమనే దొరతనమోళ్లు ఇళ్లు కట్టిస్తే, రెట్టపల్లిలో నాలుగు కాపరాలం కుదురుకొన్నాం. ఇప్పుడు పదినాళ్లు అట్టిట్ట తిరిగినా, కడాకు రెట్టపల్లికి చేరుకొంటా ఉండాము. మా కులమా సామీ ! మమ్మల్ని దేవరోళ్లు అంటారు. కొందరు దేవరపెట్టోళ్లు అంటారు. అట్ట అరవ దేశానికి పోతే సాటడికార్లు అంటారు. ఏమి దేవరా, ఎంత మాటను అనేస్తివి ! ఒళ్లను ఊనం చేసుకొనేది దేనికా? యీరగోలుతో కొట్టుకోకుండానే అడుక్కోమంటావా? ఇల్లిల్లూ తిరిగి తిరిపెం అడిగేదానికి ఇది పనికాదు సామీ, అరము (వృత్తి). కుమ్మరోడు కుమ్మరానికీ, మేదరోడు మేదరానికీ, దొమ్మరోడు దొమ్మరానికీ సిగ్గుపడితే అవతాదా దొరా? మాది అంతే కదా. ఆ అమ్మతల్లిని నమ్ముకొని దేవరం చేసేవాళ్లము. ఈ పనికి వెరిస్తే ఎట్ట? నా ముసుగా, నీకు బలే గెవనం దేవరా, అది పెండ్లి కాకముందర మందల. మేము పెండ్లయ్యే వరకే దేవరపెట్టిని మొయ్యాల. నువ్వు ముసుగు అంటుండావే, అదేమన్నా గుడ్డా సామీ, దాన్ని మరువు అనాల. మేము దేవర మరువు అంటాము. దాన్ని తగిలించుకొని ఆడతుంటే ఆయమ్మ నవ్వతాది. పగలబడి నవ్వతాది. ఆ నవ్వుతో ఆయమ్మ కోపం సల్లారతాది. అమ్మ సల్లబడితే ఊరూ ఉలగమూ సల్లబడతాది. పెండ్లయినాక దేవరపెట్టిని ఎత్తకూడదు సామీ, పలకను పక్కన పెట్టి యీరగోలును ఎత్తుకోవాల, ఒళ్లను పగలకొట్టుకోవాల. దేవరోడి నెత్తురు చిందితే నేలతల్లికి దప్పిక తీరతాది. అద్దో నా పెండ్లాము సంకన ఉండాదే దాన్ని మీరు ఉరుము డోలు అంటారు. మేము వీరణం అంటాము. దేవదుందుబి అని కూడా అంటాము. దాన్ని మగోళ్లం వాయించకూడదు. ఆడోళ్లే దాన్ని తాకాల. అది మోగితే మొయిలు మోగతాది, మోడం మెరస్తాది, వాన కురుస్తాది. అప్పుడే మీ బోటోళ్లు మడకలు కట్టి దున్ని పంటలు పైర్లు చేసేది. కాపోడు పంటపండించి లోకాన్ని సాకతాడు అనేది నిజమే. అయితే దేవరోడి వీరణం మోగి, నెత్తురు చిందితేనే నేల పండతాది. అట్ట చేసేదే మా అరము. దానికే మమ్మల్ని దేవరోళ్లు అనేది".

దేవరోళ్లు, దేవరపెట్టోళ్లు, పెద్దమ్మలోళ్లు, సుంకలమ్మోళ్లు, దురగమురిగి, వీరగోలు పూజార్లు, బుర్రబుర్ర చా, బుర్రమారియరు, బుట్టికూగమ్మలు, ఉరుములోళ్లు, ఊరుమారెమ్మలు, నాయనోళ్లు, నాయన్మార్, సాట్టయ్ అడికారర్, సాట పెట్లోళ్లు, వార్‌వార్, నాద్‌జోగి, సిందోళ్లు...ఒకటి కాదు, రెండుకాదు, పదికి మించి పేర్లున్న ఈ అలమరి తెగ, వింధ్యమలల నుండి కన్నికుమరి వరకూ చిందేయని తావు లేదు, నెత్తురు చిందించని నేల లేదు. వింధ్యకు ఆవల ఉండే ఉజ్జయినిలో కూడా కనిపించినారు ఒకసారి. అన్ని తావులలోనూ వీరి తల్లిపలుకు తెలుగే.

తెలుగుజాతి చాలా పెద్దది. చాలా పలుతనం కలిగినది. ఇంకా దట్టమైన అడవుల్లోనే ఉంటూ తిండిని వెతుక్కొని తిరిగే తెగలూ; కాడును నరికి పోడుసేద్దెం చేసి అంతో ఇంతో పండించుకొని తినే తెగలు; చెరువో దొరువో, వాగో వంకో, నుయ్యో బాయో దేన్నో ఒకదాన్ని నమ్ముకొని నిలకడ సాగుచేసి కనుబడిని పెంచే కులాలు; ఆ సాగు చుట్టూ ఎదిగిన కుమ్మరి, కమ్మరి, మేదరి, నేతరి, వడ్డరి, ఒడ్డరి, పొల్లరి వంటి పలు చేతిపనుల కుదురులు; చెమటోడిచి ఊడిగం చేసే చాకలి, మంగలి, కైకలి, కాలరి వంటి ఊడియరులు; పెరిగిన కనుబడిని అమ్మడానికి దూరతీరాలకు సాగే కవర, సాతు గుంపులు; ఉన్నచోటనే అంగడిపెట్టి అమ్మే కోవరులు (కోమటులు); త్రోవను(మతం) చాటడానికే పుట్టిన దాసరి, పందరి చీలికలు; చాటడంతోపాటు పోరుకైనా తెగపడే దొమ్మరి, మల్లరి ఇడుపులు; వేడుకను చూపుతూ వేగరం (గూడచర్య) చేసే అలమరులు; పల్లెలు పేటలుగా మారినాక, పేటలను కడిగిపోస్తున్న తోమరి (పారిశుద్య) పనివారు; ఇంత పలుతనం (వైవిద్యం) మన దేశంలో మరే నుడిజాతిలోనూ లేదు. ఈ గొప్పతనాన్ని చెప్పుకోవడంలో మట్టుకు తెలుగు తెలివిపరులు వెనకడుగులు వేస్తూనే ఉన్నారు. మన పొరుగు నుడులవారు ఈ పనిని ఎప్పుడో మొదలుపెట్టినారు. అయితే వారు వెలికి తెస్తున్న బడుగు బతుకులలో మూడువంతులు పైగా ఉన్నవి తెలుగువారివే. ఈ పొత్తంలోని సిందోళ్లు కూడా అట్లాంటి వాళ్లే.

అలమరం (సంచారం)లో దేవరం (దైవప్రచారం) చేసేవాళ్లు సిందోళ్లు. విందెమలలకు తెన్నాట, బుద్ధ జిన త్రోవలు కనుమరుగు అయిపోయినాక, శివ విష్ణు త్రోవలు కుదురుకొన్నాయి. ఈ రెండిటి నడుమ పోటీ పోట్లాట పెరిగింది. దాసరం పేరుతో విష్ణుత్రోవ, పందరం పేరుతో శివత్రోవ చాటింపుకు (ప్రచారానికి) దిగినాయి. కాళ్లకు బలపాలు కట్టుకొని మరీ పదుల తెలుగుతెగలు ఈ రెండు త్రోవలనూ ఊరూరా వాడవాడా చాటడం మొదలుపెట్టినాయి. 12వ నూరేడు నుండీ ఈ పని మొదలయిన ఆనవాళ్లు కనపడుతున్నాయి. ఈ రెండూ త్రోవలకు అడుగడుగునా దొరతనపు అండదండలు దొరికినాయి. అమ్మత్రోవ (శాక్తేయం)కు ఏ దొర అండా దొరకలేదు. అంకమ్మ, కళ్యాణి, చాళుక్యరాజు గొడవ; ఎల్లమ్మ, ప్రతాపరుద్రుడి తగవు వంటి నోటికతలు, దొరతనాల మీద అమ్మత్రోవ తిరుగు బాటులు చెప్పేవి. దొరతనాల అండ దొరికిన శివ విష్ణు త్రోవల చాటింపుకు పందర దాసర తెగలు పూనుకొంటే, ఏ అండా లేని అమ్మ త్రోవను దేవరతెగ తలెత్తుకొనింది. పోలేరమ్మనో పోచమ్మనో పెద్దమ్మనో మారెమ్మనో సుంకలమ్మనో దురగమ్మనో పేరు ఏదయితే ఏమి, అమ్మబొమ్మను ఊరూవాడా చాటతా, పిడికెడు బిచ్చం కోసం, కమికెడు కవళం కోసం, ఒళ్లును చీల్చుకుని నెత్తురు చిందిస్తా సాగుతుండే తెగ సిందోళ్లు.

తెలుగువాళ్లం తొంగి కూడా చూడకుండా వదిలేసిన సిందోళ్ల బతుకునూ బతుకు నుడికారాన్నీ ఒక కన్నమతను పట్టించుకొన్నారు. సిందోళ్ల తెగలో పుట్టిన రావోళ్ల నాగప్పగారు తన వెతను చెపుతా ఉంటే, డా. ఆర్.బి. కుమార్‌గారు ఆ బతుకుకు కన్నడ నుడిలో రాత రూపును కలిపించినారు. ఆ రూపుకు 'మౌనదొళగిన మాతు' అనే చక్కటి పేరును పెట్టినారు. తెలుగు బతుకుతో నిండిపోయిన ఆ కన్నడ పొత్తాన్ని రామచంద్రరావుగారు 'మౌనంలోని మాటలు'గా తెలుగులోకి తెచ్చినారు. ఎంత మంచి పేరో చూడండి. మన చుట్టూనే ఎన్నో బడుగు బతుకులు తరాలకు తరాలే మౌనంలో ఉండిపోయి ఉన్నాయి. మనం అనుగుతో పలకరించి కదిలించితే ఆ మౌనంలో నుండి వెలువడే మాటలతో మన మెలన (చరిత్ర)ను గొప్పగా రాసుకోవచ్చు, దాచుకోవచ్చు, చాటుకోవచ్చు. ఈ పొత్తం కూడా అటువంటిదే.

రామచంద్రరావుగారు కన్నడం నుండి తెలుగులోకి చాలా పొత్తాలను మార్చి తెచ్చినారు. వారు తెచ్చిన అన్ని పొత్తాలు ఒక ఎత్తు. ఇదీ, ఇదివరకటి 'ఓ సంచారి అంతరంగం' అనే రెండు పొత్తాలు ఒకెత్తు. మిగిలిన పొత్తాలతో వారు నానుడి (సాహితీ) సేవ చేసినారు అంతే. ఈ రెండు పొత్తాల ద్వారా ఒక ఎసపు (ఉద్యమం)కు వెన్ను దన్నయి నిలిచినారు. 'మీ ఎసపులో నాదీ ఒక అడుగు' అంటా ముందుకు వచ్చినారు.

అవును, తెలంగాణాంధ్రలకు బయట ఉన్న సగంమంది తెలుగువారిని పట్టించుకొన్న తెలివిపరులు ఏరీ? అరవై యేండ్ల కిందట నుడుల పేరుతో ఏర్పడిన ఏలి (కృత్రిమ)ఎల్లలను దాటి తొంగి చూసినవారు ఎక్కడ? ఇప్పుడిప్పుడే 'మేమూ తెలుగువాళ్లమే, మీదీ మాదీ ఒకటే బొడ్డుపేగు' అని ఎలుగెత్తుతున్న ఆవలి గొంతులను వింటున్నవారు ఎందరు? రామచంద్రరావుగారికి ఆ కేకలు వినపడి కాదు ఈ పని చేసింది. వారు కూడా ఆ కేకలో వంతే. మైసూరు దగ్గరి చామరాజనగరు నుండి ఆదోనికి వలస వచ్చిన కుటుంబం వారిది. అందుకే ఈ పొత్తాలను మనసుపెట్టి తెలుగులోకి తెచ్చినారు.

తెలుగువాళ్లకున్నట్లే కన్నడమోళ్లకు కూడా గూటాల (మహాప్రాణాల) పిచ్చి ఎక్కువ. వెనకా ముందూ చూడకుండా గూటాలను వాడేస్తుంటారు. 'సిందోళ్లు' అనే పేరును, 'సింధోళ్లు' అని వత్తి రాసినారు మూలంలో. నిక్కానికి, తెరువుల్లో చిందేసేవాళ్లు కాబట్టి సిందోళ్లు అయి ఉండవచ్చు. లేదా సిందవాడి తావుకు చెందినవాళ్లు కాబట్టి సిందవాళ్లు అయి, సిందోళ్లుగా మారి ఉండవచ్చు. ఆలూరు, ఆదోని తావులకు సిందవాడి అని పాతపేరు. 8వ నూరేడు (శతాబ్దం) నుండి రాతి చెక్కింపులలో ఈ పేరు కనబడుతున్నది. ఆలూరు, ఆదోని, రాయచూరు, బళ్ళారి తావులలో మట్టుకే వీళ్లకు 'సిందోళ్లు' అనే పేరు ఉంది. తెలుగులో ఈ పేరు గూటం లేకుండా రావడం బాగుంది.

మౌనంలోని మాటలను చెప్పిన రావోళ్ల నాగప్పగారిది, తెలుగులోకి మార్చి తెచ్చిన రామచంద్రరావుగారిది ఇద్దరిదీ సిందవాడి తావే. ఈ పొత్తాన్ని బళ్ళారి జిల్లా రచయితల సంగం (బ.ర.సం) వారు వెలికి తేవడం కూడా ఎంతో బాగుంది. సిందవాడి తావు పాత బళ్ళారిలోదే కదా. రామచంద్రరావుగారివి మరికొన్ని అడుగులు బయటి తెలుగు ఎసపులో పడాలనీ, ఆ అడుగులను కూడా బ.ర.సం. వారు వెలికి తేవాలని కోరుకొంటున్నాను.

ఒక్కమాటను చెప్పి ముగిస్తాను. ఈ పొత్తాన్ని చదివినవారు ఎవరైనా పూనుకొని, మన నెత్తుటి చుట్టమైన రావోళ్ల నాగప్పగారిని పిలిపించి గౌరవించి పంపితే బాగుంటాది కదా. తలపోయండి.

చలసాని నరేంద్ర
9849569050



చట్టసభల స్పీకర్ల, ఎన్నికల కమిషన్‌ల అధికారాల దుర్వినియోగం: న్యాయస్థానాల ప్రేక్షక పాత్ర

తగు బాధ్యత వహించకుండా, జవాబుదారీతనం లేకుండా, రాజ్యాంగం కల్పించిన అధికారాలతో సంబంధం లేకుండా ఏక పక్షంగా వ్యవహరిస్తున్న కీలక సంస్థలలో ఎన్నికల కమిషన్ ను పేర్కొన వచ్చు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం మనది. అటువంటి దేశంలో ముఖ్యంగా విభిన్న భౌగోళిక, సాంస్కృతిక, భాషాపర వైరుధ్యాలు నెలకొన్న దేశంలో ఎన్నికలు నిర్వహించడం నిజంగా ఒక సవాలే. గత ఏడు దశాబ్దాలుగా ఈ సవాలును తగు రీతిలో చేబడుతూ, ఎన్నికల కమిషన్ తన విధులను నిర్వహిస్తున్నది.

ఎన్నికల సమయంలో వివిధ రాజకీయ పార్టీల మధ్య, పలు వర్గాల ప్రజల మధ్య ఎన్ని రాగద్వేషాలు, భావోద్రేకాలు చెలరేగినా మొత్తం మీద ప్రశాంతంగా ఎన్నికలు జరగడం, ఒక పార్టీ నుండి మరో పార్టీ లేదా ఒక కూటమి నుండి మరో కూటమి చేతికి శాంతి యుతంగా అధికార బదిలీ కావడం జరుగుతూనే ఉంది. అధికార బదిలీని సక్రమంగా జరపడం కోసం ఎక్కడా పోలీసులు, సైనికులు జోక్యం చేసుకోవలసిన పరిస్థితి రానే రాలేదు. ఇదొక విధంగా కమిషన్ నిర్వహిస్తున్న తీరు తెన్నుల కితాబు అని చెప్పవచ్చు.

భారత దేశంతోపాటే సుమారు 60 దేశాలు ఆసియా, పసిఫిక్ ఖండాలలో స్వతంత్రం పొంది, ప్రజాస్వామ్య వ్యవస్థను ఎంచు కున్నాయి. అయితే వాటిలో ప్రజాస్వామ్యం నిరాకంటకంగా కొన సాగుతున్నది భారత్ లోనే కావడం గమనార్హం. వీటిల్లో అనేక దేశాలు నిరంకుశ పాలనకాల పరిధిలోకి జారుకున్నాయి. మరి కొన్ని దేశాలలో ప్రజాస్వామ్యం నెలకొన్నా సైనిక ఆధిపత్యం నెలకొనడం, మధ్యలో కొంత కాలం సైనికులు అధికారాన్ని హస్తగతం చేసుకోవడం జరిగింది. ఎమర్జెన్సీ వంటి పీడను సహితం మనం శాంతియుతంగా అధిగ మించాం.

ఇంత బలీయంగా మన దేశంలో ప్రజాస్వామ్యం కొనసాగ డానికి మన ప్రజల చైతన్యమే కారణం అని చెప్పాలి. ఇంతటి రాజ కీయ చైతన్యం ప్రపంచంలో అమెరికా వంటి ప్రజాస్వామ్యం పరిఢవిల్లు తున్న దేశాలలో కూడా కనబడదు. అయితే మన రాజకీయ పార్టీలు, రాజ్యాంగబద్ధ వ్యవస్థలు తమ బాధ్యతలను సక్రమంగా నెరవేర్చలేక పోతున్నాయి. అందుకనే మన ప్రజాస్వామ్యంలో అనేక రుగ్మతలు కనిపిస్తున్నాయి.

ఏ రాజకీయ పార్టీలోనూ అంతర్గత ప్రజస్వామ్యం లేదు. అత్యధిక పార్టీలు కుటుంబం పార్టీలుగా మారిపోతే, బీజేపీ వంటి పార్టీలలో సహితం ఒకరిద్దరు వ్యక్తులే నిర్ణయాధికారం కలిగి ఉంటు న్నారు. అంతర్గతంగా సమాలోచనలు జరిపి, ప్రజాస్వామ్య బద్ధంగా నిర్ణయాలు తీసుకోవడం లేదు. రాజకీయ పార్టీలలో సంస్క రణలు లేకుండా ప్రజాస్వామ్యం పరిపుష్టి కావడం సాధ్యం కాదని గమ నించాలి.

ఒకే పార్టీకి దశాబ్దాల తరబడి ఒక్కరే నేతగా ఉండటం, లేదా వారి కుటుంబం సభ్యులు వారసత్వంగా రావడం పార్టీ అధ్య క్షుడిగా, ముఖ్యమంత్రిగా కూడా ఒక్కరే ఉండటం – ప్రజాస్వామ్యం అనిపించుకొంటుందా ? అటువంటి నేతల సారథ్యంలో ప్రజా స్వామ్యం, ఎన్నికల ప్రక్రియ నవ్వులపాలు కాకుండా ఉండగలదా ? వామపక్షాలను మినహాయిస్తే విధానపరమైన అంశాలపై ఏ పార్టీలో అయినా అంతర్గతంగా విస్తృత స్థాయిలో సమాలోచనలు జరుగు తున్నాయా ?

75 సంవత్సరాలకు పైబడిన వారిని పదవులకు దూరంగా ఉంచాలని బీజేపీ సాహసోపేత నిర్ణయం తీసుకోంది. అయితే ఈ నిర్ణయాన్ని ఒకరిద్దరు వ్యక్తులు, తమ రాజకీయ అవసరాల కోసం తీసుకున్నారా ? పార్టీలో అంతర్గతంగా చర్చించి ఒక అభిప్రాయానికి వచ్చారా ? మరో వంక వారసత్వ రాజకీయాలను వ్యతిరేకిస్తూ దాదాపు అన్ని పార్టీలు తమ తమ పరిధిలో వాటికి ఎందుకు పట్టం కడుతున్నాయి ?

రాజకీయ పార్టీలు నేడు ఒక విధంగా భావదారిద్ర్యంను ఎదుర్కొంటున్నాయి. ఏ పార్టీలో కూడా ఏ విధానపరమైన అంశం గురించి అయినా లోతైన చర్చ జరగడం లేదు. కేవలం అప్పటి ఎన్నికలలో ఏ నినాదం ఇస్తే నాలుగు ఓట్లు వస్తాయో అని మాత్రమే చూస్తున్నారు. పార్టీ ఆంతరంగిక వేదికలు సహితం నాయకుల సుదీర్ఘ ప్రసంగాలకు పరిమితం అవుతున్నాయి. అధినేతలను పొగడ్తలతో ముంచెత్తడం మినహా విధానపరంగా నిష్పక్షపాతంగా చర్చలు జరిపే సాహసం ఎవ్వరూ చేయలేక పోతున్నారు.

రాజకీయ పార్టీలు అంత దారుణంగా ఉన్నప్పటికీ మన ప్రజలు మాత్రం వాటికి మించి చైతన్యం ప్రదర్శిస్తున్నారు. ప్రతి పది ఎన్నికలలో దాదాపు 7 ఎన్నికలలో అధికార పక్షాలు ఓటమి చెందుతున్నాయి. సాధారణంగా అధికారంలో ఉన్న పక్షమే ప్రతి

పక్షాలకన్నా ఎక్కువగా ధనబలం, కండబలం చూపగలదు. అయినా ఓటమి తప్పడం లేదంటే, వాటి ప్రభావం ఎన్నికల ఫలితాలపై చాల పరిమితంగా ఉంటున్నట్లు స్పష్టం అవుతుంది.

70 ఏళ్ళు అవుతున్నా ఇప్పటికీ ఎన్నికల కమిషన్ పొరపాట్లు లేని ఓటర్ల జాబితాలను తయారు చేయలేకపోతున్నది. కమిషన్ పోలింగ్ కు రెండు వారాల ముందు ప్రకటించే జాబితాలో ఉన్న పేర్లు సహితం పోలింగ్ స్టేషన్‌కు వెడితే కనిపించడం లేదు. దీనికి ఎవ్వరు బాధ్యత వహించాలి ?

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సుమారు 60 లక్షల మంది అర్హులైన వారి పేర్లను తొలగించడం జరిగినట్లు స్వయంగా ఎన్నికల కమిషనర్ ఒప్పుకున్నారు. ఆయన విచారం వ్యక్తం చేయడంతో సరిపెట్టుకున్నారు. వాస్తవానికి మన ఎన్నికల వ్యవస్థ ప్రామాణికతను ప్రశ్నించే నేరమయ దుర్మార్గానికి కమిషన్ కారణం కావడం దారుణం. అందుకు ఎవ్వరు బాధ్యత వహించక పోవడం దుర్మార్గం.

ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాది మంది పేర్లను తొలగించడం కోసం ఆన్‌లైన్‌లో తప్పుడు దరఖాస్తులు అందుకున్నట్లు కమీషన్ ప్రకటించింది. ఆ విధంగా దురుద్దేశ్యంతో ఫారాలను దాఖలు చేసిన వారిపై ఎటువంటి చర్యకు ఉపక్రమించడం లేదు. అంటే ఒక విధంగా మన ఎన్నికల వ్యవస్థను కొన్ని దుష్టశక్తులు సవాలు చేసే రీతిలో వ్యవహరిస్తున్నా కమిషన్ ప్రేక్షక పాత్రకు పరిమితం కావడం ద్వారా పరోక్షంగా సహకారం అందిస్తున్నట్లు భావించాలి.

2019 ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తీరే పలు విమర్శలకు దారితీస్తుంది. ఎటువంటి సహేతుకత లేకుండా షెడ్యూల్ తయారు చేసినట్లు స్పష్టం అవుతుంది. ఈ విషయంలో కమిషన్ పారదర్శకంగా వ్యవహరించడం లేదు. యుపి, బీహార్, ఒడిశా వంటి రాష్ట్రాలలో అనేక దశలలో పోలింగ్ జరపవలసిన అవసరం ఎందుకు వచ్చిందో హేతుబద్ధంగా సమాధానం చెప్పలేక పోతున్నారు.

వాస్తవానికి ఎన్నికల కమిషన్ చాల చిన్న సంస్థ. దాని బలగం చాల తక్కువ. క్షేత్ర స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వాల రెవిన్యూ, పోలీస్ బలగాలపై ఆధారపడవలసి ఉంటుంది. అయితే ఎన్నికల కమిషన్ పై ఎటువంటి ఆరోపణలు చేసినా వాటిని పరిశీలించడానికి సహితం న్యాయస్థానాలు విముఖత వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోమని తిరస్కరిస్తూ వస్తున్నాయి.

తెలంగాణలో ఓట్ల అదృశ్యంపై మర్రి శశిధరరెడ్డి సుప్రీం కోర్టు వరకు వెడితే ఎన్నికల కమిషన్ కు కొన్ని సూచనలు చేయడం మినహా, దారుణాన్ని నివారించే ప్రయత్నం ఏ మాత్రమూ కోర్టు చేయలేక పోయింది. ఎన్నికల తర్వాత కూడా 60 లక్షల మంది ఓట్లు అదృశ్యం కావడానికి ఎవ్వరినీ జవాబుదారీ చేసే ప్రయత్నం చేయడం లేదు.

అనేక విషయాలలో తమకు సంబంధం లేని అంశాలలో సహితం ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకున్నా ఎవ్వరూ ప్రశ్నించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో డిజిపి, ఇతర పోలీసు అధికారులపై ప్రతిపక్షం ఆరోపణలు చేస్తే, వాటిని పక్కన పెట్టి నిఘా విభాగం అధిపతిని బదిలీ చేయమని ఆదేశించడం, ఎవ్వరూ ఒక్క ఆరోపణ కూడా చేయకుండానే ఇద్దరు ఎస్పీ లను బదిలీ చేయడం ఈ సందర్భంగా వివాదాస్పదంగా మారాయి. తమ చర్యలకు తగు సహేతుక కారణాలను ఎన్నికల కమిషన్ వివరించక పోవడంతో సంకుచిత రాజకీయ వత్తిడులకు లోనై పనిచేస్తున్నట్లు భావించ వలసి వస్తున్నది.

ఒకే అంశంలో ఒకొక్కసారి ఒకొక్క రకమైన ఆదేశం ఇవ్వడం కూడా చాలాసార్లు జరుగుతూ ఉంటుంది. నిబంధనల ఉల్లంఘనకు ఎవ్వరు పాల్పడినా ఒకే విధంగా స్పందిస్తే సమస్య ఉండదు. ఆ విధంగా చేయకుండా ఒకొక్కసారి ఒకొక్క రకంగా స్పందిస్తూ ఉండటం వల్లనే సమస్యలు ఏర్పడుతున్నాయి.

ఎన్నికల కమిషన్ వివిధ సందర్భాలలో తీసుకొనే నిర్ణయాలకు బాధ్యత వహించాలి. లోక్‌పాల్ వంటి వ్యవస్థల ముందు జవాబు దారిగా నిలబెట్టే అవకాశం ఉండాలి. అప్పుడే బాధ్యతాయుతంగా వ్యవహరించే అవకాశం ఉంటుంది. రాజకీయ ప్రలోభాలు, వత్తిడులకు అతీతంగా వ్యవహరించే వీలు ఏర్పడుతుంది.

ఎన్నికల కమిషన్‌తో పాటు చట్టసభలను నడిపించే స్పీకర్ల ప్రవ ర్తన సహితం ఈ సందర్భంగా ప్రస్తావించవలసిందే. వారిపైన కూడా ఎటువంటి ఆరోపణలతో వెళ్ళనా కోర్టులు స్వీకరించడం లేదు. అధికార పక్షంతో కలసి నిబంధనలను మంటగడుపుతున్నట్లు స్పష్టం అవుతున్నా కోర్టులు జోక్యం చేసుకోవడం లేదు. చట్టాన్ని అపహాస్యం చేసే స్పీకర్లపై తగుచర్య తీసుకోవలసిందే.

పార్టీ ఫిరాయింపుల చట్టమే అందుకు ప్రబల ఉదాహరణ. నంద్యాల ఎంపీ ఎస్పీవై రెడ్డి ఇంకా ప్రమాణస్వీకారం చేయకుండానే పార్టీ మారారు. అయినా లోక్‌సభ స్పీకర్ ఐదేళ్లపాటు ఎటువంటి చర్య తీసుకోలేదు. రెండు తెలుగు రాష్ట్రాలలో కూడా పార్టీలు ఫిరాయించిన వారు మంత్రి పదవులు కూడా పొందినా స్పీకర్లు ఎటువంటి చర్య తీసుకోకుండా కాలయాపన చేశారు.

స్పీకర్లు రాజకీయ వత్తిడులతో పనిచేస్తున్నారని వెడితే హై కోర్టు, సుప్రీం కోర్టులు కూడా జోక్యం చేసుకోలేదు. ప్రజాస్వామ్యం ఈ విధంగా అపహాస్యం చేయడానికి ఎవ్వరు బాధ్యులు? స్పీకర్లు, ఎన్నికల కమీషనర్లు చట్టానికి అతీతంగా వ్యవహరిస్తూ ఉంటే న్యాయ స్థానాలు ప్రేక్షక పాత్ర వహించడం ప్రజాస్వామ్యానికి చేటు అని గమనించాలి.

అనురాధ భట్ట
9010016555

తెలుగువారి నాట్యకళ



చంద్రముఖి...దక్షిణ భారతదేశం అంతా కలెక్షన్ల వర్షం కురిపించిన తమిళ సినిమా...

చంద్రముఖి అనే నర్తకి చుట్టూ కథ మొత్తం తిరుగుతుంటుంది...

సినిమా అంతా తమిళంలో ఉంటే ఈ చంద్రముఖి పాత్ర మాత్రం తెలుగులో మాట్లాడుతుంది..

ఓ తెలుగు పాట కూడా ఉంది..

కన్నడంలో అంతే హిట్టైన చిత్రం ఆప్తమిత్ర..

నాగవల్లి అనే నర్తకి చుట్టూ కథ మొత్తం తిరుగుతుంటుంది

చిత్రం అంతా కన్నడంలో ఉంటుంది..

కానీ నాగవల్లి మాత్రం తెలుగే మాట్లాడుతుంటుంది..

ఓ తెలుగు పాట కూడా ఉంది..

తమిళంలోనూ కన్నడంలోనూ కథానాయిక తెలుగే మాట్లాడటం వెనుక ఉన్న అర్థం ఏమిటి?

విజయనగర సామ్రాజ్య కాలంలో దక్షిణ భారతదేశం అంతా తెలుగు భాషే బాగా వ్యాప్తిలో ఉండేది..

ఈ సమయంలోనే దేవదాసీ వ్యవస్థ బహుళ ప్రజాదరణ పొందింది..

రాజ్యభాష తెలుగు కాబట్టి దేవదాసీలందరూ కూడా తెలుగుకే ఎక్కవ ప్రాధాన్యం ఇచ్చేవారు.. తెలుగులోనే పాడేవారు.. ఆడేవారు..

చంద్రముఖిలో.. ఆప్తమిత్రలో కూడా ఆనాటి వ్యవహారమే ప్రతిబింబించింది..

తెలుగువాళ్లకీ నాట్యానికీ ఉన్న సంబంధాన్ని ఓ సారి గుర్తుచేసింది..

2 వేల సంవత్సరాల కిందటే ఇక్కడి మనుషులకి నృత్యం తెలుసు..

అమరావతి శిల్పంలో.. నాగార్జున కొండ శిల్పంలో నర్తకీ నర్తకులు ఉన్నారు..

భరతముని నాట్యశాస్త్రంలో పేర్కొన్నటువంటి పిండి బంధం అనే బృందనృత్యాలు ఆనాడు ఉండేవని అమరావతి శిల్పం ద్వారా తెలుస్తోంది..

ఈ శిల్ప ఫలకంలో నలుగురు నాట్యకత్తెలు కలిసి నృత్యం చేస్తున్నారు..

ఈ శిల్పాలే కాకుండా శాతవాహనుల కాలానికే చెందిన గాథాసప్తశతి కూడా నాట్యం గురించి కొంత సమాచారం



అందజేస్తోంది..

హాలుడి గాథాసప్తశతి తెలుగు నేల మీదే పుట్టిన రచన..

ప్రజాకవులు రచించిన అమరగాథలను సేకరించి ప్రాకృతంలో తిరిగి రచించాడు హాల శాతవాహనుడు...

హాలుని రచనలో ఆనాటి నృత్యం.. రాసలీల.. రంగ స్థలం గురించి ప్రస్తావన ఉంది..

అయితే కాకతీయుల కాలంలో భరతుడి నాట్యశాస్త్రానికి భిన్నమైన నాట్యం ఉండేదని తెలియజేస్తున్నాయి ఇక్కడి శిల్పాలు.. కాకతీయుల శిల్పానికి మచ్చుతునక రామప్ప ఆలయం..

కాకతీయుల రాజధాని ఓరుగల్లు నేటి వరంగల్ కి 70 కిలోమీటర్ల దూరంలో పాలంపేటలో ఉంది రామప్ప గుడి..

ఈ రామప్ప గుడిని 1213లో నిర్మించారు..

అంటే నేటికి సరిగ్గా 800 సంవత్సరాలు అవుతోందన్నమాట..

ఈ ఆలయానికి మూడు వైపులా ద్వారాలు ఉన్నాయి..

ప్రతి ద్వారానికి అటూఇటూ నాలుగు మదనికల శిల్పాలు ఉన్నాయి..

ఒక్కో మదనిక ఒక్కో ఆహార్యంతో ఆకట్టుకుంటుంది.. తూర్పు ద్వారం దగ్గర ఉన్నటువంటి నాగిణి.. రాగిణి చాలా ప్రసిద్ధిచెందినవి..

నాగిణి పాములనే ఆభరణాలుగా.. దుస్తులుగా ధరించి పాములపై నృత్యం చేస్తోంది..

రాగిణి ప్రత్యేకత.. హైహీల్స్.. కుడి చేతిలో దివిటీ పట్టుకుని ఎక్కడికో వెళుతున్నట్టుగా పాదం ముందుకు వేసి నిలుచుంది...

ఈమె కట్టుకున్న చీర డిజైన్ చాలా స్పష్టంగా ఉంది.. ఓ శిల్పంలో ఇంతటి ఖచ్చితత్వం అంటే ఆశ్చర్యం వేస్తుంది..

8వందల ఏళ్ల క్రితం తెలుగు మహిళ హైహీల్స్ వేసుకునేది అంటే ఆనాడు ఫ్యాషన్లలో మనవాళ్లు ఎంత ముందున్నారో ఊహించవచ్చు..

ఈ సాలభంజిక ఓ నర్తకి.. విరిగిపోయిన నెక్లెస్ ను రెండువేళ్లతో బ్యాలెన్స్ చేస్తూ డాన్స్ చేస్తోంది.. ఈమె చేతి వేళ్లు ఎంతో నాజూకుగా ఉన్నాయి.. గోర్లను కూడా స్పష్టంగా చూడవచ్చు..

ఈ మదనిక ఓ ఆటవిక స్త్రీ.. చేతిలో విల్లు ఉంది.. తల్లో నెమలి పింఛం.. చుట్టూ లతలు.. చెట్లు..కోతి.. బాణంపైన నెమలి.. మొత్తం అటవీ వాతావరణమే ఉంది..

ఈమె కాలికి ముల్లు కుచ్చుకుంటే సేవకుడు ముల్లు తీస్తున్నాడు.. పాదం వాచినట్టుగా కూడా శిల్పంలో వ్యక్తమవుతోంది..

ఇటువంటి శిల్పమే 11 వ శతాబ్దికి చెందిన ఖజురహోలోనూ ఉంది..

కానీ రామప్పలోని రమణీయత.. సౌకుమార్యం ఇందులో కన్పించదు..

సాధారణంగా ఏ కట్టడమైనా లేదా ఆలయమైనా కూడా కట్టించిన రాజు పేరుమీదో లేక అక్కడి దేవుడి పేరుమీదో ప్రసిద్ధిచెందుతాయి..

కానీ ఈ ఒక్క ఆలయం మాత్రం శిల్పి.. రామప్ప పేరుమీదే స్థిరపడిపోయింది.. రామప్పలో ఇంకా ఎన్నో వింతలు ఉన్నాయి...

కాకతీయ చక్రవర్తి గణపతి దేవుడి సైన్యాధ్యక్షుడు జాయప సేనాని రచించిన నృత్యరత్నావళి ఆధారంగా రామప్ప ఆలయంలోని శిల్పాలను మలచారని అంటారు..

రామప్ప ఆలయాన్ని సున్నపు రాతితో నిర్మించారు.. కానీ మదనికలను మాత్రం నల్లని డోలమైట్ రాతితో చెక్కారు..

అందుకే ఇవి ప్రత్యేకంగా కన్పిస్తాయి...

ఈ సాలభంజిక మృదంగ నాదానికి నాట్యం చేస్తోంది.. ఈమె తలకి పాపిడ.. చేతికి ఉంగరాలు.. కాళ్లకి పట్టీలు ధరించింది..

ఈ సాలభంజిక కాళ్ల కింద సర్కస్ ఫీట్.. ఒక మనిషి పై మరో మనిషి. కర్రసాము చేస్తున్న మనిషి.

ఈ నాలుగు మదనికల హారాలు కూడా వేరువేరుగా ఉన్నాయి..

రామప్ప ఆలయంలో అణువణువూ శిల్పాలమయం..

శివుడి కళ్యాణం.. మహాభారత కథలు..

నర్తిస్తున్న నర్తకీబృందం.. వారితో జంత్యవాదక బృందం వీరంతా ఈ శిల్పంలో కదులుతున్నట్టే అన్పిస్తారు.. వారి ప్రతి కదలిక ఓ



సజీవ లయ..

కాకతీయ శిల్పంలోని ప్రధాన లక్షణమే గతిశీలత..

రామప్ప

కాకతీయుల కాలంలో మరో ప్రసిద్ధ నర్తనం భాండు.. దీనిని భాండులు అనే ప్రత్యేక తెగ ప్రదర్శించేవారట.. నేను ఇక్కడ ఇటువంటిది కన్పించదు..

కానీ కాశ్మీరు లోయలో భాండు నృత్య ప్రదర్శన ఈనాటికీ ఉంది..

ఈ బృంద నృత్యం అక్కడి నుండి ఇక్కడికి వచ్చిందో ఇక్కడి నుండి అక్కడికి వెళ్లిందో పరిశోధించాలి..

విజయనగర సామ్రాజ్యంలో నాట్యకళ బంగారు పూల అభిషేకాలను అందుకుంది..

నేటి హంపి శిథిలాలలో నృత్య శిల్పాలు ఎన్నో కనువిందు చేస్తాయి..

విజయనగర రాజవంశీయులు కూచిపూడి నాట్యాన్ని పోషించారు...

ఎన్నో అగ్రహారాలను ఈ కళాకారులకు ఇచ్చినట్టుగా శాసనాలు తెలియజేస్తున్నాయి..

ఆనాడు ప్రతి ఆలయ ప్రాంగణంలో ఓ నృత్య మండపం ఉండేదట..

పర్షియా రాయబారి అబ్దుల్ రజాక్ తన రచనల్లో విజయనగరంలోని నర్తకీమణుల గురించి కూడా రాశాడు..

అశ్వయుజ పూర్ణిమ నాడు సర్వాలంకార భూషితులై.. శృంగారపు కణికలై జంత్రగాత్రముల రాగమాలపించుచూ జవ్వనులు నృత్యములు చేసేవారని పేర్కొన్నాడు..

వారి రూప సౌందర్యాలు.. విలాసాలు.. హోయల గురించే కాకుండా వారు ఆచరించిన నాట్యాన్నీ ప్రత్యేకంగా అబ్దుల్ రజాక్ రాశాడు..

శ్రీకృష్ణదేవరాయలకు నృత్యాలంటే ఎంతో మక్కువ.. ఆకాలంలో రాణీ వాసపు స్త్రీలు కూడా నృత్య కళారాధకులే..

నృత్య ప్రధానమైన జాంబవతీ పరిణయం.. ఉషాపరిణయం వంటి నాటకాలను రాయలు రచించాడు..

మొత్తంగా చూస్తే తెలుగు నేల మీద నృత్యకళ రెండు విశిష్ట సంప్రదాయాలుగా అభివృద్ధి చెందింది.. ఒకటి నట్టువ మేళం.. రెండోది నాట్య మేళం..

స్త్రీలచే ప్రదర్శింపబడే నృత్యరీతి నట్టువ మేళం..

పురుషులచే ప్రదర్శింపబడే పద్ధతి నాట్యమేళం..

భారతదేశంలో ఏ ఒక్క ప్రదేశంలో కూడా ఈ రెండూ సమాన స్థాయిలో అభివృద్ధి చెందలేదు.. ఒక్క తెలుగు నేల మీద తప్ప..

మలయాళదేశంలో కథాకళి విశేషంగా ప్రజాదరణ పొందిన నృత్యరీతి.. దీనిని పురుషులే ప్రదర్శిస్తారు..

స్త్రీలు ప్రదర్శించే మోహిని ఆట్టం అంతటి విశిష్టస్థానాన్ని పొందలేదు..

తమిళదేశంలో కూడా భరతనాట్యానికి ఉన్న స్థానం భాగవత మేళానికి లేదు..

కానీ తెలుగు నేల మీద మాత్రం లాస్యకళాకారులు.. తాండవ కళారాధకులు ఒకరితో ఒకరు పోటీపడతారు..

పురుష నర్తకులచే ప్రదర్శించేవి వీధినాటకం.. యక్షగానం.. భాగవతం నాట్యమేళం సంప్రదాయానికి చెందినవి..

రాజ దర్బారులలో.. పండిత సభలలో ప్రదర్శించే నట్టువ మేళమే నేడు ఆంధ్రనాట్యంగా పేరుతెచ్చుకుంది..

ఇదే కొద్ది మార్పులతో దేశమంతా భరతనాట్యంగా స్థిరపడింది..

భారతీయ నృత్తకళావేత్తలు ప్రపంచ నృత్యకళకు సమర్పించిన అమూల్యరత్నం అభినయ కళ..

ఈ అభినయ కళకు ఓ విశిష్ట రూపం తీసుకువచ్చిన వారు తెలుగువారు..

క్షేత్రయ్య పద రచనతో సాత్వికాభినయ విధానం రూపుద్దికుంది..

కృష్ణా జిల్లా మొవ్వకు చెందిన క్షేత్రయ్య మొవ్వ గోపాలుడిపై వేల వేల పదములు రచించారు..

తన రచనల ద్వారా సాత్వికాభినయాన్ని ఓ ప్రత్యేక కళాంశంగా పెంపొందింపచేశాడు క్షేత్రయ్య..

క్షేత్రయ్యకు ముందు కూడా సాత్వికాభినయనం ఉన్నా కూడా ఇంతటి విశిష్ట రచనలు మరే భారతీయ భాషల్లోనూ కన్పించవు..

క్షేత్రయ్య పదాలు భావ.. రాగ ప్రాధాన్యం కల రచనలు.. పదములలో లయ ధ్వనిస్తుంది..

ఒక్కొక్క రాగంలో ఒక్కొక్క భావాన్ని ఎన్నో విధాలుగా ప్రదర్శించడానికి అనువుగా ఉంటాయి..

యక్షగానం రెండు విధాలుగా ఉంటుంది..

ఒకేపాత్ర ప్రసిద్ధగాథను నృత్యగానాల ద్వారా ప్రదర్శించడం ఓ పద్ధతి..

కథలోని పాత్రలను అనుసరించి బహు పాత్రలు సభలో ప్రవేశించి





నృత్యం చేయడం రెండో పద్ధతి..

అయితే ఈ రెండిటికీ అనువైన రీతిలో శ్రీకృష్ణ లీలా తరంగిణి రచన చేశారు నారాయణ తీర్థులు..

శ్రీకృష్ణ లీలా తరంగాలలోని పాటలను తరంగాలంటారు..

తరంగాలు తాళలయ ప్రాధాన్యత కలిగిన రచనలు..

* * *

తెలుగు నేలకు పర్యాయపదంగా మారిన నృత్యం కూచిపూడి ప్రాంతీయ పద్ధతిలో పారిజాత ప్రబంధాన్ని రచించి కలాప రూపంలో అందించినది సిద్ధేంద్ర యోగి..

ఈయనది కృష్ణాజిల్లాలోని కూచిపూడి..

కలాప సంప్రదాయంలో రచించిన భామాకలాపాన్ని కూచిపూడి బ్రాహ్మణులకు నేర్పించి వారి ద్వారా కృష్ణభక్తి. భాగవత ప్రచారం చేసిన మహానీయుడు సిద్ధేంద్ర యోగి.. అందుకే వీరి నందిరినీ భాగవతులంటారు..

వేదాంతం.. వెంపటి.. చింతా... ఇలా ఇంటి పేర్లు గల నాట్యమేళాల వారంతా కూడిపూడి వాస్తవ్యులే.. ఈ నృత్యాన్ని అభ్యసించి ప్రచారం చేసినవారే..

చాలా కష్టమైన ఈ భాగవత రీతిని మొదట్లో పురుషులు మాత్రమే ప్రదర్శించేవారు..

స్త్రీపాత్రలను కూడా పురుషులే ధరించి వేసేవారు..

1950 నుండి స్త్రీలు కూడా ఈ పద్ధతిని నేర్చుకుని ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించారు..

ప్రస్తుతం కూచిపూడి నాట్యమేళంగా కాక నృత్యప్రక్రియగానే ప్రసిద్ధి చెందుతోంది..

పూర్తిగా స్త్రీల నృత్యకళగా ప్రాచుర్యం తెచ్చుకుంది..

తమిళనాడులోని తంజావూరుకి 18 దూరంలో ఉంది మేలటూరు..

భాగవత నృత్య మేళానికి ఎంతో ప్రసిద్ధిచెందిన గ్రామం ఇది..

ప్రతి సంవత్సరం నరసింహ జయంతి రోజు ఇక్కడ భాగవత మేళ ప్రదర్శన ఇస్తారు..

ఈ నృత్యకారులు అందరూ తమిళులే.. కానీ ప్రదర్శన తెలుగులో ఉంటుంది..తెలుగు నాటకాలను తమిళ లిపిలో నేర్చుకుని సాధన చేస్తారు..

మేలటూరు వేంకట రామశాస్త్రి విరచిత ప్రహ్లాద చరిత్ర, హరిశ్చంద్ర మొదలైన సంగీత నృత్యనాటకాలను ప్రతీ ఏడాదీ మేనెలలో నృసింహజయంతి సందర్భంగా మేలటూరులో ప్రదర్శిస్తారు..

తంజావూరు నాయకరాజుల కాలం నుండి వస్తున్న పరంపరను వీరు కొనసాగిస్తున్నారు.. మన కూచిపూడి నుండే ఈ భాగవత మేళ ఏర్పడింది...

మేళత్తూరు

తెలుగు వారు దక్షిణ భారత నృత్యకళకు అర్పించిన మరొక నర్తనం పేరిణి శివతాండవం..

జాయపసేనాని తన నృత్యరత్నావళిలో పేరిణి లక్షణాలు.. సాధనా

క్రమాన్ని కూడా వివరించాడు..

కాకతీయుల కాలంలో యుద్ధవీరులు ఉత్తేజాన్ని ఆవహింపచేసుకోవడానికి ప్రత్యేకంగా ఈ నాట్యాన్ని ప్రదర్శించేవారట..

ఇది పూర్తిగా పురుషులు ప్రదర్శించే నాట్యరీతి.. ప్రపంచం మొత్తంలో పురుషులకంటూ ప్రత్యేకమైన నాట్యం పేరిణి ఒక్కటే అని చెప్పాలి.. ఇది చాలా ఉధృతమైంది.. కష్టమైనది.

భూకైలాస్

చరిత్రగతిలో దేదీప్యమానంగా వెలిగి పూర్తిగా మరుగునపడిపోయిన పేరిణిని పునఃసృష్టి చేసిన వారు పద్మశ్రీ డాక్టర్ నటరాజ రామకృష్ణ.

జాయప తెలియజేసిన విషయాలను విశ్లేషించి.. రామప్ప దేవాలయంలోని శిల్ప భంగిమలలో జీవత్వాన్ని దర్శించి పేరిణి మళ్లీ జీవించేలా చేశారు రామకృష్ణ.

తాండవ మూర్తియైన పరమశివుడి మూడు కన్నులలో కుడి కన్న నాట్యమేళం కూచిపుడి అని.. ఎడమకన్ను లాస్య సంబంధమైన ఆంధ్రనాట్యమనీ.. మూడో కన్ను పేరిణీ శివతాండవం అని నటరాజ రామకృష్ణ అనేక సార్లు తేల్చిచెప్పారు..

నాట్యానికే తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడు నటరాజ రామకృష్ణ..

ఇక ప్రజలే తమ వినోదం కోసం చేసే జానపద నృత్యాలు కూడా ఎన్నో ఉన్నాయి..

కుమ్మి.. గొబ్బి.. బతకమ్మ తదితర నృత్య బృందాలు స్త్రీలు చేసేవి అయితే తప్పెట గుండ్లు.. కోలాటం పురుషులు చేసేవి..

కత్తి సాము.. కర్రసాము వంటివి ఏకత్తెర నర్తన రీతులు..

మన తెలుగు నేల మీద ఆదినుండీ కూడా ఆటవిక జాతులకు నిలయంగా ఉంది..

అడవుల్లో సవరలు.. గదబలు..కోయలు.. చెంచులు.. గోండులు.. లంబాడీలు వంటి జాతులు ప్రదర్శించేవి గిరిజన నృత్యాలు..

ఈ నాట్యకళలే కాక ప్రాచీన కాలం నుండి తెలుగు దేశంలో ప్రచారంలో ఉన్న కళాఖండం తోలుబొమ్మలాట..

ఇక్కడి నుండే ఈ కళ తూర్పుదేశాలకు వెళ్లినట్టుగా ఆధారాలు ఉన్నాయి..

జావాలో తోలుబొమ్మలాటను వయాంగ్ అంటారు..

రామాయణ.. భారత కథల్ని ఈ తోలుబొమ్మలాటలో ప్రదర్శిస్తుంటారు..

భారతదేశం అంతా ఈ కళా ప్రదర్శనలో తెలుగువారే నిపుణులు అనడంలో అతిశయోక్తిలేదు...

ఇలా తెలుగు వారు నృత్యానికి ఎన్నో విధాలుగా సేవ చేశారు.. అందుకే తెనుగు దక్షిణాది సాంస్కృతిక భాష అనే పేరు వచ్చింది...

జసింత కెర్కెట్ట–ఝార్ఖండ్ కవిత్వం

జసింత కెర్కెట్ట (1983) : ఝార్ఖండ్ మనోహరపూర్‌కి చెందిన ఈమె 13 ఏళ్ల ప్రాయం నుండి కవిత్వం రాస్తున్నారు. చిన్న వయస్సులోనే అందరి దృష్టినీ ఆకర్షించిన ఆదివాసీ కవయిత్రి, పత్రికా రచయిత్రి. 41 కవితలతో 2016 లో ప్రచురించిన "అంగోర్ (నిప్పు కణిక)", 2018లో భారతీయ జ్ఞానపీఠ్ ప్రచురించిన "జడోంకీ జమీన్ (వేర్ల నేల)" కవిత్వ సంకలనాలు వెలువడ్డాయి. ఆ రెండు సంకలనాలూ ఆంగ్లంలోనూ, జర్మన్‌లోనూ ప్రచురించబడ్డాయి. మొదటి సంకలనం "అంగోర్" ఇటాలియన్ భాషలోనూ, సంతాలీ లోననూ కూడా ప్రచురించబడింది. కురుఖ్ / ఉరావ్ భాషకు చెందిన యువ కవయిత్రిగా గుర్తింపుతోపాటు, అనేక అవార్డులు సైతం పొందారు. ఆదివాసీ పునర్జీవనం కోసం రాస్తున్నానని ఆమె చెబుతుంది. ఆదివాసీల బలమైన గొంతు ఆమెదిపుడు.

మాతృభాష మరణం

నా మాతృభాష
అమ్మనోటిలోనే
ఖైదీ అయిపోయింది
మేము పిల్లలం
దానిని విడిపించాలని
కోరుతూ కోరుకుంటూనే
పెద్దవాళ్లం అయిపోయాం

మాతృభాష దానికదే మరణించలేదు
అది చంపేయబడింది
అమ్మ మాత్రం తెలుసుకోలేకపోయింది

తిండికోసం ఆశలు కల్పించే
కలల తలంపుల ముందు
తన పిల్లల కోసం ఆమె
తన పళ్లమధ్యనే దానిని ఉంచేసుకుంది
కలల భారం క్రింద
మాతృభాష నలిగిపోయింది

అదేమిటో
మాతృభాష మరణం
ఇప్పటికీ ఒక దుర్ఘటనగానే
అనుకుంటోంది అమ్మ


మూల రచయిత : జసింత కెర్కెట్ట
అనువాదం : ముకుంద రామారావు
9908347273

('విశాలాక్షి' మార్చి 2019 సంచిక నుండి – మప్పిదాలతో)

పుస్తక సమీక్ష

భూమిక

(సుధామ పీఠికలు – ముందుమాటలు)



సంపాదకులు : అల్లంరాజు ఉషారాణి
పుటలు : 469, వెల: 300/-
ప్రతులకు: ఎ. ఉషారాణి
స్నేహిత స్రవంతి, జి-12, సాదత్ టవర్సు
పద్మావతి అపార్ట్‌మెంట్స్, సలీంనగర్ కాలనీ
మలక్‌పేట, హైదరాబాదు : 500 036
ఫోన్ : 9849297958

ఒక కవి / రచయిత నిర్మించిన గ్రంథ హర్మ్యానికి, పీఠికలు, ముందుమాటలు సోపానాలుగ పాఠకులకు దోహద పడతాయి. అటువంటి పీఠికలు, ముందు మాటలు విరివిగా వ్రాసిన 'సుధామ' ఆంధ్ర పాఠక లోకానికి, ఆకాశవాణి శ్రోతలకు సుపరిచితులే! 1981 వ సం॥ నుండి 2018 సం॥ వరకు వెలువడిన కథా సంపుటాలు (07), నవల, కవిత్వ గ్రంథాలు (64), నాటక రచనలు (05), వ్యాస సంపుటులు (21) ఇతరములు (18) – ఇలా వివిధ సాహిత్య ప్రక్రియలలోని ఎన్నో గ్రంథాలకు 'సుధామ' వ్రాసిన ముందు మాటలను ఒక సంకలనంగా, భూమిక పేరున శ్రీమతి ఎ. ఉషారాణి సంపాదకత్వంలో ప్రచురించారు.

'సుధామ' – (అల్లంరాజు వెంకటరావు) తాను వ్రాసిన పీఠికలలో ఆయా భాష, సాహిత్యాలకు సంబంధించిన అంశాలను ఉటంకిస్తూ, ప్రస్తుత గ్రంథానికి అన్వయం చేస్తూ, ప్రోత్సాహకరంగాను, ఆత్మీయ స్పర్శతోను రచయితల వెన్ను తడుతూ ముందు మాటలు వ్రాసారు. వర్ధమాన రచయితలు / కవులు మాత్రమే కాదు, లబ్ధ ప్రతిష్ఠులైన ఆరుద్ర, సినారె, ఆచార్య తిరుమల, తురగా జానకీరాణి, వాసా ప్రభావతి, డి. కామేశ్వరి, మొ॥వారి గ్రంథాలకు సుధామ వ్రాసిన ముందు మాటలు ఎంతో హృద్యంగా ఉన్నాయి. యువభారతి పునర్ముద్రించిన కావ్యలహరి, మందారమకరందాలు, భోగనీలాస్యం, వేమన్న వేదం, వేద విజ్ఞాన లహరి ఉపనిషత్సుధాలహరి గ్రంథాలకు వ్రాసిన పీఠికలు, సుధామకు గల విశేష సాహితీ పరిజ్ఞానాన్ని, సాహిత్య ప్రక్రియలన్నింటిలో వచ్చిన గ్రంథాలను విశ్లేషించగల భాషా పటుత్వం మనకు తెలియ వస్తుంది. చక్కటి, సరళమైన శైలితో పాటు శబ్ద వైచిత్రి, అక్షర – పద విన్యాసాలు, సుధామ(య) సూక్తులతో అన్ని పీఠికలు పాఠక జనరంజకంగా ఉన్నాయనటం అతిశయోక్తి కాదు, 'సమాజ హిత చింతన'ను తమ రచనల అభివ్యక్తిగా గల వారందరూ సుధామకు ఇష్టులే! వారి రచనలకు సుధామ వ్రాసిన పీఠికలూ, ముందు మాటలూ ఆ యిష్టాన్నే ప్రతిఫలిస్తాయి. అయితే 115 పీఠికలు 'భూమిక' పేరున సంకలనంగా వెలువడినప్పుడు, తన పుస్తకానికి 'సుధామ' ముందుమాట వ్రాసుకోక పోవటం, ఎవరితోనైనా పీఠిక వ్రాయించకపోవటం గమనించదగివుంది.

ఎమ్. వి. శాస్త్రి
9441342999

కవిత

ఇకనైనా మేల్కొందాం

చుక్కనీరు కానరాక,
ఎక్కెక్కి ఏడుస్తోంది ప్రతీ జీవి.
ఎక్కడా నీరులేక,
ఏరులన్నీ ఎండమావులైనవి –
కరువు, దరువు వేసి మరీ ఆడుతోంది
కడలంతా తోడినా, కడవ నిండకున్నది –
ఇకనైనా మేల్కొందాం,

సిరులిచ్చే భూదేవి నెర్రెలిచ్చుతోంది,
మెతుకు పుట్టే, ఆ చోటు బీడు బారుతోంది
తడి జాడలేక, తల్లినేల తల్లడిల్లిపోతోంది,
తడారి, ఎడారైపోతోంది.
నీరులేక ప్రతి ఊరూ, కన్నీరై పోతోంది,
పశువు, పక్షి తేడా లేక, అందరి ప్రాణం పోతోంది.
తప్పిదం ఎవరిదైనా, దప్పిక తీర్చమని వేడుకుంటోంది,
దాహంతో జీవం పోకముందే, దయ తలచి ఆదుకోమంటోంది.
ఇకనైనా మేల్కొందాం

సూరీడు మంటకు, సెలవంటూ చెరువుల్లో నీరు
ఆవిరై వెళ్ళిపోయింది
సెగలెక్కిన ఆ నేల, చేపల శ్మశానంలా మిగిలిపోయింది..
వట్టిపోయి, నేల ప్రాణం పట్టుతప్పుతున్నది.
గట్టిపోరు చేయనిదే, ఇకపై, ఇలపై జీవం మిగలదన్నది...

ఇక చాలు ఈ దారుణం
ఇకనైనా మేల్కొందాం


ఇన్నినాళ్ళ నిట్టూర్పులకు ఇక సెలవు చెబుదాం,
ఉట్టి మాటలు ఇక చాలు, ఉద్యమమై కదులుదాం –
ఒక్కొక్క నీటి చుక్కను ఒడిసి పట్టుకుందాం
మొక్కవోని దీక్షతో ఈ సమరం సాగిద్దాం
ఇలను చేరే ప్రతీ నీటిబొట్టుని కాపాడుకుందాం
ఇంకుడు గుంతల్లో పదిలంగా దాచుకుందాం
జీవం ఇచ్చే ఈ నేల, దాహం తీర్చుదాం
జలమిచ్చిన బలంతో, జీవం, జీవితం పొందుదాం.
కరువు కూకటివేళ్ళతో పెకిలిద్దాం
ఏరులన్నీ నిండగ, ఏరువాక సాగిద్దాం –

– డా॥ సిరి

పుస్తక సమీక్ష

గండికోట నాయక రాజుల చరిత్ర

పౌరాణిక, చారిత్రక, సామాజిక పరిశోధనా గ్రంథం



రచన : భట్టరుశెట్టి పద్మారావురాయలు
వెల: 200/-
పబ్లిషర్స్: అన్నయ్యగారి అమరనాథ్ రాయలు, ఎ.కె.ఆర్.మినరల్స్ ప్రైవేట్ లిమిటెడ్, కృష్ణప్ప నగర్, రైల్వేస్టేషన్ దగ్గర, కడప
సెల్ : 9010429826

పైకి ఎవరు ఎన్ని మాటలు చెప్పినా, అంతరంగంలోను, ఆంతరంగికుల దగ్గర తమతమ కులం గురించిన మూలాల గురించిగాని, విశిష్టత గురించిగాని, సమస్యల గురించిగాని చర్చించని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. అటువంటిది ఏకంగా, ఒక కులం గురించిన బృహత్ పరిశోధనాగ్రంథం వెలువరించటం నిజంగా విశేషమే! కులాల గురించిన ప్రసక్తి, చర్చలు చాల సున్నిత అంశాలుగా ఉంటున్న నేటి సమాజంలో 'గండికోట నాయక రాజుల చరిత్ర' పేరున భట్టరు శెట్టి పద్మారావు రాయలు ఎంతో కృషి చేసి, 69 అధ్యాయాలలో ఒక సిద్ధాంత గ్రంథంలా రూపొందించారు. తన సిద్ధాంతానికి అనుగుణంగా ఎన్నో పౌరాణిక, చారిత్రక, సామాజిక పరిశోధనల ద్వారా కొన్ని కొత్త విషయాలను, మన ముందుకి తెచ్చారు. కొందటి విషయంలో, చరిత్రకారులు లేదా కొన్ని కులాల వారు వక్ర భాష్యాలను, పొరపాట్లు చేసారని ఘాటు విమర్శలు కూడా చేశారు రచయిత.

క్రీ.శ.1123 వ సం॥ నుండీ – అంటే గండికోటను నిర్మించిన కాకరాజు కాలం నుండీ (అసలు పేరు చిద్దనచోళ మహారాజు) క్రీ.శ. 1799 సం॥ బ్రిటిష్ కుంఫిణీవారు కడప రాజ్యాన్ని స్వాధీనం చేసుకున్నంత వరకు – ఏయే పాలకులు గండికోటకు ఏలికలుగా ఉన్నారో ఈ గ్రంథంలో చాల వివరణాత్మకంగా తెలియచేశారు. స్థూలంగా చెప్పాలంటే గండికోటను కొన్ని వందల సం॥లు క్షత్రియ బలిజలే పాలించారని, 30 సం॥లు కమ్మవారు పాలించారని, మహమ్మదీయులు 150 సం॥లు పాలించారని ప్రతిపాదిస్తూ చాల ఆధారాలను – పౌరాణిక, చారిత్రక, సామాజిక పరంగా అన్వయించారు. ఎన్నో పురాతన శాసనాలను (15వ శకం నాటి తిరుమల శాసనం ; క్రీ.శ. 1272 నాటి త్రిపురాంతక శాసనం ; క్రీ.శ. 1521 నాటి శ్రీ వీర బలిజ శాసనము మొ॥వి), ప్రసిద్ధ గ్రంథాలయిన ఆముక్తమాల్య, రాయవాచకము, కుమార ధూర్జటి వ్రాసిన కృష్ణరాజ విజయం యొక్క ప్రస్థావన, ఎన్నో కైఫియత్‌ల ప్రస్తావన తీసుకు వచ్చారు.

ఈ పరిశోధన గ్రంథంలో గండికోట నాయకుల చరిత్రను చాల విపులంగా చర్చించిన రచయిత, ఆయా సందర్భాలలో వ్యక్త పరచిన అభిప్రాయాలు చర్చకు పెట్టబడి, ప్రామాణికతలు నిర్ధారింపబడినట్లయితే, రచయిత అభివ్యక్తం చేసిన వాటితో పాఠ కులూ ఆమోదించే అవకాశం వస్తుంది. రచయిత వ్యక్తం చేసిన వాటిలో ప్రధానమైనవి. – వ్యవసాయం, రాజ్యపాలన, వాణిజ్యము వృత్తిగాగల బలమైన జాతి, బలిజజాతి నుండి 'జ' న్మించిన – ఆ బలిజ జాతి (గౌరీ పుత్రులు) నుండి వర్ణములు, కులములు ఏర్పడి, చరిత్రలో ఏదో ఒక దశలో విడిపోయి, వారు చేయు వృత్తులను బట్టి కులములుగా ఏర్పడినవి. శ్రీకృష్ణదేవరాయలు యదువంశ్ క్షత్రియుడని, కొందరు; కమ్మ, గొల్ల, బోయ, ముతరాశి వంటి కులాల వ్యక్తులు కొందరు తమ వాడంటూ సరయిన ఆధారాలు లేకుండా చాటుకోవటం చరిత్రను తప్పుపట్టటమే అని రచయిత ఖండించారు. తుళువ శ్రీకృష్ణదేవరాయలు చంద్రవంశ బలిజ క్షత్రియులని, వీరి వంశాల వారే క్షత్రియ బలిజవారిగా మారినట్లు అనేక తరాల నుండి బలిజ వంశీయులు తెలియచేస్తున్నారని రచయిత అభిప్రాయ పడ్డారు.

ముందు వాక్యాల్లో చెప్పినట్లు రచయిత ప్రతిపాదించిన విషయాలపై యింకా విస్తృత చర్చలు, ప్రామాణికాలతో, ఆధారాలతో (చారిత్రక) కూడిన నిర్ధారణ జరగాలి. రచయిత విద్యాధికుడు కాకున్నా చేసిన కృషి, పరిశోధన ప్రశంసించాల్సిందే. గండికోట పాలకుల వారసులు యిప్పుడు ఏఏ ప్రదేశాలలో ఉన్నదీ, వారి వారసులుగా ఉన్న సుమారు 200 బలిజ కుటుంబాల వివరాలతో పాటు సప్త ఋషుల గోత్రములు గల క్షత్రియ బలిజల గోత్రాల వివరాలు – ఈ విధంగా ఎంతో విషయ సేకరణ చేసి, ఆ వర్గానికి సంబంధించిన సమగ్ర గ్రంథంగా తీర్చి దిద్దారని చెప్పవచ్చు. శ్రీ కృష్ణదేవరాయలు – (చంద్రవంశ బలిజ క్షత్రియుడు) ఆపు సాహితీ క్షేత్రము, కాకతీయ బలిజ కాపురాజుల చరిత్ర, అఖిల భారత బలిజ కాపు స్వాతంత్ర్య సమర యోధులు మొ॥ గ్రంథాలు ప్రచురించి ఇప్పుడు గండికోట నాయక రాజుల చరిత్ర వ్రాశారు.

రచయిత ప్రయత్నం, కృషి, అధ్యయనాలు ప్రశంసనీయం!

ఎమ్.వి.శాస్త్రి
9441342999




బంగోరె జాబులు : లేఖలు
సంపాదకులు : డా॥ కాళిదాసు పురుషోత్తం
డా॥ మచవోలు శివరామ ప్రసాద్
పుటలు: 168, వెల :150/-
ప్రతులకు :డా॥ కె.పురుషోత్తం, లీలా గ్రాండ్యూర్ అపార్ట్‌మెంటు, 2వ అంతస్తు, ఫ్లాట్ నెం. 103, శాంతి నగర్, నెల్లూరు - 524 003
సెల్ : 9000642079



పారిస్ కమ్యూన్ : సామాజిక విప్లవ ఉషోదయం
పరిచయం : రంగనాయకమ్మ
పుటలు: 160, వెల: రు.50/-
ప్రతులకు: అరుణా పబ్లిషింగ్ హౌస్
ఏలూరు రోడ్డు, విజయవాడ - 520 002
సెల్ : 9440630378




సహచరులు (వరవరరావు జైలు లేఖలు)
రచన : వరవరరావు
పుటలు:120, వెల: రు.100/
ప్రతులకు: పి.హేమలత
ఫ్లాట్ నెం. 419, హిమసాయి హైట్స్, వీధి నెం. 6
జవహర్ నగర్, గాంధీనగర్
హైదరాబాద్ - 500 020



మట్టికాళ్ల మహారాక్షసి
రచన: గూగీవా థియాంగో,తెలుగు : వరవరరావు
పుటలు: 324, వెల: 200/-
ప్రతులకు :స్వేచ్ఛా సాహితి
జి-1, మైత్రి రెసిడెన్సీ, 3వ వీథి, హిమాయత్ నగర్
హైదరాబాదు - 29



బందీ
ఒక రచయిత జైలు డైరీ
రచన: గూగీవా థియాంగో, తెలుగు : వరవరరావు
పుటలు:288, వెల: రు.200/-
ప్రతులకు: స్వేచ్ఛా సాహితి
జి-1, మైత్రి రెసిడెన్సీ, 3వ వీథి, హిమాయత్ నగర్
హైదరాబాదు - 29




భీమా కోరేగాం 12 -వి.వి.
వ్యాసాలు, నివేదికలు
రచన : ఎన్. వేణుగోపాల్
పుటలు:72 వెల: రు.50/-
ప్రతులకు : వీక్షణం, మైత్రి రెసిడెన్సీ, 3-6-394
వీధి నెం 3, హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500 029
ఫోన్ : 040-66843495




మాటిగరి (నవల)
తెలుగు అనువాదం : వ్యోమ
పుటలు: 158, వెల: రు.120/-
ప్రతులకు :స్వేచ్ఛా సాహితి
జి-1, మైత్రి రెసిడెన్సీ, 3వ వీథి, హిమాయత్ నగర్
హైదరాబాదు - 29




బసవ పురాణము
ప్రచురణ : కరీంనగర్ సాహితి
పుటలు:200, వెల: రు.250/-
ప్రతులకు: కరీంనగర్ సాహితి
ఇం.నెం. 2-10-1524/10, ఫ్లాట్ నెం.403
వెంకటేశ్వరటవర్స్, జ్యోతినగర్, కరీంనగర్ -1
ఫోన్ : 0878-2243026




ఆంధ్రప్రదేశ్‌లో పేరంటాళ్ళు
రచన : డా॥ కోనేరు లక్ష్మీ ప్రమీల
పుటలు : 260, వెల : 90/-
ప్రతులకు: కోనేరు లక్ష్మీ ప్రమీల, 54-16-1/10
ఫ్లాట్ నెం. 5, రోడ్ నెం. 1
వెటర్నరీ కాలనీ, విజయవాడ - 8,
సెల్: 9490634849



చీకటి లోకంలో తొంభై రోజులు
సాహిత్య వ్యాసాలు
తెలుగు అనువాదం : సడ్లపల్లె చిదంబర రెడ్డి
పుటలు: 72, వెల: రు.60/-
ప్రతులకు :స్వేచ్ఛా సాహితి
జి-1, మైత్రీ రెసిడెన్సీ
3వ వీథి, హిమాయత్ నగర్, హైదరాబాదు - 29



సాలోచన - సాహిత్య వ్యాసాలు
రచయిత : డా॥ అప్పిరెడ్డి హరినాథరెడ్డి
పుటలు: 300, వెల: రు.100/-
ప్రతులకు :వేమన స్టడీ & డిపార్ట్‌మెంట్ సెంటర్
తల్లకాల్వ (గ్రా॥) గండ్లెపెంట మండల్
అనంతపురం (జి)- 515 521
ఫోన్ : 99639 17187



పూనాలో పూచిన నానీలు : కవిత్వం
రచయిత:సీతా సుధాకర్
పుటలు:100, వెల: రు.100/-
ప్రతులకు : అన్ని పుస్తక విక్రయ కేంద్రాలు
ఆంధ్రా మరియు తెలంగాణ
ఫోన్ : 09765390399

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

ఏబయ్యారు వాద్యాలు....నూటొక్క రాగాలు
మచ్చుకు ఇవి కొన్ని....


ముగ్గురు గోంథడి సంగీత కచేరి


గ్రామాన్ని మేల్కొలిపే బాల సంతుల సంగీతం



పిల్లనగ్రోవి డమరుకంలతో గురవయ్యలు


గుత్తికోయల సంగీత నృత్యాల కచేరి



ముఖానికి సంగీతం వెలువరించే నెమలిపింఛం కట్టుకొని


పిల్లనగ్రోవి సంగీతానికి డప్పుల దరువు

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
April 2019 Vol :5, Issue 2
Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month
RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/13/2018-20

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244